

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 17-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 303 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి ఉ. 8.17 తదుపరి నవమి; నక్షత్రం: కృత్తిక ఉ. 8.47 తదుపరి రోహిణి; వర్జ్యం: రా.1.11-2.50; దుర్ముహూర్తం: ఉ.6.45-8.17; అమృతఘడియలు: శేషం.7.57, తె.6.07; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.45; సూర్యాస్తమయం: 6.14 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





'గో ఫస్ట్' రేసులో స్పైస్‌జెట్

బిడ్ దాఖలు చేసిన సంస్థ చైర్మన్ అజయ్ సింగ్
పోటీలో స్కై వన్ కూడా..

న్యూఢిల్లీ: దేశీయ బడ్జెట్ ఎయిర్‌లైన్ స్పైస్‌జెట్ తన కార్యకలాపాలను మరింత విస్తరించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా మూతపడి, దివాలా ప్రక్రియలో ఉన్న 'గో ఫస్ట్' ఎయిర్‌లైన్స్‌ను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తోంది. కంపెనీ సీఎండీ అజయ్ సింగ్ ఇందుకోసం ఇప్పటికే బిడ్ దాఖలు చేశారు. బిజీ బీ ఎయిర్‌వేస్ అనే సంస్థతో కలిసి ఆయన వ్యక్తిగత హోదాలో ఈ బిడ్ దాఖలు చేశారు. స్పైస్‌జెట్‌తో పాటు గో ఫస్ట్ కొనుగోలు కోసం షార్జా కేంద్రంగా పనిచేసే స్కై వన్ ఎఫ్‌జెడ్‌ఈ కూడా బిడ్ దాఖలు చేసింది. అయితే ఈ రెండు సంస్థలు ఎంత మొత్తానికి బిడ్లు సమర్పించాయనే విషయం వెల్లడి కాలేదు.

ఎందుకీ కొనుగోలు?

నిజానికి స్పైస్‌జెట్ ఇప్పటికే అనేక సమస్యల్లో ఉంది. ఆర్థిక పరిస్థితీ అంతంత మాత్రంగానే ఉంది. ఖర్చుల హేతుబద్దీకరణ పేరుతో 1,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. ఈ సమస్యల నుంచి బయటపడేందుకు ఇటీవలే ఇన్వెస్టర్ల నుంచి రూ.744 కోట్లు సమీకరించింది. ఇవి చాలక మరో రూ.1,000 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతోంది.

అయినా గో ఫస్ట్ కోసం పోటీపడుతోంది. ఈ కొనుగోలు ద్వారా దేశీయ విమానాశ్రయాల్లో గో ఫస్ట్‌కు ఉన్న స్లాట్లు, అంతర్జాతీయ ప్రయాణ హక్కులు దక్కితే ఎయిర్ ఇండియా, ఇండిగో పోటీని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని స్పైస్‌జెట్ అంచనా. ఈ కారణంతోనే మూతపడిన గో ఫస్ట్ కోసం పోటీపడుతోందని భావిస్తున్నారు.

మాకే వస్తుంది: స్కై వన్

స్పైస్‌జెట్ పోటీలో ఉన్నా గో ఫస్ట్ కొనుగోలు మీద స్కై వన్ చాలా ఆశలు పెట్టుకుంది. 'ప్రపంచ విమానయాన రంగంలో మాకు అపార అనుభవం ఉంది. కాబట్టి గో ఫస్ట్ మాకే వస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని ఆ సంస్థ చైర్మన్ జైదీప్ మీర్‌చందానీ ఒక ప్రకటనలో తెలిపారు. స్కై వన్‌కు ప్రయాణికుల విమానాలతో పాటు సరుకుల రవాణా విమానాల్లోనూ మంచి ప్రవేశం ఉంది.

2023-24లో టెక్ పరిశ్రమ ఆదాయం
రూ.21 లక్షల కోట్లు

వృద్ధికి ఢోకా లేదు..కొత్తగా 60,000 కొలువులు: నాస్కామ్

ముంబై: ఆటుపోట్లు ఉన్నా టెక్నాలజీ పరిశ్రమ దూసుకుపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) ఈ పరిశ్రమ ఆదాయం 25,400 కోట్ల డాలర్లకు (సుమారు రూ.21.08 లక్షల కోట్లు) చేరుకుంటుందని టెక్ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే నాస్కామ్ అంచనా వేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 3.8 శాతం ఎక్కువ. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా కంపెనీలు టెక్నాలజీపై చేసే ఖర్చులు 50 శాతం తగ్గించుకున్నాయి. దీంతో భారత ఐటీ కంపెనీలకు వచ్చే కాంట్రాక్టులూ 6 శాతం పడిపోయాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నా దేశీయ టెక్ పరిశ్రమ ఆదాయం 3.8 శాతం వృద్ధి రేటుతో రూ.21.08 లక్షల కోట్లకు చేరడం విశేషం.



కలిసొచ్చే అంశాలు

హార్డ్‌వేర్ రంగాన్ని మినహాయించినా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం టెక్ పరిశ్రమ ఆదాయం 19,900 కోట్ల డాలర్లకు (సుమారు రూ.16.51 లక్షల కోట్లు) చేరనుంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 3.3 శాతం ఎక్కువ. ఈ ఆర్థిక సంవత్సరం దేశీయ కంపెనీల నుంచి లభించే ఆదాయమే 5.9 శాతం (930 కోట్ల డాలర్లు) పెరిగి 5,440 కోట్ల డాలర్లకు చేరుతుందని నాస్కామ్ అంచనా. 'ఎగుమతుల వృద్ధి రేటు కొద్దిగా తగ్గినా, దేశీయ మార్కెట్ ఆదాయం చెప్పుకోదగ్గ స్థాయిలో పెరగడం ఇందుకు ప్రధాన కారణం. దేశీయ మార్కెట్ ఆదాయం గతంలో ఎన్నడూ ఇంత వేగంగా పెరగలేదని భావిస్తున్నా' అని నాస్కామ్ ప్రెసిడెంట్ దేబ్‌జానీ ఘోష్ అన్నారు. రాజకీయ సుస్థిరత, నిపుణులైన ఉద్యోగులు లభించడం, ప్రభుత్వం అనుసరిస్తున్న సులభతర వాణిజ్య విధానమూ ఇందుకు దోహదం చేయనుంది.

కొత్త కొలువులు

ఇంజనీరింగ్ కాలేజీల నుంచి ఏటా బయటికి వచ్చే గ్రాడ్యుయేట్లలో ఎక్కువ మంది ఏదో ఒక టెక్ కంపెనీలో ప్లేస్‌మెంట్ కోసం ఆరాటపడతారు. అమెరికా, ఐరోపా దేశాల ఆర్థిక కష్టాలతో ఈ సంవత్సరం భారత టెక్ కంపెనీలకు వచ్చే ప్రాజెక్టులు తగ్గాయి. దీంతో కంపెనీలూ ప్లేస్‌మెంట్లు తగ్గించాయి. కొన్ని కంపెనీలైతే ఈ సంవత్సరం ప్లేస్‌మెంట్ల కోసం ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్లడమే మానేశాయి. ఉన్న ఉద్యోగులకే కొత్త టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చి నెట్టుకొస్తున్నాయి. ఇన్ని సమస్యలున్నా ఈ ఆర్థిక సంవత్సరమూ దేశీయ టెక్ కంపెనీలు 60,000 మంది ఉద్యోగులను తీసుకుంటాయని నాస్కామ్ అంచనా. దీంతో దేశీయ టెక్ పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య ఈ ఆర్థిక సంవత్సరం చివరికి 54.3 లక్షలకు చేరనుంది. బహుళ జాతి సంస్థ (ఎంఎన్‌సీ)లు భారత్‌లో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్లు (జీసీసీ) ఇందుకు తోడ్పడతాయని ఘోష్ తెలిపారు.

దిద్దుబాటు తప్పదు

ప్రస్తుతం టెక్ కంపెనీల్లో కొనసాగుతున్న ఉద్యోగుల తీసివేతలపైనా నాస్కామ్ చీఫ్ ఘోష్ మాట్లాడారు. కొవిడ్ సమయంలో అవసరానికి మించి ఉద్యోగులను తీసుకున్నందున, ఇప్పుడు ప్రాజెక్టులు లేకపోవడంతో కంపెనీలు వారిని తొలగిస్తున్నారు. ఇది దిద్దుబాటు (కరెక్షన్) మాత్రమే తప్ప తీసివేతలు కాదన్నారు. పరిశ్రమ అభివృద్ధికి ఇలాంటి దిద్దుబాట్లు తప్పవన్నారు. ప్రస్తుతం టెక్ రంగంలో కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనాలిసిస్, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో మాత్రమే పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఉన్నట్టు ఆమె చెప్పారు. కంపెనీలు కొత్తగా ఉద్యోగులను తీసుకునే బదులు, ఉన్న ఉద్యోగులకే ఈ డొమైన్స్‌లో శిక్షణ ఇచ్చి ఉపయోగించుకుంటున్నట్టు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే కంపెనీలు 6.5 లక్షల మంది ఉద్యోగులకు ఏఐలో శిక్షణ ఇచ్చి ఉపయోగించుకుంటున్నట్టు చెప్పారు.

వచ్చే నెల 15లోగా
పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఖాతాదారులకు ఆర్‌బీఐ సూచన
ఆంక్షల అమలుకు మరో 15 రోజులు గడువు

ఇతర బ్యాంకులకు మారిపోండి

ముంబై: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) విషయంలో విధించిన ఆంక్షల అమలుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరో 15 రోజులు గడువు ఇచ్చింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయం ప్రకారం ఆంక్షలు మార్చి 15 నుంచి అమలులోకి వస్తాయి. ఈ లోగా తమ ఖాతాలను ఇతర బ్యాంకుల్లోకి మార్చుకోవాలని పీపీబీఎల్ ఖాతాదారులు, మర్చంట్లకు ఆర్‌బీఐ సూచించింది. కస్టమర్ల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని గడువు పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. పీపీబీఎల్ విదేశీ మారక నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నదంటూ జనవరి 31వ తేదీన ఆర్‌బీఐ ప్రకటించిన ఆంక్షల గడువు ఈ నెల 29 వరకు ఉంది. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేందుకు ప్రజలకు మరింత గడువు అవసరం అవుతుందని భావించినట్టు ఆర్‌బీఐ తాజా ప్రకటనలో తెలిపింది. మార్చి 15వ తర్వాత కూడా కస్టమర్ల సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలు, కరెంట్ అకౌంట్లు, ప్రీపెయిడ్ సాధనాలు, ఫాస్టాగ్‌లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డుల్లో ఉన్న సొమ్ము పూర్తయ్యే వరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా అనుమతించనున్నట్టు ఆర్‌బీఐ వెల్లడించింది. అలాగే పీపీబీఎల్ కస్టమర్లు, సాధారణ పౌరుల అనుమానాలు నివృత్తి చేసే 30 ఎఫ్ఏక్యూలను కూడా ఆర్‌బీఐ శుక్రవారం విడుదల చేసింది.

ఎఫ్ఏక్యూలు..

- మార్చి 15 తర్వాత కస్టమర్లు తమ పీపీబీఎల్ ఖాతాలోకి సొమ్ము బదిలీ చేసే అవకాశం ఉండదు. వడ్డీలు వినహా స్వీప్-ఇన్ విధానంలో భాగస్వామ్య బ్యాంకుల నుంచి సొమ్ము జమ చేయడం, వాపసు చేయడం, క్యాష్ బ్యాక్ వంటివి కూడా అనుమతించరు.
- వచ్చే నెల 15 లోగా కస్టమర్లు అసౌకర్యాన్ని నివారించుకోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి.
- భాగస్వామ్య బ్యాంకులతో పీపీబీఎల్ కస్టమర్లు నిర్వహిస్తున్న ఖాతాలోని సొమ్మును పీపీబీఎల్‌కు వాపసు తెచ్చుకోవడానికి (స్వీప్-ఇన్) రూ.2 లక్షల గరిష్ఠ పరిమితికి లోబడి అనుమతిస్తారు. అయితే తాజా డిపాజిట్లను మాత్రం అనుమతించరు.
- మార్చి 15వ తేదీ తర్వాత కస్టమర్ల వేతనాలు, పెన్షన్లు కూడా పీపీబీఎల్ ఖాతాలో జమ కావు. పీపీబీఎల్ ద్వారా ఈఎంఐలు, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లు చేసుకునే వారు కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఫాస్టాగ్ కస్టమర్లు తమ ఖాతాలోని సొమ్ము పూర్తయ్యే వరకు దాన్ని ఉపయోగించుకుని మార్చి 15 లోగానే ఇతర బ్యాంకుకు చెందిన ఫాస్టాగ్‌ను కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది.
- పేటీఎం క్యూఆర్‌కోడ్, పేటీఎం సౌండ్ బాక్స్, పేటీఎం ఖాతాతో అనుసంధానం చేసిన పేటీఎం పీఓఎస్ టెర్మినల్ ఉపయోగించే వ్యాపారులు మార్చి 15 తర్వాత ఆ సర్వీసు ఉపయోగించుకునే వీలుండదు. ఇతర ప్రత్యామ్నాయాలు అన్వేషించుకోవాలి. ఇతర బ్యాంకు ఖాతాతో అనుసంధానమైన క్యూఆర్ కోడ్ తీసుకోవాలి. అయితే మీ నిధుల బదిలీ కార్యకలాపాలు ఇతర బ్యాంకు ఖాతాతో అనుసంధానమై ఉంటే మాత్రం మార్చి 15 తర్వాత కూడా దాన్ని యథాతథంగా ఉపయోగించుకోవచ్చు.

నోడల్ ఖాతా యాక్సిస్ బ్యాంక్‌కు బదిలీ

పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఓసీఎల్) తమ నోడల్ ఖాతాను పీపీబీఎల్ నుంచి యాక్సిస్ బ్యాంక్‌కు మార్చుకుంది. దీనివల్ల పేటీఎం క్యూఆర్, సౌండ్ బాక్స్, కార్డ్ మెషీన్లు మార్చి 15 తర్వాత కూడా పని చేస్తాయని రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో ఓసీఎల్ తెలిపింది. వ్యాపారులకు నిరంతరాయంగా సెటిల్మెంట్ చేయడానికి వీలుగా యాక్సిస్ బ్యాంక్‌లో ఎస్క్రో ఖాతాను ప్రారంభించినట్టు తెలియచేసింది. ఓసీఎల్ పూర్తి యాజమాన్య సంస్థ పేటీఎం పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ (పీపీసీఎల్) ఇప్పటికే యాక్సిస్ బ్యాంక్ సేవలను ఉపయోగించుకుంటోంది.

పేటీఎం ఫాస్టాగ్ ఇక బంద్
జాబితా నుంచి తొలగించిన ఎన్‌హెచ్‌ఏఐ

టోల్ వసూలు బాధ్యతలు నిర్వర్తించే ఎన్‌హెచ్‌ఏఐ అనుబంధ సంస్థ ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌ఎంసీఎల్) తన అధీకృత బ్యాంకుల జాబితా నుంచి పేటీఎంను తొలగించింది. దీంతో ఇకపై ప్రజలు పేటీఎం ఫాస్టాగ్ సేవలను ఉపయోగించుకునే అవకాశం ఉండదు. ఎలాంటి అంతరాయాలు లేకుండా ప్రయాణాలు చేసేందుకు వీలుగా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను వదిలి తమ జాబితాలోని 32 ఇతర అధీకృత బ్యాంకుల నుంచి ఫాస్టాగ్స్ కొనుగోలు చేసుకోవాలని ప్రజలకు సూచించింది. దేశం మొత్తం మీద 8 కోట్ల మంది ఫాస్టాగ్ యూజర్లుండగా అందులో పీపీబీఎల్ వాటా 30 శాతం ఉంది.

సెన్సెక్స్ మరింత పైకి

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో పాటు కొన్ని బ్లూచిప్ షేర్లకు లభించిన కొనుగోళ్ల మద్దతుతో ఈక్విటీ మార్కెట్ వరుసగా నాలుగో రోజు కూడా లాభాలు నమోదు చేసింది. శుక్రవారం సెన్సెక్స్ మరో 376.26 పాయింట్లు లాభపడి 72,426.64 వద్ద ముగియగా నిఫ్టీ 129.95 పాయింట్లు లాభపడి 22,040.70 వద్ద ముగిసింది. సానుకూల సంకేతాల నడుమ మార్కెట్లో రికవరీ విస్తృతంగా ఉన్నదని పరిశీలకులంటున్నారు. సెన్సెక్స్ షేర్ల లో విప్రో 4.79 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలవగా ఎల్ అండ్ టీ, టాటా మోటార్స్, మారుతి, నెస్లె, ఇండస్ ఇండ్ బ్యాంక్ లాభపడిన ఇతర షేర్లలో ఉన్నాయి. .

హైదరాబాద్‌కు చెందిన రీ సస్టేనబిలిటీ లిమిటెడ్ (ఆర్ఈఎస్ఎల్).. మధ్యప్రదేశ్‌లోని రెవా, సత్నా, సిధీ జిల్లాలో సమీకృత సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఐఎస్‌డబ్ల్యూఎం) కేంద్రాలను ప్రారంభించింది. ఈ జిల్లాల్లో మొత్తం 28 అర్బన్ మున్సిపాలిటీలున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణతో పాటు వేస్ట్ కలెక్షన్, ట్రాన్స్‌పోర్టేషన్, ప్రాసెసింగ్‌ను కంపెనీ చేపట్టనుంది. అంతేకాకుండా 6 మెగావాట్ల సామర్థ్యం గల వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్ట్ కాలపరిమితి 21 సంవత్సరాలు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,290 ▲	57,100 ▲	77,000 ▲
ముంబై	61,743 ▲	56,557 ▲	70,922

ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరల తగ్గింపు

ఓలా ఎలక్ట్రిక్ తన ఎస్1 స్కూటర్ల ధరలను రూ.25,000 వరకు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. తయారీ సామర్థ్యాలు పెరగటం, ఇన్-హౌజ్ టెక్నాలజీలను ఇంటిగ్రేట్ చేయటంతో తగ్గిన భారాన్ని వినియోగదారులకు బదలాయిస్తున్నట్లు ఓలా తెలిపింది. ఎస్1 పోర్టుఫోలియోలో మొత్తం 6 స్కూటర్లను కంపెనీ విక్రయిస్తోంది. తాజా తగ్గింపుతో ఈ పోర్టుఫోలియోలోని ఎస్1 ప్రొ, ఎస్1 ఎయిర్, ఎస్1 ఎక్స్ ప్లస్ ధరలు వరుసగా రూ.1,29,999, రూ.1,04,999, రూ.84,999గా ఉన్నాయి. తగ్గించిన ధరలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయని ఓలా తెలిపింది. కాగా తగ్గించిన ధరలు ఈ నెలాఖరు వరకు అందుబాటులో ఉంటాయని ఓలా ఎలక్ట్రిక్ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16వ తేదీ		విజయవాడ	542
హైదరాబాద్	551	విశాఖపట్నం	555
17వ తేదీ		వరంగల్	553
చిత్తూరు	603		
గోదావరి	542	దజను గుడ్లు రూ.72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	124	గోదావరి	129
వరంగల్	124	విజయవాడ	129
కరీంనగర్	124	గుంటూరు	129
మహబూబ్‌నగర్	124	ఒంగోలు	129
కర్నూలు	124	చిత్తూరు	132
విశాఖపట్నం	122		



అశ్విన్ అర్ధంతరంగా..

రాజ్‌కోట్: టెస్టుల్లో 500 వికెట్లు పూర్తి చేసిన ఉత్సాహంలో ఉన్న ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ తాజా టెస్టుకు దూరమయ్యాడు. కుటుంబంలో నెలకొన్న అత్యవసర మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా అతడు వెంటనే చెన్నైకి బయలుదేరాడు. ఈ కష్టకాలంలో అశ్విన్‌కు తామంతా అండగా ఉంటామని బీసీసీఐ తెలిపింది.

స్పోర్ట్స్

వాళ్లూ మొదలెట్టారు

మూడో టెస్టు
ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ 207/2
డకెట్ మెరుపు శతకం ● భారత్ తొలి ఇన్నింగ్స్ 445


బెన్ డకెట్ (133 బ్యాటింగ్)

రాజ్‌కోట్: పిచ్ ఎలాంటిదైనా బజ్‌బాల్ గేమ్‌తో దూసుకెళ్లే ఇంగ్లండ్‌కు ఫ్లాట్ వికెట్ ఎదురైతే పరిస్థితి ఎలా ఉంటుంది? బ్యాటింగ్‌కు స్వర్గధామంగా ఉన్న ఎస్‌సీఏ స్టేడియంలో స్టోక్స్ సేన ఓవర్‌కు 6 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళుతూ ఔరా.. అనిపిస్తోంది. ఓపెనర్ బెన్ డకెట్ (118 బంతుల్లో 21 ఫోర్లు, 2 సిక్సర్లతో 133 బ్యాటింగ్) సంచలన ఇన్నింగ్స్‌తో చెలరేగుతున్నాడు. స్వీప్, రివర్స్ స్వీప్, స్విచ్ హిట్.. వాట్ నాట్ అనే తరహాలో స్పిన్నర్లు, పేసర్లు అనే తేడా లేకుండా బ్యాట్ ఝుళిపిస్తూ అజేయ సెంచరీతో నిలిచాడు. దీంతో ఈ జట్టు శుక్రవారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 35 ఓవర్లలోనే 207/2 స్కోరుతో నిలిచింది. డకెట్ ఇన్నింగ్స్‌లో బౌండరీ రూపంలోనే 96 పరుగులు నమోదు కావడం విశేషం. పోప్ (39) సహకరించాడు. క్రీజులో డకెట్‌తో పాటు రూట్ (9 బ్యాటింగ్) ఉన్నాడు. ఇంగ్లండ్ ఇంకా 238 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు భారత్ 445 పరుగులకు ఆలౌటైంది. జడేజా (112) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. ధ్రువ్ జురెల్ (46), అశ్విన్ (37), బుమ్రా (26) ఇంగ్లండ్ బౌలర్లను విసిగించారు. ఉడ్‌కు 4, రెహాన్‌కు 2 వికెట్లు దక్కాయి.

ఆకట్టుకున్న జురెల్: 326/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన భారత్ తొలి అర్ధగంటలోనే వరుస ఓవర్లలో కుల్దీప్ (4), జడేజా వికెట్లను కోల్పోయింది. కానీ తొలి సెషన్‌లో జట్టును అరంగేట్ర జురెల్-అశ్విన్ కాపాడారు. జురెల్ ఒత్తిడి లేకుండా ఇంగ్లండ్ బౌలర్లను ఎదుర్కోవడం ఆకట్టుకుంది. స్కోరు 400 దాటాక అశ్విన్, జురెల్‌లను స్పిన్నర్ రెహాన్ స్వల్ప తేడాలో పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత చివర్లో బుమ్రా కాస్త దూకుడుగా ఆడి సిరాజ్‌తో పదో వికెట్‌కు 30 రన్స్ జోడించి ఉడ్ చేతిలో అవుటయ్యాడు.

డకెట్ సూపర్ సెంచరీ: మరో ఆరు ఓవర్లలో రెండో సెషన్ ముగుస్తుందనగా ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ ఆరంభమైంది. మొదటి 4 ఓవర్లలో డకెట్, క్రాలే (15) ఆచితూచి ఆడారు. ఇక చివరి సెషన్ తొలి ఓవర్ నుంచే డకెట్ గేరుమార్చి ఎదురుదాడికి దిగాడు. 14వ ఓవర్లో క్రాలేను అశ్విన్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. సిరాజ్ ఓవర్లో డకెట్ రెండు వరుస ఫోర్లతో శతకం పూర్తి చేశాడు. చివరకు పోప్‌ను సిరాజ్ ఎల్బీ చేయడంతో రెండో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. రూట్‌తో కలిసి డకెట్ మరో వికెట్ పడకుండా రోజును ముగించాడు.



అశ్విన్ (1/37)

భారత ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ టెస్టుల్లో 500 వికెట్ల క్లబ్‌లో చేరాడు. రెండో రోజు ఓపెనర్ క్రాలే వికెట్‌తో అతడీ ఘనత సాధించాడు. అలాగే టీమిండియా నుంచి అనిల్ కుంబ్లే (619) తర్వాత ఈ ఫీట్ సాధించిన రెండో బౌలర్. అంతర్జాతీయ క్రికెట్‌లో మురళీధరన్ (800) అగ్రస్థానంలో కొనసాగుతుండగా అశ్విన్‌ది

అశ్విన్ అదరహో

తొమ్మిదో స్థానం. అలాగే ఈ ఫార్మాట్‌లో అతి తక్కువ టెస్టు (98)ల్లోనే 500 వికెట్లు తీసిన రెండో బౌలర్. మురళీధరన్ (87) ముందున్నాడు. ఇక మెక్‌గ్రాత్ (25,528) తర్వాత తక్కువ బంతుల్లో (25,714)నే ఈ ఫీట్ సాధించిన రెండో బౌలర్‌గా నిలిచాడు.

నాన్నకు అంకితం

500 వికెట్ల ఈ ఫీట్‌ను తన తండ్రి రవిచంద్రన్‌కు అంకితమిస్తున్నట్టు అశ్విన్ తెలిపాడు. తన ఆటను చూసిన ప్రతిసారీ ఆయన విపరీతమైన టెన్షన్‌కు గురయ్యేవాడని, దాదాపు గుండెపోటు వచ్చినంత పనయ్యేదని అన్నాడు. తన వల్లే ఆయన ఆరోగ్యం దెబ్బతిన్నదన్నాడు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో తన తండ్రి ఎప్పుడూ అండగా నిలిచారని చెప్పాడు. కాగా అరుదైన ఘనత సాధించిన అశ్విన్‌పై ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ ఘనత అశ్విన్ పట్టుదలకు నిదర్శనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. ఇక సచిన్, రవిశాస్త్రి, కుంబ్లే, లక్ష్మణ్, సెహ్వాగ్ తదితరులు అశ్విన్‌ను అభినందించారు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) రూట్ (బి) ఉడ్ 10; రోహిత్ (సి) స్టోక్స్ (బి) ఉడ్ 131; గిల్ (సి) ఫోక్స్ (బి) ఉడ్ 0; పటీదార్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 5; జడేజా (సి అండ్ బి) రూట్ 112; సర్ఫరాజ్ (రనౌట్) 62; కుల్దీప్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 4; జురెల్ (సి) ఫోక్స్ (బి) రెహాన్ 46; అశ్విన్ (సి) అండర్సన్ (బి) రెహాన్ 37; బుమ్రా (ఎల్బీ) ఉడ్ 26; సిరాజ్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 130.5 ఓవర్లలో 445 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-22, 2-24, 3-33, 4-237, 5-314, 6-331, 7-331, 8-408, 9-415, 10-445. **బౌలింగ్:** అండర్సన్ 25-7-61-1; ఉడ్ 27.5-2-114-4; హార్ట్‌లీ 40-7-109-1; రూట్ 16-3-70-1; రెహాన్ 22-2-85-2.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) రజత్ (బి) అశ్విన్ 15; డకెట్ (బ్యాటింగ్) 133; పోప్ (ఎల్బీ) సిరాజ్ 39; రూట్ (బ్యాటింగ్) 9; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 35 ఓవర్లలో 207/2. వికెట్ల పతనం:** 1-89, 2-182. **బౌలింగ్:** బుమ్రా 8-0-34-0; సిరాజ్ 10-1-54-1; కుల్దీప్ 6-1-42-0; అశ్విన్ 7-0-37-1; జడేజా 4-0-33-0.

ఇంగ్లండ్‌కు ఎక్స్‌ట్రా రన్స్

భారత్ ఇన్నింగ్స్‌లో అశ్విన్ కారణంగా ఇంగ్లండ్‌కు ఐదు పరుగులు పెనాల్టీ రూపంలో జత చేరాయి. దీంతో ఆ జట్టు బ్యాటింగ్‌కు దిగకుండానే ఖాతా తెరిచినట్టయ్యింది. 102వ ఓవర్లో అశ్విన్ ఆఫ్ సైడ్ దిశగా ఆడి పిచ్ మధ్య భాగం గుండా పరుగు కోసం వెళ్లి వెనక్కి వచ్చాడు. ఇది గమనించిన అంపైర్ వెంటనే భారత్‌కు 5 రన్స్ పెనాల్టీ విధించాడు. ఎంసీసీ రూల్ ప్రకారం బ్యాటర్ ఏ కారణంతోనైనా పిచ్ పాడయ్యేలా ఇలా మధ్యలో నుంచి రన్ తీయకూడదు. ఇలా రెండుసార్లు చేస్తే పెనాల్టీ విధిస్తారు. తొలి రోజు ఆటలో జడేజా కూడా ఇలాగే చేయడంతో పెనాల్టీ తప్పలేదు.

1

భారత గడ్డపై ఒకే సెషన్‌లో 100+ పరుగులు సాధించిన తొలి విదేశీ బ్యాటర్‌గా డకెట్. అలాగే భారత్‌పై వేగంగా (88 బంతుల్లో) టెస్టు సెంచరీ చేసిన ఇంగ్లండ్ బ్యాటర్. గ్రాహం గూచ్ (95 బంతులు) రికార్డు దాటాడు.

టెస్టు బౌలర్లలో అత్యధిక పరుగులు (18,371) సమర్పించుకున్న బౌలర్‌గా అండర్సన్. అనిల్ కుంబ్లే (18,355)ను అధిగమించాడు.

ఇషాన్ ధిక్కారం

- ద్రవిడ్, జై షా ఆదేశాలు బేఖాతర్
- రంజీ మ్యాచ్ ఆడని కిషన్



న్యూఢిల్లీ: హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, బీసీసీఐ కార్యదర్శి జై షా ఆదేశాలను వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ బేఖాతరన్నాడు. మానసిక సమస్యలతో సుదీర్ఘకాలంగా విశ్రాంతి తీసుకుంటున్న ఈ జార్ఖండ్ ఆటగాడు..పునరాగమనానికి రంజీట్రోఫీ ఆడి మ్యాచ్ ఫిట్‌నెస్ నిరూపించుకోవాలని ద్రవిడ్, జై షా చేసిన సూచనను పట్టించుకోలేదు. రాజస్థాన్‌తో శుక్రవారం జంషెడ్‌పూర్‌లో మొదలైన జార్ఖండ్ గ్రూప్ 'ఏ' రంజీ ఆఖరి పోరు ఆడాలని కిషన్‌ను వారు ఆదేశించారు. కానీ అందుకు బదులుగా అతడు హార్దిక్ పాండ్యాతో కలిసి బరోడాలో సాధన చేస్తున్నాడు.

సదర్లాండ్ రికార్డు 'డబుల్'



పెర్త్: మహిళల క్రికెట్‌లో ఆస్ట్రేలియాకు చెందిన 22 ఏళ్ల అనబెల్ సదర్లాండ్ చరిత్ర సృష్టించింది. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఏకైక టెస్టులో ఆమె అత్యంత వేగం (248 బంతుల్లో)గా డబుల్ సెంచరీ సాధించిన బ్యాటర్‌గా నిలిచింది. గతంలో ఆసీస్‌కే చెందిన కారెన్ రోల్టన్ (306 బాల్స్) పేరిట ఈ రికార్డు ఉండేది. మొత్తంగా అనబెల్ 210 పరుగులు సాధించడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 575/9 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. రెండో రోజు ఆట ముగిసేసరికి దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 67/3 స్కోరుతో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో ఈ జట్టు 76 రన్స్‌కే కుప్పకూలింది.


సింధు

అమ్మాయిలు సాధించారు..

సింధు బృందానికి పతకం ఖరారు

- పురుషుల జట్టు పరాజయం
- ఆసియా టీమ్ బ్యాడ్మింటన్

షా ఆలమ్ (మలేసియా): భారత బ్యాడ్మింటన్ మహిళల జట్టు ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి పతకాన్ని అందుకోనుంది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో భారత్ 3-0తో హాంకాంగ్‌ను చిత్తుచేసి కనీసం కాంస్యాన్ని ఖాయం చేసుకుంది. తొలి సింగిల్స్‌లో సింధు 21-7, 16-21, 21-12తో యాన్‌పై, డబుల్స్‌లో అశ్విని/తనీషా జోడీ 21-10, 21-14తో టింగ్/యెంగ్ జంటపై గెలవగా, అస్మిత 21-12, 21-13తో యెంగ్ సమ్‌ను ఓడించి భారత్‌కు 3-0 ఆధిక్యాన్ని అందించింది. అప్పటికే భారత్ విజయం ఖరారవడంతో తర్వాతి రెండు మ్యాచ్‌లను ఆడించలేదు. సెమీస్‌లో జపాన్‌తో భారత్ తలపడనుంది. ఇక, భారత పురుషుల జట్టు జపాన్‌తో పోరులో 2-3తో ఓటమిపాలై పతకం లేకుండానే వెనుదిరిగింది. తొలి సింగిల్స్‌లో ప్రణయ్ ఓడగా.. తొలి డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ జోడీ, రెండో సింగిల్స్‌లో లక్ష్యసేన్ భారత్‌కు 2-1 ఆధిక్యాన్ని అందించారు. కానీ, రెండో డబుల్స్‌లో అర్జున్/ధ్రువ్ ఓడడంతో ఇరుజట్లు 2-2తో సమంగా నిలిచాయి. దీంతో కచ్చితంగా గెలవాల్సిన ఆఖరి సింగిల్స్ పోరులో శ్రీకాంత్..మొమోటా చేతిలో ఓటమిపాలయ్యాడు.

జట్టు బస్సులో మద్యం తాగుతూ..



హైదరాబాద్ మహిళల కోచ్ విద్యుత్ జయసింహ నిర్వాకం
వేటు వేసిన హెచ్‌సీఏ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): టీమ్ బస్సులో మద్యం సేవించాడన్న ఆరోపణలతో హైదరాబాద్ మహిళల క్రికెట్ జట్టు చీఫ్ కోచ్ విద్యుత్ జయసింహపై వేటు పడింది. మద్యం తాగుతున్న వీడియోలు శుక్రవారం వాట్సాప్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవడంతో జయసింహను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు జయసింహ హెచ్‌సీఏ క్రికెట్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఉత్తర్వుల్లో జగన్ పేర్కొన్నారు. విద్యుత్, దిగ్గజ క్రికెటర్ ఎంఎల్ జయసింహ కుమారుడు. ప్రస్తుతం నెట్‌లో చక్కర్లు కొడుతున్న కోచ్ వీడియో గతనెలలో తీసినట్టుగా తెలుస్తోంది. ఆ సమయంలోనే కొందరు క్రికెటర్లు హెచ్‌సీఏలోని ఒక కీలక వ్యక్తి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా, ఆయన కార్యాలయంలోనే సమావేశం నిర్వహించి క్రికెటర్లకు సర్దిచెప్పినట్టు సమాచారం. కానీ, కోచ్ చర్యలను తీవ్రంగా పరిగణించిన కొందరు మహిళా క్రికెటర్లు ఈనెల 15న మరోసారి హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యులకు ఫిర్యాదు చేయడం, మీడియాను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మహిళా క్రికెటర్లతో హెచ్‌సీఏ సభ్యులు మాట్లాడుతున్నారని, సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు పూర్తిచేసి చర్యలు తీసుకుంటామని జగన్ చెప్పారు. ఇక, జయసింహపై గతంలోనూ ఇలాంటి ఆరోపణలు వచ్చినట్టు హెచ్‌సీఏ సభ్యుడు వంకా ప్రతాప్ తెలిపారు. కాగా, తనపై వచ్చిన ఆరోపణలను కోచ్ విద్యుత్ ఖండించాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ మాజీ క్రికెటర్ కుమార్తెను జట్టులోకి తీసుకోవడానికి తాను నిరాకరించడంతోనే తనపై ఇలా కుట్రపూరితంగా వ్యవహరించాడని అతను అన్నాడు.



సీఎం రేవంత్‌తో జాతీయ సాకర్ చీఫ్ భేటీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఫిఫా క్వాలిఫయర్ మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. శుక్రవారం రాష్ట్ర శాసనసభలోని సీఎం కార్యాలయంలో రేవంత్ రెడ్డితో అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) అధ్యక్షుడు కల్యాణ్ చౌబే బృందం భేటీ అయింది. వచ్చే జూన్ 6వ తేదీన దేశంలో నిర్వహించాల్సిన భారత్, కువైట్ జట్ల మధ్య క్వాలిఫయర్స్ మ్యాచ్‌కి ఆతిథ్యమిచ్చేందుకు ఇతర రాష్ట్రాలు కూడా మొగ్గు చూపిస్తుండడంతో తెలంగాణ ప్రభుత్వ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని రేవంత్‌ను కల్యాణ్ కోరారు. దీనిపై రేవంత్ స్పందిస్తూ.. ఈ ఫిఫా మ్యాచ్ నిర్వహణ ఏర్పాట్ల బాధ్యత మొత్తం తెలంగాణ సర్కార్ తీసుకుంటుందని, మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా సహకారమందిస్తుందని హామీ ఇచ్చారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 17-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 303 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ*



దసరాకు వస్తున్న దేవర



తన మాస్ అవతార్‌తో జూనియర్ ఎన్టీఆర్ మరో సారి సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'దేవర'కు సంబంధించిన లేటెస్ట్ అప్‌డేట్ వచ్చేసింది. రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం తొలి భాగాన్ని దసరా సందర్భంగా అక్టోబర్ 10న విడుదల చేయనున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ నెట్టింట అభిమానులను అలరిస్తోంది. ఈ పోస్టర్ చూస్తుంటే యాక్షన్ సీన్లు హై లెవల్‌లో ఉంటాయనీ, ఎన్టీఆర్‌ను మరింత మాస్ క్యారెక్టర్‌లో చూపించబోతున్నారనీ అర్థమైంది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. దర్శకుడు కొరటాల శివ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రకాశ్ రాజ్, శ్రీకాంత్, టామ్ షైన్ చాకో, నరైన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ ఈ సినిమా నిర్మిస్తున్నారు. సంగీతం:అనిరుధ్, ఛాయాగ్రహణం: రత్నవేలు, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: సాబు సిరిల్.

ఆయనకి 70.. ఆవిడకు 65

సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్, అలనాటి అందాల తార జయప్రద ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'లవ్ @ 65'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ అందిస్తున్న ఈ హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు వి.ఎన్.ఆదిత్య దర్శకత్వం వహిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల ఈ చిత్రానికి సహ నిర్మాత. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఆయనకి 70



ఏళ్లు నిండాయి. ఆవిడకి 65 ఏళ్లు దాటి ఉంటాయి. ఈ ఇద్దరూ కాలనీ నుంచి పారిపోయే ఆసక్తికరమైన సన్నివేశంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. పోలీసుల విచారణలో వారు ఒకరినొకరు ప్రేమించుకున్నారనీ, జీవితాంతం తోడుగా ఉండాలని నిర్ణయించుకున్నారనీ తెలుతుంది. వినోదంతో పాటు మనసుని కదిలించే భావోద్వేగాలు చిత్రంలో ఉన్నాయని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. ఈ చిత్రంలో కార్తీక్ రాజు, స్పందన, క్రిష్, నిహంత్రీ రెడ్డి, నారాయణ రావు, ప్రదీప్, సాయి శ్రీనివాస్, ప్రీతీ నిగమ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. అజయ్, సునీల్ ప్రత్యేక పాత్రల్లో కనిపిస్తారు. త్వరలో విడుదలయ్యే ఈ చిత్రానికి కథ: సుధీర్ చింటూ, మాటలు: లక్ష్మీ భూపాల, సంగీతం: అనూప్ రూబెన్స్, ఎడిటింగ్: జునైద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కొల్లి సుజిత్‌కుమార్.



యుద్ధరంగానికి సిద్ధం

ఎన్టీఆర్, హృతిక్ రోషన్ కాంబినేషన్‌లో వస్తున్న బాలీవుడ్ మల్టీస్టారర్ 'వార్ 2' చిత్రం వచ్చే వారం సెట్స్‌పైకి వెళ్లనుంది. శుక్రవారం చిత్రయూనిట్ ఈ విషయాన్ని ప్రకటించింది. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ గతంలో నటించిన 'వార్' చిత్రానికి ఇది సీక్వెల్. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవలే జిమ్‌లో గాయ పడిన హృతిక్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. 'వార్ 2' షూటింగ్ మొదలైతే ఇక నాకు ఊపిరి తీసుకునే గ్యాప్ కూడా ఉండదేమో' అని హృతిక్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. వచ్చే ఏడాగి ఆగస్టు 14న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు.

టాలీవుడ్‌లో హీరోయిన్లకు గౌరవం లేదు

- రాధికా ఆప్టే



వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో ఉండే బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే హీరోయిన్ల పట్ల తెలుగు సినీ రంగం వ్యవహార శైలిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ టాలీవుడ్ పరిశ్రమలో హీరోయిన్లకు ఎలాంటి గౌరవం ఉండదని అన్నారు. హీరోయిన్లను అపరిచితుల్లాగా చూస్తారనీ, సినిమాల్లో మహిళా పాత్రలకు పెద్దగా ప్రాధాన్యం ఉండదని చెప్పారు. హీరో కన్నా రెండు గంటలు ముందే షూటింగ్ స్పాట్‌లో ఉండాలి, ఇండస్ట్రీలో పురుషాధిపత్యం ఎక్కువ, కనీస సమాచారం ఇవ్వకుండా వాళ్లకు నచ్చినట్లు షూటింగ్స్ క్యాన్సిల్ చేయడం వల్ల చాలా సార్లు ఇబ్బందిపడ్డాను అని ఆరోపించారు. అందుకే అప్పటి నుంచి తెలుగు సినిమాలకు నా అవసరం లేదు అని భావించి దూరమయ్యాను అని రాధిక చెప్పారు.

నష్టపరిహారం చెల్లించండి



తరుణ్ భాస్కర్ దర్శకత్వం వహించిన 'కీడా కోలా' చిత్రబృందానికి ఎస్పీ చరణ్ లీగల్ నోటీసులు పంపారు. అనుమతి లేకుండా తన తండ్రి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గొంతును ఏఐ టెక్నాలజీ ద్వారా రీ క్రియేట్ చేసి వాడుకున్నందుకు 'కీడాకోలా' యూనిట్, సంగీత దర్శకుడు వివేక్ సాగర్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి జనవరిలోనే నోటీసులు పంపినట్లు ఆయన తెలిపారు. 'మా నాన్న గొంతుకు జీవం పోసిన ఏఐ టెక్నాలజీని స్వాగతిస్తున్నాం. ఇలా చేసేముందు మా అనుమతి తీసుకొని ఉండాల్సింది. వ్యాపారం కోసం ఇలాంటి పనులు చేయడం సమంజసం కాదు' అని ఆయన పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఒక గొప్ప వ్యక్తి గొంతును ఉపయోగించుకోవడం చట్ట విరుద్ధమన్నారు. ప్రతిగా తమకు క్షమాపణలు చెప్పడంతో పాటు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

డిఫరెంట్ థ్రిల్లర్

మోహన్ భగత్, సుప్రిత, సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ కీలక పాత్రలు పోషించిన 'ఆరంభం' చిత్రం టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేశారు. అజయ్ వి నాగ్ దర్శకత్వంలో అభిషేక్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ 'థ్రిల్లింగ్, యాక్షన్ ఎలిమెంట్స్ కలిగిన 'ఆరంభం' టీజర్ ఆసక్తికరంగా ఉంది. కొన్ని క్యారెక్టర్స్ లో గ్రే షేడ్స్ ఉన్నాయి. సినిమాటోగ్రఫీ, మ్యూజిక్ కొత్తగా ఉన్నాయి' అంటూ



టీమ్‌కు అభినందనలు తెలిపారు. ఇప్పటిదాకా వినని ఓ కథ చెబుతానంటూ ఓ మహిళ చెప్పే కథతో ఈ టీజర్ మొదలైంది. రామాయణం స్టోరీని కొంత నేరేట్ చేసి ఈ చిత్రకథలోకి వెళ్లి జైలు, ఒక కేసు వివరాలు, ఇతర క్యారెక్టర్స్ చూపించారు. ఇవన్నీ సినిమాపై ఆసక్తి కలిగించాయి.. త్వరలోనే 'ఆరంభం' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తామని టీమ్ చెప్పింది. ఈ చిత్రానికి మాటలు: సందీప్ అంగడి, సంగీతం: సింజిత్ యర్రమిల్లి, సినిమాటోగ్రఫీ: దేవ్ దీప్ గాంధీ కుండు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వినయ్ రెడ్డి మామిడి.



సందెవేళ సాంగ్

శాంతి చంద్ర, దీపికా సింగ్, స్మిమితి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో జీఎస్ బాబు నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం నుంచి 'సందెవేళ' అంటూ సాగే రొమాంటిక్ గీతాన్ని దర్శకుడు సాయిరాజేశ్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నా మిత్రుడు శాంతి చంద్ర నటించిన 'డర్టీఫెలో' సినిమా వినూత్న కథతో తెరకెక్కుతోంది. సినిమా సూపర్ హిట్టవ్వాలి' అని ఆకాంక్షించారు. హీరో మాట్లాడుతూ 'సినిమాకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు పూర్తయాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: డాక్టర్ సతీష్ కుమార్ పి. సినిమాటోగ్రఫీ: రామకృష్ణ ఎస్. ఎడిటర్: జేపీ.

అప్పుడు తండ్రి.. ఇప్పుడు తనయుడు!

హాస్య చిత్రాల దర్శకుడిగా తనకుంటూ ఓ ప్రత్యేక బాణీ ఏర్పరచుకున్న ఇ.వి.వి సత్యనారాయణ చాన్నాళ్ల క్రితం 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రాన్ని తీశారు. రాజేంద్రప్రసాద్ హీరోగా నటించిన ఆ హిలేరియస్ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను తెగ నవ్వించింది. ఇప్పుడు ఇవీవీ తనయుడు నరేశ్ తన 61 చిత్రానికి 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ రిపీట్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని సీరియస్




పాత్రలను పోషించిన నరేశ్ మళ్లీ ఇప్పుడు కామెడీ బాట పట్టారు. కొత్త దర్శకుడు మల్లి అంకం రూపొందిస్తున్న ఈ ఎంటర్‌టైనర్‌ను రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. భరత్ లక్ష్మీపతి సహ నిర్మాత. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ గ్లింప్స్ శుక్రవారం విడుదల చేశారు. చిత్రంలో నరేశ్ పాత్ర పేరు గణ. అందరూ తన పెళ్లి గురించి అడుగుతుంటే 'ఆ ఒక్కటీ అడక్కు' అని వారికి సమాధానమిస్తుంటారు. పెళ్లి అనేది పాన్ ఇండియా సమస్య అని చెబుతారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, జానీ లివర్, వైవా హర్ష, అరియానా గ్లోరీ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మార్చి 22న విడుదలయ్యే ఈ చిత్రానికి రచన: అబ్బూరి రవి, ఫొటోగ్రఫీ: సూర్య, సంగీతం: గోపీసుందర్.

'రాజధాని ఫైల్స్'కు గ్రీన్ సిగ్నల్

• తాత్కాలిక స్టే ఎత్తివేసిన హైకోర్టు

ఏపీ రాజధాని అమరావతి కథాంశంగా నిర్మించిన 'రాజధాని ఫైల్స్' సినిమా ప్రదర్శనకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిపై గురువారం విధించిన తాత్కాలిక స్టేను ఎత్తివేసింది. సినిమా ప్రదర్శనకు సెన్సార్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ) సినిమాటోగ్రఫీ చట్ట నిబంధనలకు లోబడే సర్టిఫికెట్ ఇచ్చిందని స్పష్టం చేసింది. సినిమా సర్టిఫికేషన్‌కి సంబంధించి ఎగ్జామినింగ్ కమిటీ, రివైజింగ్ కమిటీలు సమర్పించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. అన్ని అంశాలను పరిశీలించి తగిన కారణాలతో సర్టిఫికెట్ జారీ చేసిన నేపథ్యంలో దీనిపై జోక్యం చేసుకోలేమని కోర్టు పేర్కొంది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను మార్చి 11వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. జయసూర్య శుక్రవారం ఆదేశాలిచ్చారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి)



'పొట్టేల్' కోసం మాస్ సాంగ్



గ్రామీణ నేపథ్యంలో కొత్త కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'పొట్టేల్'. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ముఖ్య పాత్రధారులు. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో సురేశ్ కుమార్ సడిగే, నిశాంక్ రెడ్డి కుడితి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంతకుముందు విడుదల చేసిన ఫస్ట్ సింగిల్ 'నాగిరో' చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. తాజాగా కాసర్ల శ్యామ్ రాసిన విలేజ్ మాస్ సాంగ్ 'వవ్వరే'ను శుక్రవారం విడుదల చేశారు. రాహుల్ సిప్లిగంజ్ పాడిన పాట ఇది. ఇందులో హీరో యువచంద్ర కృష్ణ తన డ్యాన్సింగ్ స్కిల్స్ చూపించారు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, ఛత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్, జీవన్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.



దర్శకుల సంఘానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో దర్శకుడు వీరశంకర్, ఆయన ప్యానెల్ విజయం సాధించింది. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు వీరశంకర్, ఆయన కార్యవర్గ సభ్యులు రథ సప్తమి సందర్భంగా శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. తమ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు పరిచేవిధంగా కార్యాచరణ ప్రారంభించామనీ, సంఘాన్ని మరింత అభివృద్ధి పరుస్తామనీ అధ్యక్షుడు వీరశంకర్ చెప్పారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 17-2-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 303 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ*

వైద్యాధికారికి లంచాల రోగం

9

ఏసీబీకి చిక్కిన నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

నాన్‌టెండర్ సర్జికల్స్, డ్రగ్స్ సరఫరాకు రూ.3 లక్షలు డిమాండ్

అత్యవసరానికి సంబంధించిన పనుల్లో అధికారి పైసల కక్కుర్తి

రెండు సార్లు రూ.లక్ష చొప్పున ఇచ్చినా ఇంకా కావాలని పట్టు



లచ్యా నాయక్

సమగ్ర కులగణన

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాలని ప్రభుత్వ నిర్ణయం.. అసెంబ్లీలో తీర్మానం.. ఏకగ్రీవ ఆమోదం

రాష్ట్ర ప్రజలందరి స్థితిగతులపై ఇంటింటి సర్వే

సాకారం కానున్న వివిధ వర్గాల దశాబ్దాల కల

కులగణనకు రూ.150 కోట్లు కేటాయించాం

తీర్మానంతో జీవితం ధన్యమైంది: మంత్రి పొన్నం

సర్వరోగ నివారిణిలా కులగణన: భట్టివిక్రమార్క

తీర్మానంతో సరిపెట్టొద్దు.. చట్టం చేయాలి: గంగుల

కులగణన నిర్ణయం చరిత్రాత్మక ఘట్టం

సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన బీసీ సంఘాలు

గాంధీభవన్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీసీ సంఘాల నాయకులు, చిత్రంలో మంత్రులు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసన సభ శుక్రవారం ఓ చరిత్రాత్మక ఘట్టానికి వేదికైంది. జనాభా దామాషా ప్రకారం తమ వాటా తమకు కల్పించాలంటూ బీసీ వర్గాలు దశాబ్దాలుగా చేస్తున్న డిమాండ్ల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టాలని ప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని ప్రజలందరి వాస్తవ స్థితిగతులు, వారి వివరాలను శాస్త్రీయంగా సేకరించేందుకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాల ప్రణాళికలను రూపొందించడానికి వీలుగా ఈ కులగణనను చేపట్టనున్నారు. తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కులగణన కోసం ఇంటింటికీ కుటుంబ సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.150 కోట్లు కేటాయించామని, అవసరమైతే ఎంతైనా ఖర్చు పెట్టడానికి వెనకాడబోమని ప్రకటించారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగడానికే ఈ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పినట్లు 'ఎంత జనాభాకు.. అంత వాటా' విధానానికి కట్టుబడి ముందుకెళుతున్నామని చెప్పారు. పార్లమెంట్ ఓబీసీ కమిటీ సభ్యుడిగా 20 రాష్ట్రాలు తిరిగానని, ఆ అనుభవంతో కులగణన మరింత పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని

మిగతా 11వ పేజీలో...

పాలితులు పాలకులు కావాలి

11

బీసీల్ని అన్ని రంగాల్లో నిలబెట్టాలన్నదే లక్ష్యం

ఇన్నాళ్లూ పవర్‌లో ఉన్నోళ్లకు బాధ ఉండొచ్చు

కులగణనపై మాది తిరుగులేని చిత్తశుద్ధి

కేటీఆర్ సీటు మార్చటం కాదు.. బయటికే

అసెంబ్లీలో సమగ్ర కులగణన చర్చలో సీఎం

సంపూర్ణ సామాజిక ముఖచిత్రం

గణనతో అన్ని కులాల వివరాలు వెల్లడి

11

నేడు సాగునీటి శాఖపై శ్వేతపత్రం

అధికారపక్షంపై ఎదురుదాడికి విపక్షం సిద్ధం

ఆర్థిక సంఘం చైర్మన్‌గా రాజయ్య

మరో ముగ్గురు సభ్యుల నియామకం



ధరణితో గోల్‌మాల్

అమ్మిన భూముల్ని మళ్లీ అమ్మే అవకాశం

రెవెన్యూ రికార్డులకెక్కని రిజిస్టర్డ్ భూములు

తప్పుల రికార్డులతో ధరణి పోర్టల్ అప్‌డేట్

దీన్ని అవకాశంగా తీసుకొని లేఅవుట్ల కబ్జా

ఇదేరీతిన హయత్‌నగర్‌లో ఐదెకరాల ఆక్రమణ

లేఅవుట్ చెరిపేసి దానిపై మళ్లీ లేఅవుట్

ధరణి ఆధారంగా వేరే రియల్టర్‌కు రిజిస్ట్రేషన్

తాజాగా వెలుగులోకి మాజీ ఎమ్మెల్యే బాగోతం

అండగా నిలిచిన అన్ని శాఖల అధికారులు

నెల రోజుల్లోనే లేఅవుట్‌కు హెచ్‌ఎండీఏ ఓకే

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ధరణి లోపాలు సామాన్యుడి గొంతు కోస్తున్నాయి. దశాబ్దాలుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లను పట్టించుకోకుండా కేవలం రెవెన్యూ రికార్డుల ఆధారంగా ధరణి పోర్టల్‌ను అప్‌డేట్ చేయడంతో చాలామంది ఇళ్ల ప్లాట్ల యజమానులు అన్యాయమై పోయారు. దశాబ్దాల క్రితం ప్లాట్లు కొనుక్కున్న సామాన్యులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ధరణి ఆవిర్భావం నుంచి జరుగుతున్న ఈ తమాషాకు తాజాగా హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌కు సమీపంలో జరిగిన భూదందా చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది. అశాస్త్రీయంగా డబుల్ రిజిస్ట్రేషన్లను అనుమతించే వ్యవహారం వల్ల డబ్బులు పెట్టి కొనుక్కున్నాం.. ఇంట్లో రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయన్న ధైర్యంతో ఉండలేని పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడింది. కొన్ని వేల ప్లాట్లకు సంబంధించి రెవెన్యూ రికార్డులు ఇప్పటికీ వ్యవసాయ భూములుగానే ఉన్నాయి. మ్యుటేషన్ జరగకపోవడంతో

మిగతా 12వ పేజీలో...

వెల్‌కం.. సునీతమ్మా



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సునీతరెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, చిత్రంలో కోమటిరెడ్డి

హ్యాట్రిక్ జడ్పీ చైర్‌పర్సన్ రికార్డు మీది

మహేందరన్నా.. మీరూ ఈ రోజే చేరి ఉంటే బాగుండేది: సీఎం రేవంత్‌రెడ్డి

సునీతకు గాంధీభవన్‌లో కండువా కప్పి ఆహ్వానించిన దీపాదాస్‌మున్షీ

10

అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మేయర్ దంపతులు కాంగ్రెస్‌లోకి

అనంతరం రేవంత్‌ను కలిసిన నేతలు

బాపురే..!



కేసీఆర్‌ను జాతిపితగా నిలిపేందుకు బీఆర్ఎస్ యత్నాలు

ఆయన్ను 'బాపు'గా సంబోధిస్తూ జన్మదిన శుభాకాంక్షలు

ప్రజలూ అలా పిలిచేలా మాధ్యమాల్లో విస్తృత ప్రచారం

పార్టీ శ్రేణుల సోషల్‌మీడియా ఖాతాల్లో ప్రచారహోరు

నేడు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు

వీల్‌చైర్లు, డ్రైవర్లకు జీవిత బీమాపత్రాల అందజేత

పాల్గొననున్న కేటీఆర్, హరీశ్, ఎమ్మెల్యేలు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ పదేళ్ల పాలనపై కాంగ్రెస్ సర్కారు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో.. ప్రజల్లో ఆయన ఇమేజ్‌ను మరింతగా పెంచేందుకు, తెలంగాణ జాతిపితగా చరిత్రలో నిలిపేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేతగా ఆయనకు ప్రజల్లో సుస్థిర స్థానం ఉండాలని.. జాతిపితగా ఆయనపై ప్రత్యేక గౌరవభావం కల్పించాలని భావిస్తున్న ఆ పార్టీ నేతలు.. ఆ దిశగా వ్యూహాత్మక చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందుకు వారు ఎంచుకున్న ముహూర్తం.. కేసీఆర్ జన్మదినం. శనివారం ఆయన 70వ పడిలో అడుగుపెడుతున్న నేపథ్యంలో

మిగతా 11వ పేజీలో...



ఎయిర్ డిఫెన్స్ టాక్టికల్ కంట్రోల్ రాడార్

ఆయుధ వ్యవస్థల కొనుగోళ్లకు 84,560 కోట్లు

ఆమోదం తెలిపిన రక్షణ శాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: భద్రతా బలగాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మల్టీమిషన్ మారిటైం ఎయిర్‌క్రాఫ్ట్‌లతో సహా రూ.84,560 కోట్లతో పలు రక్షణ ఉత్పత్తుల కొనుగోలు ప్రతిపాదలకు రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) శుక్రవారం ఆమోదం తెలిపింది. కొత్త తరం యాంటీ-ట్యాంక్ మైన్స్ ఎయిర్ డిఫెన్స్ టాక్టికల్ కంట్రోల్

మిగతా 2వ పేజీలో...

అన్నీ ప్రీపెయిడ్ మీటర్లే..

12

19.79 కోట్ల కనెక్షన్లకు బిగించాలని కేంద్రం నిర్ణయం

'రీచార్జ్' అయిపోయాక సందేశాలు ఇచ్చి డిస్‌కనెక్షన్

ఆర్‌డీఎస్‌ఎస్ కింద గైడ్‌లైన్స్

ఐరాసకు అన్నదాతలు

డిమాండ్ల పరిష్కారంలో చొరవ చూపాలని విన్నపం

2

కాంగ్రెస్ ఖాతాల స్తంభన!

ఐటీ శాఖ ఆదేశాలు.. 2018-19లో రూ.210 కోట్ల పన్ను చెల్లించలేదని చర్య

ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసిన కాంగ్రెస్ పార్టీ

ఖాతాల్లో రూ.115 కోట్లు ఉంచాలి

ఆపై సొమ్మునే వాడాలని ట్రిబ్యునల్ ఆదేశం

విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదా

కరెంటు బిల్లులు కట్టేందుకు డబ్బుల్లేవు

ప్రజల విరాళాల్నీ స్తంభింపజేశారు: మాకెన్

ప్రజాస్వామ్యాన్ని కోర్టులే కాపాడాలి: ఖర్గే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు మరికొన్ని వారాల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్న సమయంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను ఐటీ శాఖ స్తంభింపజేసింది. అయితే, ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఈ చర్యను కొన్ని మినహాయింపులతో నిలిపి వేస్తూ విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ వ్యవహారంపై ఐటీ శాఖ అధికారికంగా వివరాలను వెల్లడించలేదు. కాంగ్రెస్ కోశాధికారి అజయ్ మాకెన్ మీడియాతో మాట్లాడుతూ, గత లోక్‌సభ ఎన్నికలు జరిగిన 2018-19 ఆర్థిక సంవత్సరానికి

మిగతా 2వ పేజీలో...

ఎన్‌ఆర్‌ఐతో వివాహానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మోసాలను అరికట్టేందుకు సమగ్ర చట్టం ఉండాలి

కేంద్ర న్యాయశాఖకు లా కమిషన్ సిఫారసులు

2

కట్టుదిట్టమైన నిబంధనలతో కూడిన నివేదిక సమర్పణ

వీధి కుక్కల్ని వెంటాడి.. తుపాకీతో వేటాడి!



18 శునకాల మృతి.. కొన్నింటికి గాయాలు

9

అర్ధరాత్రి నలుగురు దుశ్చర్య

మహబూబ్‌నగర్ జిల్లా పొన్నకల్‌లో ఘటన

చెప్తే చాలు.. వీడియో సిద్ధం!

కమాండ్ల ఆధారంగా నిమిషం నిడివి గల వీడియోలను రూపొందించే కొత్త ఏఐ మోడల్ 'సోర'

చాట్‌జీపీటీ సృష్టికర్త 'ఓపెన్ ఏఐ' మరో అద్భుతం

న్యూయార్క్, ఫిబ్రవరి 16: అడిగిందే తడవుగా అన్నీ చెప్పే 'చాట్ జీపీటీ'తో సంచలనం సృష్టించిన కృత్రిమ మేధ సంస్థ 'ఓపెన్ ఏఐ'.. ఇచ్చిన ప్రాంప్ట్ ఆధారంగా ఒక నిమిషం వీడియోను రూపొందించే మరో కొత్త ఏఐ మోడల్‌తో ముందుకొచ్చింది. దాని పేరు 'సోర'. చాట్ జీపీటీ 4.0 వెర్షన్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడమే కాక, మనం ఇచ్చిన ప్రాంప్ట్‌ల ఆధారంగా బొమ్మల్ని కూడా రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. దానికి ఇంకొంచెం అడ్వాన్స్‌డ్ వెర్షనే ఈ వీడియో ఏఐ మోడల్ 'సోర'. ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ దీని గురించి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 'సోర' ఎన్ని అద్భుతాలు చేయగలదో ప్రజలకు చూపించాలని తాము అనుకుంటున్నామని.. కాబట్టి, ఎవరైనా దాన్ని పరీక్షించాలనుకుంటే తాము చూడాలనుకుంటున్న వీడియోకి సంబంధించి క్యాప్షన్లతో రిప్లై ఇవ్వాలని అందులో కోరారు. దీంతో చాలామంది 'ఎక్స్' యూజర్లు ఆయన ట్వీట్‌కు సమాధానంగా పలు ప్రాంప్ట్‌లు పంపించారు. వాటిలో కొన్నింటిని ఉపయోగించి 'సోర' తయారు చేసిన వీడియోలను శామ్ ఆల్ట్‌మన్ మళ్లీ పోస్ట్ చేశారు. అయితే, కొన్ని కొన్ని వీడియోల్లో మాత్రం చిన్నచిన్న లోటుపాట్లు ఉన్నట్టు గుర్తించామని.. వాటిని కూడా సరిచేసే ప్రయత్నాల్లో ఉన్నామని శామ్ ఆల్ట్‌మన్ వివరించారు. ఈ మోడల్‌ను దుర్వినియోగం చేసి ప్రముఖుల పరువుకు భంగం వాటిల్లే విధంగా వీడియోలు రూపొందించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఆ దిశగా కూడా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఆయన వెల్లడించారు.




సోర రూపొందించిన వీడియోలోని దృశ్యం

ఈ లోపాలన్నింటినీ సరిచేసుకున్నాకే అందరికీ అందుబాటులోకి తెస్తామని.. ప్రస్తుతానికి దీన్ని కొంతమంది కంటెంట్ క్రియేటర్లకు, నిపుణులకు, లోపాలను గుర్తించి సరిచేసే రెడ్ టీమర్స్‌కు మాత్రమే పరిమితం చేశామని చెప్పారు.

'డాల్ ఈ'కి కొనసాగింపు..

ఓపెన్ ఏఐ సంస్థ ఇంతకుముందు ఇదే తరహాలో.. కమాండ్ ఇస్తే వీడియోలను రూపొందించే 'డాల్ ఈ' అనే వీడియో జనరేటివ్ ఏఐపై కొంతకాలం పనిచేసింది. ఆ తర్వాత ఏమైందో ఏమో.. 'డాల్ ఈ' కోసం చేసిన రిసెర్చ్ ఆధారంగా 'సోర'ను అభివృద్ధి చేసింది. మరికొన్ని సంస్థలు కూడా ఈ తరహా టెక్స్ట్ టు వీడియో ఏఐ మోడళ్లను గతంలోనే రూపొందించాయి. అమెరికాకు చెందిన 'రన్‌వే' అనే స్టార్టప్ రూపొందించిన జెన్-2 మోడల్ ఏఐ ఈ 'టెక్స్ట్ టు వీడియో' అద్భుతాన్ని 2023లోనే సాధించింది. కాగా, జపనీస్‌లో 'సోర' అంటే ఆకాశం అని అర్థం.

లోకం తీరు



ఎన్‌ఆర్‌ఐతో వివాహానికి
రిజిస్ట్రేషన్ తప్పనిసరి

» న్యాయశాఖకు లా కమిషన్ సిఫారసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: భారత పౌరులు, ఎన్‌ఆర్‌ఐల మధ్య వివాహాల్లో జరుగుతున్న మోసాలపై లా కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని అరికట్టడానికి సమగ్ర చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. తప్పుడు హామీలు, అసత్య సమాచారం, జీవిత భాగస్వామిని వదిలేయడం వంటి మోసాలను అరికట్టడానికి ఇటువంటి వివాహాలను తప్పనిసరిగా భారత్‌లోనే రిజిస్టర్ చేయాలని సిఫారసు చేసింది. ఇంకా అనేక కట్టుదిట్టమైన నిబంధనలతో కూడిన నివేదికను జస్టిస్ రుతురాజ్ అవస్థీ నేతృత్వంలోని లా కమిషన్ కేంద్ర న్యాయశాఖకు శుక్రవారం సమర్పించింది. "భారత పౌరులు, ఎన్‌ఆర్‌ఐల మధ్య జరుగుతున్న వివాహాలు మోసపూరితంగా మారి, భారతీయ జీవిత భాగస్వాములను ముఖ్యంగా మహిళలను ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టే ధోరణి పెరుగుతోందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఎన్‌ఆర్‌ఐలు/ఓఐసీలు, భారత పౌరుల మధ్య జరిగే అన్ని వివాహాలను తప్పనిసరిగా భారత్‌లోనే రిజిస్టర్ చేయాలని సిఫారసు చేస్తున్నాం. విడాకులు, భరణం, పిల్లల సంరక్షణ, ఎన్‌ఆర్‌ఐలు/ఓఐసీలకు సమన్లు లేదా జ్యుడీషియల్ డాక్యుమెంట్లు అందించడం వంటి అంశాలకు సంబంధించి కొత్త చట్టంలో నిబంధనలు ఉండాలి' అని సిఫారసు చేసింది. ఎన్‌ఆర్‌ఐల వైవాహిక స్థితిని ప్రకటించడం, దంపతుల పాస్‌పోర్ట్‌ను ఒకదానితో మరొకటి లింక్ చేయడం, వాటిపై వివాహ రిజిస్ట్రేషన్ నంబరు పేర్కొనడం తప్పనిసరి చేయడానికి గాను పాస్‌పోర్ట్ చట్టం-1967లో అవసరమైన సవరణలు చేయాలంది. ఇటువంటి వివాహాల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి దేశీయ కోర్టులకు అధికారం ఉండాలని లా కమిషన్ పేర్కొంది.

భారతీయులపై దాడులను సహించం



వాషింగ్టన్, ఫిబ్రవరి 16: అగ్రరాజ్యం అమెరికాలో భారత సంతతి వ్యక్తులు, భారతీయ విద్యార్థులపై ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న దాడుల పట్ల అధ్యక్షుడు జో బైడెన్ కార్యాలయం వైట్‌హౌస్ స్పందించింది. హైదరాబాద్ విద్యార్థి బెనిగేరి శ్రేయాస్‌రెడ్డి సహా నలుగురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో.. ఇలాంటి ఘటనల నిరోధానికి బైడెన్ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు పేర్కొంది. తమ దేశంలో జాతి, మతం, లింగం, మరే ఇతర కారణాలతో అయినా వివక్షకు తావులేదని స్పష్టం చేసింది. అమెరికా జాతీయ భద్రతా మండలి వ్యూహాత్మక సంబంధాల సమన్వయకర్త జాన్ కిర్బీ మీడియాతో మాట్లాడుతున్న సందర్భంగా, భారతీయులపై దాడుల ప్రస్తావన వచ్చింది. దీనిపై ఆయన స్పందిస్తూ.. "దాడులను అరికట్టేందుకు బైడెన్, ఆయన యంత్రాంగం ఆయా రాష్ట్రాలు, స్థానిక అధికారులతో కలిసి శాయశక్తులా పాటుపడుతోంది. మేం చేయగలిగినదంతా చేస్తున్నాం. ఇలాంటి ఉదంతాల్లో నిందితులను చట్టపరంగా బాధ్యులను చేస్తాం" అని కిర్బీ వివరించారు. అమెరికాలో భారతీయులపై దాడుల నేపథ్యంలో ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ నాయకుడు అజయ్ జైన్ తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని, స్థానిక పోలీసులు భారతీయ విద్యార్థులకు భద్రతను కట్టుదిట్టం చేయాలని డిమాండ్ చేశారు.

కేజ్రీవాల్ విశ్వాస తీర్మానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: మద్యం పాలసీ కేసులో ఈడీ పదే పదే సమన్లు పంపిస్తుండడం, విచారణకు హాజరు కావాలంటూ కోర్టు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో.. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తనపై, తన ప్రభుత్వంపై సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజల్లో విశ్వాసం ఉందని నిరూపించుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం శాసనసభలో స్వయంగా విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. బీజేపీ నేతలు తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. అసలు మద్యం పాలసీ కేసే తప్పుడు కేసు అని, తమ ప్రభుత్వాన్ని కూల్చే కుట్రతోనే బీజేపీ ఈ కేసు పెట్టించిందని ఆరోపించారు. కాగా, కేజ్రీవాల్ ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానంపై అసెంబ్లీలో శనివారం చర్చ జరగనుంది. ఢిల్లీ శాసనసభలో మొత్తం 70 స్థానాలకుగాను ఆమ్ ఆద్మీ పార్టీకి 62 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

నేడే జీఎస్ఎల్వీ-ఎఫ్14 ప్రయోగం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 16: ఇస్రో ఈ ఏడాది రెండో ప్రయోగానికి సిద్ధమైంది. వాతావరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులకు విలువైన సమాచారం అందించేందుకు ఉద్దేశించిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగానికి అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసింది. జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ద్వారా 2,275 కిలోల బరువున్న ఇన్‌శాట్-3డీఎస్‌ను నింగిలోకి పంపనుంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు ఈ ప్రయోగం చేపట్టనుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే అన్నదాతలకు మేలు చేకూరనుంది. ప్రస్తుతం సేవలందిస్తున్న ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్‌లకు కొనసాగింపుగా ఇన్‌శాట్-3డీఎస్ వాతావరణ సేవలను మెరుగుపరచనుంది. కాగా, రెండోతరం హై రిజల్యూషన్ ఇమేజింగ్ శాటిలైట్ల ప్రయోగంలో భాగంగా 17 ఏళ్ల క్రితం ప్రయోగించిన కార్టోశాట్-2ను అంతరిక్షం నుంచి విజయవంతంగా భూ వాతావరణంలోకి ప్రవేశపెట్టినట్టు ఇస్రో సీనియర్ అధికారి వెల్లడించారు.

క్యాన్సర్ రోగుల ఆయుష్షును పెంచే కొత్త ఔషధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: మెసోథెలియోమా అనే ప్రాణాంతక క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడి.. రోగుల ఆయుష్షను పెంచే కొత్త ఔషధాన్ని లండన్‌లోని క్వీన్ మేరీ యూనివర్సిటీ పరిశోధకులు కనుగొన్నారు. కీమోథెరపీతోపాటు ఈ తాము కొత్తగా కనుగొన్న ఏడీఐ-పీఈజీ20 (పెగర్గిమినేస్) ఔషధాన్ని కూడా అందించడం ద్వారా పరిశోధకులు మెరుగైన ఫలితాలు సాధించారు.ట్రయల్స్‌లో భాగంగా అమెరికా, ఆస్ట్రేలియా, ఇటలీ, తైవాన్ దేశాలకు చెందిన 249 మంది కేన్సర్ రోగులకు కీమోథెరపీ చికిత్స అందించారు. వారిలో సగం మందికి కీమోథెరపీతోపాటు కొత్త ఔషధాన్ని కూడా ఇచ్చారు. కొత్త మందు తీసుకున్న వారి బతికే కాలం మిగిలిన రోగులతో పోలిస్తే సగటున 1.6 నెలలు పెరిగినట్టు పరిశోధకులు గుర్తించారు.

వందే భారత్‌కు 'కవచ్' ప్రయోగం విజయవంతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ప్రమాదాలు నివారించడానికి ఉద్దేశించిన ఆటోమేటిక్ బ్రేకుల విధానమైన 'కవచ్'ను ప్రయోగాత్మకంగా వందే భారత్ రైళ్లకు అమర్చారు. శుక్రవారం ఆగ్రా డివిజన్‌లోని మథుర-పల్వాల్ స్టేషన్ల మధ్య ఎనిమిది బోగీల వందేభారత్ రైలుకు దీన్ని అమర్చి నడిపారు. 160 కి.మీ. వేగంతో వెళ్తున్న ఆ రైలు.. డ్రైవర్ బ్రేకు వేయనప్పటికీ రెడ్ సిగ్నల్‌కు పది మీటర్ల ముందు ఆటోమేటిక్‌గా ఆగిపోయింది. దాంతో ఈ ప్రయోగం విజయవంతమయిందని రైల్వే వర్గాలు ప్రకటించాయి. అనుకున్న ఫలితాలు రావడంతో 16 బోగీల వందే భారత్ రైలుకు అమర్చి మరో ప్రయోగం చేయనున్నారు.

ముంబై ఎయిర్‌పోర్టులో వీల్ చైర్ ఇవ్వని సిబ్బంది..
నడిచి వెళ్లి 80 ఏళ్ల వృద్ధుడు గుండెపోటుతో మృతి

ముంబై, ఫిబ్రవరి 16: ముంబైలోని ఛత్రపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో వీల్ చైర్లు అందుబాటులో లేక ఓ 80 ఏళ్ల వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. విమానం వద్ద నుంచి ఇమ్మిగ్రేషన్ వరకు నడుచుకుంటూ వెళ్లి కుప్పకూలి మృతి చెందారు. ఫిబ్రవరి 12న జరిగిన ఈ విషాదకర ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలో నివసిస్తున్న భారత సంతతికి చెందిన ఓ 80 ఏళ్ల వ్యక్తి తన భార్యతో కలిసి ఎయిర్ ఇండియా విమానంలో ఈ నెల 12న న్యూయార్క్ నుంచి ముంబై వచ్చారు. టికెట్లు కొనుగోలు సమయంలోనే వారిద్దరూ వీల్ చైర్ ప్రయాణికులుగా నమోదయ్యారు. అయితే వారు విమానం దిగిన తర్వాత సిబ్బంది వీల్ చైర్ల కొరతతో వారికి ఒకే వీల్ చైర్‌ను అందించారు. దాంతో అందులో తన భార్యను కూర్చోబెట్టి ఆయన వెనుక నడుచుకుంటూ వెళ్లారు. ఇమ్మిగ్రేషన్ వద్దకు చేరాక అస్వస్థతకు గురై కుప్పకూలారు. ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

కాంగ్రెస్ ఖాతాల స్తంభన!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి రూ.210 కోట్ల ఆదాయపు పన్ను కట్టాలంటూ తమ పార్టీకి చెందిన నాలుగు ఖాతాలను ఐటీ శాఖ స్తంభింపజేసిందని, వీటిలో యువజన కాంగ్రెస్ ఖాతా కూడా ఉన్నదని తెలిపారు. సదరు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొంత ఆలస్యంగా ఐటీ రిటర్నులను దాఖలు చేశామని, ఈలోపే ఈ చర్య తీసుకున్నారన్నారు. ఐటీ ఆదేశాలు బుధవారం జారీ అయ్యాయని చెప్పారు. అయితే, ఐటీ శాఖ స్తంభింపజేసిన కాంగ్రెస్ ఖాతాల సంఖ్య తొమ్మిదని తర్వాత వెల్లడైంది. కాగా, ఐటీ ఆదేశాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నేత వివేక్ టంకా ఐటీ అప్పీలేట్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేశారు. తమ ఖాతాలను స్తంభనను కొనసాగిస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తాము పాల్గొనే పరిస్థితి ఉండబోదని ట్రిబ్యునల్‌కు తెలిపారు. దీనిపై విచారణ జరిపిన ట్రిబ్యునల్.. బ్యాంకు ఖాతాల్లో కనీసం రూ.115 కోట్ల మొత్తం ఉంచాలని, ఆ పైనున్న సొమ్మును మాత్రమే వినియోగించుకోవాలని, బుధవారం తదుపరి విచారణ జరుపుతామని తెలిపింది. దీనిపై మాకెన్ స్పందిస్తూ.. ట్రిబ్యునల్ రూ.115 కోట్ల వరకూ నిధులను స్తంభింపజేసిందని, అయితే, ప్రస్తుతం తమ కరెంటు ఖాతాల్లో అంత మొత్తం లేదని, అంటే తమ ఖాతాల స్తంభన కొనసాగుతున్నట్లేనని అన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ వేతనాల్లోంచి పార్టీకి ఇచ్చిన రూ.14.4 లక్షలతోపాటు ప్రజల నుంచి తాము సేకరించిన విరాళాలను కూడా స్తంభింపజేశారని తెలిపారు. విద్యుత్ బిల్లులు, ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు కూడా తమ వద్ద డబ్బు లేదని, తాము జారీ చేసిన చెక్కులను బ్యాంకులు తిరస్కరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల ఖాతాలు స్తంభింపచేయడమంటే ప్రజాస్వామ్యాన్ని స్తంభింపచేయడమేనన్నారు.

నియంతృత్వం ముందు ఎన్నటికీ మోకరిల్లం: రాహుల్ గాంధీ

తమ బ్యాంకు ఖాతాల స్తంభనను ఖర్గే తీవ్రంగా ఖండించారు. అధికారదాహంతో ఉన్న కేంద్రప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద ప్రతిపక్ష పార్టీపై చేపట్టిన ఈ చర్య ప్రజాస్వామ్యంపై తీవ్రమైన దాడి అని పేర్కొన్నారు. 'రాజ్యాంగ వ్యతిరేకంగా బీజేపీ సేకరించిన డబ్బులు ఆ పార్టీ వద్దే ఉంటాయి కానీ, ప్రజల నుంచి మేం సేకరించిన విరాళాల్ని మాత్రం స్తంభింపజేస్తారు. అందుకనే, మోదీ మళ్లీ గెలిస్తే భవిష్యత్తులో ఎన్నికలు ఉండవని నేను ఇప్పటికే హెచ్చరించా. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, బహుళ పార్టీ వ్యవస్థను కాపాడమని న్యాయవ్యవస్థను కోరుతున్నా' అని ఖర్గే విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ బలం డబ్బుల్లో లేదని, ప్రజల్లో ఉందని, నియంతృత్వం ముందు ఎన్నటికీ మోకరిల్లబోమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాజకీయ సమతుల్యతను కాపాడటానికి ఎలక్టోరల్ బాండ్లను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవటంతో.. ప్రభుత్వం ఈ మార్గాన్ని ఎంచుకొని తమ ఖాతాలను స్తంభింపజేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు.



జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ జీపును నడుపుతున్న తేజస్వి

ఇండియా అధికారంలోకి వస్తే
రైతుల డిమాండ్లకు ఆమోదం

» జోడో న్యాయ్ యాత్రలో రాహుల్

మోహనియా, ఫిబ్రవరి 16: ఓ బడా వ్యాపార సంస్థకు రక్షణ బడ్జెట్ భారీగా సమర్పించేందుకే అగ్నివీర్ స్కీమ్‌ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అగ్నివీర్‌లకు జీతభత్యాలు చెల్లించకుండా ఆ సంస్థకు లబ్ధి చేకూర్చేందుకే ఇలా చేశారని విమర్శించారు. బిహార్ రాష్ట్రం కైమూర్ జిల్లా మోహనియాలో శుక్రవారం భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ ఈమేరకు వ్యాఖ్యలు చేశారు. "సాధారణ సైనికుల్లా అగ్నివీర్‌లకు జీతం రాదు. పెన్షనూ రాదు. ఆర్మీ క్యాంటీన్‌లలోకీ వారిని రానివ్వరు" అని రాహుల్ అన్నారు. అంతకుముందు బిహార్‌లోని రోహతాస్ వద్ద కిసాన్ న్యాయ్ పంచాయత్‌ని ఉద్దేశించి మాట్లాడుతూ తమ కూటమి అధికారంలోకి వస్తే దీర్ఘకాలంగా పెండింగ్‌లో రైతుల డిమాండ్లను ఆమోదిస్తుందని చెప్పారు. పంటలకు కనీస మద్దతు ధర లభించేలా చట్టబద్ధమైన గ్యారెంటీ అమలు చేస్తామన్నారు. రాహుల్ యాత్రలో ఆర్జేడీ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ మెరిశారు. రాహుల్, ఇతర కాంగ్రెస్ నేతలు ప్రయాణిస్తున్న జీపును తేజస్వి స్వయంగా నడిపారు. న్యాయ్ యాత్ర శుక్రవారం సాయంత్రం యూపీలోకి ప్రవేశిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ తెలిపారు. యూపీలోని చందౌలిలోయాత్రలో పాల్గొనాల్సిన ప్రియాంక గాంధీ ఆరోగ్యం బాగోలేనందున రాలేదు.

మణిపూర్‌లో మళ్లీ హింస

» భద్రత బలగాల కాల్పుల్లో ఇద్దరి మృతి

చురచందాపూర్, ఫిబ్రవరి 16: మణిపూర్‌లో మళ్లీ హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. కుకీ-జో గిరిజనులు అధికంగా ఉండే చురచందాపూర్‌లో గురువారం రాత్రి భద్రతా బలగాలు కాల్పులు జరపడంతో ఇద్దరు మరణించారు. సుమారు 25 మంది గాయపడ్డారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా 144వ సెక్షన్ విధించింది. అయిదు రోజుల పాటు మొబైల్ ఇంటర్నెట్ సేవలను రద్దు చేసింది. సాయుధ తిరుగుబాటుదార్లతో ఓ హెడ్‌కానిస్టేబుల్ సెల్ఫీ దిగిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడం ప్రస్తుత సమస్యకు కారణమయింది. సయాంలాల్ పౌల్ అనే హెడ్ కానిస్టేబుల్ ఓ సాయుధుడు, మరికొందరు గ్రామ రక్షణ వాలంటీర్లతో కలిసి ఉన్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చింది. ఇది క్రమశిక్షణ ఉల్లంఘన కిందికి వస్తుందని భావించి ఆ హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఇందుకు నిరసనగా సుమారు నాలుగువందల మంది ఎస్పీ కార్యాలయం చుట్టుముట్టి ఆందోళనకు దిగడంతో పోలీసులు కాల్పులు జరిపారు. కాగా, పోలీసుల తీరుపై ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరం ఆగ్రహం వ్యక్తం చేసింది. 24 గంటల్లోగా జిల్లాను విడిచి వెళ్లాలని ఎస్పీని హెచ్చరించింది.

బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించండి

» రాష్ట్రపతికి విన్నవించిన ఎస్సీ కమిషన్

కోల్‌కతా, ఫిబ్రవరి 16: బెంగాల్లోని బంగ్లా సరిహద్దు గ్రామం సందేశ్‌ఖాలీలో అధికార టీఎంసీ నేతలు దళితుల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, దళిత మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణలకు సంబంధించి జాతీయ ఎస్సీ కమిషన్ శుక్రవారం రాష్ట్రపతిని కలిసి నివేదికను సమర్పించింది. కమిషన్ ఛైర్మన్ సందేశ్ హాల్దర్ విలేకరులతో మాట్లాడుతూ, బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతికి విన్నవించామని చెప్పారు. తగిన చర్య తీసుకుంటామని రాష్ట్రపతి ముర్ము తమకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో సందేశ్‌ఖాలీ, పరిసరాల్లోని ఐదు గ్రామాల్లో 144 సెక్షన్‌ను విధించారు. సందేశ్‌ఖాలీ గ్రామానికి వెళ్లేందుకు కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

ఐక్య రాజ్య సమితికి అన్నదాతలు

డిమాండ్ల పరిష్కారంలో చొరవ చూపాలని విన్నపం.. పంజాబ్, హరియాణా హైకోర్టు సీరియస్

» పిటిషన్‌ను వాపస్ తీసుకోవాలని సూచన.. రైతుల భారత్ బంద్ పాక్షికం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, రుణ మాఫీ, అన్నదాతలకు పింఛన్లు తదితర డిమాండ్లతో ఉవ్వెత్తున సాగుతున్న రైతు ఉద్యమం ఐక్య రాజ్య సమితికి చేరింది. రైతుల పక్షాన ఈ విషయంలో జోక్యం చేసుకుని డిమాండ్ల పరిష్కారానికి సహకరించాలని పిటిషనర్ ఉదయ్ ప్రతాప్ సింగ్.. ఐక్య రాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియోకు లేఖ రాశారు. అయితే, దీనిపై పంజాబ్, హరియాణా కోర్టు సీరియస్ అయింది. "ఇదేం పద్ధతి.. రైతుల డిమాండ్ల విషయంలో జోక్యం చేసుకుని సహకరించాలని హైకోర్టును ఆశ్రయించారు. సంబంధింత అంశం మా పరిశీలనలో ఉంది. అది విచారణలో ఉండగానే ఐక్య రాజ్య సమితిని ఎలా ఆశ్రయిస్తారు..?" అని తాత్కాలిక చీఫ్ జస్టిస్ సంధావాలియా, జస్టిస్ లాపితా బెనర్జీ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఐక్య రాజ్య సమితిలో వేసిన పిటిషన్‌ను వాపస్ తీసుకోవాలని హైకోర్టు కోరగా.. పిటిషనర్ అంగీకరించారు. కాగా, రైతుల ఆందోళనకు సంబంధించి రెండు పిటిషన్లపై పంజాబ్, హరియాణా హైకోర్టులో విచారణ నడుస్తోంది. ఇందులో ఒకటి హరియాణాలో ఇంటర్నెట్ నిషేధం, సరిహద్దుల మూసివేతపై.. మరొకటి.. ఆందోళన చేస్తున్న రైతులు రహదారులను దిగ్బంధించడంపై కోర్టులో వాదనలు నడుస్తున్నాయి. గురువారం ఈ అంశాలపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఐరాస విషయం తెలిసి సీరియస్ అయింది.



టియర్ గ్యాస్‌తో రైతులను చెదరగొడుతున్న పోలీసులు

నాలుగో రోజూ కొనసాగిన ఆందోళనలు..

పంజాబ్, హరియాణా, యూపీ రైతులు చేస్తున్న ఆందోళనలు నాలుగో రోజూ కొనసాగాయి. అంబాలా సమీపంలోని శంభూ సరిహద్దుల్లోని బ్యారికేడ్ల దిశగా కదిలిన రైతులను చెదరగొట్టేందుకు హరియాణా పోలీసులు టియర్ గ్యాస్‌ను వదిలారు. శంభూ వద్ద ఆందోళనలో పాల్గొన్న వృద్ధుడు(78) గుండెపోటుతో మరణించాడు. అన్నదాతల ఆందోళనకు మద్దతుగా నిలవాలంటూ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన భారత్ బంద్ పిలుపునకు దేశవ్యాప్తంగా పలు పార్టీలు, కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. అయితే బంద్ పాక్షికంగా జరిగింది. పంజాబ్, హరియాణాలో మాత్రమే బంద్ తీవ్రత కనిపించింది. కాగా, రైతు సంఘాలతో కేంద్ర మంత్రులు జరిపిన చర్చలు మూడు సార్లు విఫలం కావడంతో శుక్రవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా..మంత్రులు అర్జున్ ముండా, గోయల్‌తో సమావేశమయ్యారు. రైతుల డిమాండ్లపై చర్చించేందుకు కేంద్ర మంత్రులు, రైతు సంఘాల నేతలు ఆదివారం నాలుగో దఫా సమావేశం కానున్నారు.

'రాజ్యసభ' ధనవంతుల్లో జయాబచ్చన్ టాప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: రాజ్యసభకు పోటీ చేస్తున్న అభ్యర్థులలో బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ సతీమణి జయాబచ్చన్ అత్యధిక ఆస్తులు కలిగి ఉన్నారు. తన భర్తకు, తనకు కలిపి మొత్తం రూ.1,578 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి ఎస్పీ తరఫున ఆమె ఐదోసారి రాజ్యసభకు పోటీ చేస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో వారి ఆస్తుల వివరాలను వెల్లడించారు. ప్రముఖులలో తొలిసారి రాజ్యసభకు పోటీ చేస్తున్న ఏఐసీసీ మాజీ చీఫ్ సోనియా గాంధీ 90 వేల నగదుతో పాటు మొత్తం రూ.12.53 కోట్ల ఆస్తులు ఉన్నట్టు ప్రకటించారు. ఇటీవలే బీజేపీలో చేరిన కాంగ్రెస్ నేత, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ స్థిర, చరాస్తులు రూ.68 కోట్లు ఉన్నట్టు వెల్లడించారు. కాగా, ఆంధ్రప్రదేశ్ నుంచి వైసీపీ తరఫున రాజ్యసభకు పోటీ చేస్తున్న అభ్యర్థులలో మేడా రఘునాథరెడ్డి అత్యధికంగా రూ.475 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

ఆయుధ వ్యవస్థల కొనుగోళ్లకు
84,560 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

రాడార్, భారీ టార్పెడోలు, మీడియం రేంజ్ మారిటైం గూఢచర్య వ్యవస్థ, ఫ్లైట్ రీఫ్యూయల్ ఎయిర్‌క్రాఫ్ట్, సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియోలను సమకూర్చుకునేందుకు పచ్చజెండా ఊపింది. 'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా భారతీయ సంస్థల నుంచే ఈ కొనుగోళ్లు చేపట్టనున్నట్లు రక్షణ శాఖ వెల్లడించింది. భారత నావికాదళం, ఇండియన్ కోస్ట్ గార్డ్ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి మధ్యశ్రేణి సముద్ర గూఢచర్య వ్యవస్థను, మల్టీమిషన్ మారిటైం ఎయిర్‌క్రాఫ్ట్‌ల కొనుగోలుకు ఆమోదించినట్లు రక్షణ శాఖ పేర్కొంది. అదేవిధంగా గగనతల రక్షణ వ్యవస్థలను ముఖ్యంగా తక్కువ ఎత్తులో, నిదానంగా ఎగిరే చిన్న లక్ష్యాలను గుర్తించే సామర్థ్యాలను పెంచే లక్ష్యంతో ఎయిర్ డిఫెన్స్ వ్యూహాత్మక నియంత్రణ రాడార్ల కొనుగోలు చేయనున్నట్లు తెలిపింది. వైమానిక దళం పరిధిని పెంచడానికి ఫ్లైట్ రీఫ్యూయలర్ ఎయిర్‌క్రాఫ్ట్ కొనుగోలుకు ఆమోదించింది. ఈ ప్రతిపాదనలకు కేబినెట్ కమిటీ త్వరలోనే తుది ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

నోటిఫయబుల్ డిసీజ్‌గా క్యాన్సర్

కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో మహమ్మారికి అడ్డుకట్ట.. తొలిదశలో గుర్తిస్తే ప్రాణాలను కాపాడొచ్చు

» సర్వైకల్ క్యాన్సర్ నిరోధానికి కేంద్రప్రభుత్వ చర్యలు భేష్

» బడ్జెట్‌లో ప్రస్తావనపై ఆంకాలజిస్టు నోరి దత్తాత్రేయుడు

వాషింగ్టన్, ఫిబ్రవరి 16: తొమ్మిది నుంచి పద్నాలుగేళ్ల వయసు బాలికల్లో సర్వైకల్ క్యాన్సర్ నిరోధానికి కీలకచర్యలు చేపట్టనున్నట్లు, ఆ దిశగా టీకా కార్యక్రమాన్ని ప్రోత్సహించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించడంపై.. ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ప్రశంసించారు. భారతదేశంలో మహిళలకు వస్తున్న క్యాన్సర్లలో రెండోస్థానంలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ఉందని.. ఏటా ఇండియాలో 85 వేల సర్వైకల్ క్యాన్సర్ కేసులు, దాని కారణంగా 50 వేల మరణాలు నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో.. సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించే కార్యక్రమాలపై కేంద్రం దృష్టి సారించి, బడ్జెట్‌లో ప్రకటించడం ప్రశంసనీయమని.. కీలకమైన ప్రజారోగ్య సమస్య పరిష్కారం దిశగా వేసిన మెచ్చుకోదగ్గ అడుగు అని ఆయన పేర్కొన్నారు. "దేశంలో రోజుకు దాదాపు 150 మంది మహిళల ప్రాణాలను బలిగొంటున్న సర్వైకల్ క్యాన్సర్ నుంచి కాపాడేందుకు 9-14 ఏళ్ల బాలికలకు టీకాలు వేయించడం గొప్ప విషయం" అని కొనియాడారు. క్యాన్సర్ కేసులను నివారించేందుకు.. వ్యూహాత్మకమైన, ప్రణాళికతో కూడిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. క్యాన్సర్‌పై అవగాహన పెంచడం, క్యాన్సర్ కేసులను తొలి దశల్లోనే గుర్తించేలా స్క్రీనింగ్ కార్యక్రమాలు చేపట్టడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. 2018లో 'నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా'ను ఏర్పాటు చేయడాన్ని ఆ మహమ్మారిపై పోరులో కీలక మైలురాయిగా అభివర్ణించిన డాక్టర్ నోరి.. చేయాల్సింది ఇంకా చాలా ఉందని స్పష్టం చేశారు. "క్యాన్సర్ స్క్రీనింగ్, దాన్ని తొలి దశల్లోనే గుర్తించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడం, క్యాన్సర్ బారి న పడ్డవారికి అత్యాధునిక చికిత్సలను, అందుబాటు ధరల్లోకి తేవడం చాలా కీలకం. అంతే కాదు.. అన్ని రాష్ట్రాలూ క్యాన్సర్‌ను నోటిఫయబుల్ డిసీజ్‌గా గుర్తించాలి" అని ఆయన సూచించారు. దేశంలో ప్రస్తుతం 3-4 రాష్ట్రాలు మాత్రమే క్యాన్సర్‌ను నోటిఫయబుల్ డిసీజ్‌గా గుర్తించాయి. ఏదైనా వ్యాధి ని నోటిఫయబుల్ డిసీజ్‌గా ప్రకటిస్తే.. కొత్త కేసు నమోదైనప్పుడు డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆస్పత్రులు ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తాయి. ఇటీవల ప్రపంచాన్ని వణికించిన కరోనా కేసులు ఏ రోజు ఎన్ని నమోదైందీ ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్ల నుంచి పూర్తి సమాచారం ప్రభుత్వానికి చేరింది గుర్తుందా? అలాగే క్యాన్సర్‌ను కూడా నోటిఫయబుల్ డిసీజ్‌గా ప్రకటిస్తే ప్రభుత్వం దగ్గర పూర్తి వివరాలు ఉంటాయని.. తద్వారా క్యాన్సర్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి క్యాన్సర్ కేర్‌ను సమన్వయం చేసుకోవడం సులభమవుతుందని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద ఈ చర్యలను అమలు చేస్తే దేశంలో క్యాన్సర్ కేసుల పెరుగుదలకు అడ్డుకట్ట వేయొచ్చన్నారు.




నోరి దత్తాత్రేయుడు

రష్యా ప్రతిపక్ష నేత నావల్నీ జైలులో మృతి



మాస్కో, ఫిబ్రవరి 16: రష్యా అధ్యక్షుడు పుతిన్ బద్ధశత్రువు, ప్రభుత్వ అవినీతిపై ఉద్యమించిన ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ (47) శుక్రవారం జైలులో మరణించినట్టు ప్రిజన్ సర్వీస్ ఒక ప్రకటనలో తెలిపింది. 'జైలులో కొంతసేపు నడిచిన తర్వాత ఆయన అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయారు. వెంటనే వైద్య సిబ్బంది వచ్చి పరీక్షించారు. అయితే ఆయనను కాపాడేందుకు చేసే ప్రయత్నాలు ఫలించలేదు. ఆయన మరణించారని వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉందని ఆ ప్రకటన వివరించింది. నావల్నీ తీవ్రవాద అభియోగాలతో పాటు పలు కేసుల్లో 19 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. రష్యాలో అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నావల్నీ మృతి అనుమానాలు రేకెత్తిస్తోంది. కాగా, 2020లో సెర్బియా పర్యటనలో ఉన్నప్పుడు నావల్నీపై విషప్రయోగం జరగడం అప్పట్లో సంచలనం సృష్టించింది.


GHMC PERMISSION NO: 2187/GHMC/KPL/2023-BP
TS RERA REGISTRATION NO: P02200005923
HONER HOMES
THE BIGGEST GATED COMMUNITY IN THE HEART OF CITY.
THE DREAMS OF YESTERDAY, THE MOST COVETED ADDRESS OF TODAY, THE LUXURIES OF TOMORROW.
INDULGE IN THE
RARE
H.O.N.E.R
3 & 3.5 BHK PREMIUM Apartments
BOOK NOW AT ₹8099* PER SFT. IN TOWERS D & G
4 BHK ULTRA-PREMIUM Apartments
BOOK NOW AT ₹8349* PER SFT.
27.5 Acres
18 Towers
G+25 Floors
3266 Units
1695 to 3815 Sft. Unit Sizes
G+4 Floors Elysia Sports Club
G+4 Floors Activity Clubhouse
20,000 Sft. Largest Community Gym
2 Swimming Pools
5 Acres Courtyard
EV Charging Stations
Bank with ATM & Lockers
HONER Signatis
your style. your signature.
Kukatpally - Hitec City
PROJECT APPROVED BY ALL MAJOR BANKS.
*Terms & Conditions apply. All norms, requirements pertaining to the environment, fire services, GHMC rules and regulations have been adhered to while designing HONER SIGNATIS. This ad is conceptual and not a legal offering for Sale/Agreement. Disclaimer: This advertisement does not constitute an offer and/or acceptance and/or contract and/or any intention thereof and/or a disclosure under any statue of any nature whatsoever The pictorial/other representation herein, the layout, number of buildings/towers/wings/structures, facilities, and amenities are merely creative imagination and an Architect's impression and are only indicative. The actual product may vary/differ from what is indicated herein. The photograph contained herein may be stock/standard photography used for the purpose and have been taken at location other than the project site and are used to indicate a conceptual lifestyle.
Project Approved by GHMC
A Member of CREDAI HYDERABAD
NAREDCO TELANGANA
MEMBER
For Bookings Visit: Honer Signatis - IDL Lake Road, Kukatpally. (9 AM - 7 PM)
www.honerhomes.com
FOLLOW US ON:
78278 66666
Scan for Rare

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బలపడిన బంధం

అరబ్ ఎమిరేట్స్, ఖతార్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు గల్ఫ్‌తో మన బంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది. దేశంలో సార్వత్రిక ఎన్నికల సంరంభం ఆరంభం కాబోతున్న నేపథ్యంలో, మోదీ రెండోవిడత పదవీకాలంలో బహుశా ఇదే ఆఖరు విదేశీపర్యటన కావచ్చు. అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాభిలో 'ఎహ్లాన్ మోదీ' పేరిట ఆయనకు స్వాగతం పలుకుతూ, మరోపక్క ఆ దేశపాలకులను కూడా కీర్తిస్తూ ఏర్పాటైన ఓ భారీ కార్యక్రమంలో భారత ప్రధాని పాల్గొన్నారు. అనంతరం అద్భుతమైన స్వామినారాయణ్ ఆలయ ఆరంభోత్సవంలోనూ పాలుపంచుకున్నారు. ఆ తరువాత ప్రత్యేకంగా ఖతార్ వెళ్ళి ఎనిమిదిమంది భారతీయ మాజీ నౌకాదళ సిబ్బందిని క్షేమంగా తిప్పిపంపినందుకు ఆ దేశాధినేతకు తన సంతోషాన్ని కృతజ్ఞతలను తెలియచేశారు.

అరబ్ ఎమిరేట్స్ అభివృద్ధిలో కోట్లాదిమంది భారతీయ శ్రామికుల పాత్ర కాదనలేనిది. వారి సేవలకు, భారతదేశంతో స్నేహానికి ఆ దేశం ఎంతో ప్రాధాన్యం ఇస్తూవచ్చింది. నరేంద్రమోదీ ప్రధాని అయిన మరుసటి ఏడాదే ఆ దేశంలో కాలూని ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేశారు. 1981లో ఇందిరాగాంధీ పర్యటన తరువాత భారత ప్రధాని ఎవరూ ఆ దేశానికి వెళ్లలేదు. ఆ లోటు పూర్తిగా తీర్చడానికి ఇప్పటివరకూ మోదీ చేసిన ఏడు పర్యటనలూ ఉపకరించి, ఇరుదేశాల ఆర్థికవ్యాపార సంబంధాలతో పాటు, స్నేహం కూడా హెచ్చింది. ఎమిరేట్స్‌వృద్ధిలో ముప్పెక్కల పైచిలుకు ప్రవాసభారతీయుల పాత్ర అక్కడి పాలకులకు తెలుసు. ప్రవాసుల అభీష్టాన్ని గౌరవించి హిందూ ఆలయ నిర్మాణానికి వారు స్థలం ఇచ్చారు. ఒక సంప్రదాయ ఇస్లామిక్ దేశంలో పాలకుల సంపూర్ణ సహకారాలతో, పాతిక ఎకరాలకుపైగా విస్తరించిన ప్రాంగణంలో భారీ ఆలయం నిర్మాణం కావడం ఒక విశేషమైన ఘట్టం. గల్ఫ్‌లో ఇదే అతిపెద్ద హిందూ ఆలయం. దుబాయ్‌లో ఇప్పటికే రెండు ఆలయాలున్నప్పటికీ, మతనిష్ఠ అధికంగా ఉన్న అబుదాభీలో ఇంతటి భారీ నిర్మాణానికి అవకాశం ఇవ్వడం విశేషం. ఒక ముస్లిం పాలకుడు స్థలాన్నిస్తే, చీఫ్ ఆర్కిటెక్ట్‌గా ఒక కేథలిక్, ప్రాజెక్ట్ మేనేజర్‌గా ఓ సిక్కు, రూపకర్తగా ఓ బౌద్ధుడు వ్యవహరిస్తే పార్సీ కంపెనీ దీని నిర్మాణాన్ని చేపట్టింది. మసీదుల కింద ఆలయాలున్నాయంటూ మనదేశంలో వాటిని కూల్చే ఉద్యమాలు జరుగుతూంటే, మతరాజ్యమని అనుకుంటున్నచోట పాలకుల సహకారంతో ఇలా ఓ పరమత ప్రార్థనామందిర నిర్మాణం జరగడం, ఆరంభోత్సవంలో భారత ప్రధానితో పాటు అక్కడి పెద్దలూ ఉండటం విశేషం. స్థానికుల కంటే ప్రవాసులే అధికంగా ఉన్నచోట, వలసవచ్చినవారి మత ఆకాంక్షలను గౌరవించడానికి, వారి అభీష్టాన్ని నెరవేర్చడానికి ఎంతో ఔదార్యం కావాలి.

ఖతార్ సైతం మనతో ఎంతో ఆత్మీయంగా వ్యవహరించింది. ఎమీర్ జోక్యం లేకపోయివుంటే మరణశిక్షపడిన ఎనిమిదిమంది మాజీ నౌకాదళ అధికారులు క్షేమంగా స్వదేశానికి చేరగలిగేవారు కాదు. ఒకపక్క న్యాయస్థానాల్లో పోరాడుతూ, మరోవైపు దౌత్యం నెరపుతూ గూఢచర్యం ఆరోపణలతో మరణశిక్షపడిన వారిని ఎట్టకేలకు మనం వెనక్కుతెచ్చుకోగలిగాం. ఉభయదేశాలమధ్యా ఉన్న స్నేహం, వాణిజ్యబంధం అందుకు ఉపకరించాయి. స్థానికుల కంటే ప్రవాసులే ఐదురెట్లు అధికంగా ఉన్న ఆ దేశంలో, భారతీయులు ఎనిమిది లక్షల మంది ఉండటం వెనుక ఖతార్ ఎమీర్ ప్రోత్సాహం కాదనలేనిది. 2008లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పర్యటనతో ద్వైపాక్షికబంధం విశేషమైన మార్పుచెందితే, 2016లో మోదీ పర్యటన తరువాత అది మరింత దృఢపడింది. వివిధ రంగాల్లో ఉభయదేశాల సహకారం పెరిగి, ద్వైపాక్షిక వాణిజ్యం 18 బిలియన్ డాలర్లకు చేరుకుంది. రెండేళ్ళక్రితం ఇరుదేశాలూ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాన్ని సైతం చేసుకున్నాయి. మనదేశం దిగుమతిచేసుకొనే ద్రవీకృత సహజవాయువులో 40శాతం ఖతార్‌నుంచే వస్తున్నది. 1999లో గ్యాస్ సరఫరాకు సంబంధించి చేసుకున్న ఒప్పందం మరో నాలుగేళ్ళలో ముగిసిపోబోతున్న నేపథ్యంలో, ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవాల్సిన గడువు గత ఏడాది డిసెంబరుతో పూర్తయింది. ఇటీవలే, 2048వరకూ అమలులో ఉండే విధంగా ఏకంగా 78బిలియన్ డాలర్ల విలువైన భారీ ఒప్పందం ఉభయదేశాల మధ్యా కుదిరింది. దీనికీ, ఈ ఎనిమిది మంది అధికారుల విడుదలకూ సంబంధం ఉన్నదన్న అనుమానాలను అటుంచితే, భారతప్రధాని ఈ పర్యటనలో ప్రత్యేకంగా ఖతార్ వెళ్ళి ఆ దేశాధినేతకు మనవారిని క్షేమంగా వెనక్కుపంపినందుకు ధన్యవాదాలు తెలియచేయడం సముచితం.

ఆర్థిక వాస్తవాలు-రాజకీయ లక్ష్యాలు

కొంత మంది వ్యక్తులు కొన్ని కొన్ని సందర్భాలలో ప్రవర్తించే తీరు వింతగా, ఉన్మాదపూరితంగా ఉండవచ్చు. అయితే ఆ పిచ్చి ప్రవర్తనల వెనుక ఒక అర్థవంతమైన కారణం తప్పక ఉంటుంది. సార్వత్రిక ఎన్నికలు సమీపించిన తరుణంలో తన చివరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ప్రభుత్వం ఒక మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. దానితో పాటు, కొత్త ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ – జూలై కాలానికి ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ (అనామతు పద్దు)నూ ప్రవేశపెడుతుంది. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం గత ఐదేళ్లలో ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం నిర్వహించిన తీరుతెన్నుల సింహావలోకనానికి, ఆర్థిక వ్యవస్థ భవిష్యత్‌కు ఒక మార్గదర్శక ప్రణాళికను ఆవిష్కరించే సందర్భంగా ఉంటుంది. ఈ నెల 2న లోక్‌సభలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో ఆ రెండు బాధ్యతలనూ కొంచెం కొంచెంగా నిర్వర్తించారు. దరిమిలా ఫిబ్రవరి 8న 2014కు ముందు, తరువాత దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతులపై ప్రభుత్వం ఒక శ్వేతపత్రాన్ని, నరేంద్ర మోదీ పదేళ్ల పాలనపై కాంగ్రెస్ పార్టీ 'పది సంవత్సరాల అన్యాయకాలం' పేరిట ఒక బ్లాక్ పేపర్‌ను విడుదల చేశాయి. మోదీ సర్కార్ పదేళ్ల పాలన ఆఖరి ఘట్టంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్వేతపత్రం ఆ పదేళ్ల (2014–24)లో దేశ ఆర్థిక వ్యవస్థ సాఫల్య వైఫల్యాలపై ఉండగలదని ఎవరైనా ఆశిస్తారు. ఆశ్చర్యకరంగా ఆ శ్వేతపత్రం యూపీఏ ప్రభుత్వాల పదేళ్ల (2004–2014) పాలనపై ఉన్నది. ప్రభుత్వ శ్వేతపత్ర లక్ష్యం యూపీఏ పదేళ్ల పాలనను అభివృద్ధి రహిత కాలంగా చిత్రించడమే సుమా! అయితే ఆ ప్రభుత్వాలు సాధించిన విజయాలను కూడా అది చర్చలోకి తీసుకువచ్చింది. మరి యూపీఏ, ఎన్డీఏ ప్రభుత్వాల పాలన తీరుతెన్నులను పోల్చి చూడడం అనివార్యమవుతుంది. అటువంటి పరిశీలనలో కొన్ని రంగాలలో యూపీఏ ప్రభుత్వాలు ఎన్డీఏ ప్రభుత్వం కంటే చాలా మెరుగైన ఫలితాలు సాధించాయని స్పష్టమవుతుంది. మోదీ సర్కార్ శ్వేతపత్రమే అందుకొక తార్కాణం.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఆర్థికాభివృద్ధి విషయమై చర్చించేటప్పుడు అందరూ దృష్టి పెట్టే అంకె ఒకటి ఉంది. అది: స్థిరమైన ధరలలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు. ఈ విషయంలో యూపీఏ ప్రభుత్వాల పనితీరే చాలా చాలా మెరుగ్గా ఉంది. 2004–05 ఆధార సంవత్సరంగా తీసుకుని పది సంవత్సరాలలో జీడీపీ వృద్ధి రేటును గణిస్తే అది 7.5 శాతంగా ఉన్నది. 2015లో బీజేపీ ప్రభుత్వం ఈ ఆధార సంవత్సరాన్ని 2011–12కి మార్చింది. యూపీఏ ప్రభుత్వాలు సాధించిన విజయాలను తక్కువగా చూపడానికే ఈ మార్పు చేశారన్నది స్పష్టం అయితేనేం సగటు వృద్ధిరేటు 6.7 శాతంగా ఉన్నది. మరి పది సంవత్సరాల కాలంలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన సగటు వృద్ధిరేటు 5.9 శాతంగా ఉన్నది. ఈ రెండు వృద్ధిరేట్ల మధ్య తేడాకు ప్రాధాన్యమున్నది పది సంవత్సరాల కాలంలో ఏడాదికి ఈ వ్యత్యాసం 1.6 శాతం (లేదా 0.8 శాతం) చొప్పున ఉంటే స్థూల దేశీయోత్పత్తి పరిమాణంలోను, తలసరి ఆదాయంలోను, వస్తు సేవల పరిమాణంలోను, ఎగుమతుల పరిమాణం/ విలువలోను, ఆర్థిక, రెవెన్యూ లోటుల్లోను, ఇంకా వివిధ అంశాలలోను వ్యత్యాసం గణనీయంగా ఉంటుంది. ఇలా రెండు ప్రభుత్వాల హయాంలలోనూ వివిధ అంశాలను పోల్చి చూస్తే ఆర్థిక వ్యవస్థను ఏ ప్రభుత్వం ఎలా నిర్వహించింది అన్న విషయమై వాస్తవాలు వెల్లడవుతాయి.

ఉదాహరణకు జాతీయ రుణం విషయాన్నే చూద్దాం. యూపీఏ ప్రభుత్వాల పాలన ఆఖరి సంవత్సరంలో ఇది రూ.58.6 లక్షల కోట్లు కాగా ఎన్డీఏ ప్రభుత్వ హయాం ఆఖరి సంవత్సరంలో అది రూ.173.3 లక్షల కోట్లుగా ఉన్నది! అలాగే స్థూల దేశీయోత్పత్తి– రుణ నిష్పత్తిని చూస్తే యూపీఏ ప్రభుత్వాల హయాం ఆఖరి సంవత్సరంలో అది 52 శాతంగా ఉండగా ఎన్డీఏ ప్రభుత్వ పదేళ్ల పాలన ఆఖరులో అది 58 శాతంగా ఉన్నది. స్థూల దేశీయోత్పత్తిలో కుటుంబ పొదుపు మొత్తాల శాతం యూపీఏ ప్రభుత్వాల హయాంలో 23 శాతం కాగా ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అది 19 శాతంగా మాత్రమే ఉంది. వ్యవసాయ వేతనాల పెరుగుదల యూపీఏ ప్రభుత్వాల హయాంలో 4.1 శాతం కాగా ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అది 1.3 శాతంగా ఉన్నది. యూపీఏ ప్రభుత్వాలు తమ పదేళ్ల పాలనలో రూ.2.2 లక్షల కోట్లు మాఫీ చేయగా ఎన్డీఏ ప్రభుత్వం రూ.14.56 లక్షల మాఫీ చేసింది. ఆరోగ్య భద్రతపై యూపీఏ ప్రభుత్వాలు తమ పదేళ్ల పాలనలో చేసిన ఖర్చు మొత్తం ప్రభుత్వ వ్యయాలలో 1.7శాతంగా ఉండగా ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అది కేవలం 1.7శాతంగా మాత్రమే ఉన్నది. విద్యారంగ వ్యయాలు కూడా ఇటువంటి తేడానే చూపిస్తున్నాయి. యూపీఏ ప్రభుత్వాలు తమ పదేళ్ల పాలనలో విద్యపై చేసిన ఖర్చు మొత్తం వ్యయాలలో 4.6శాతం మేరకు ఉండగా ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అది 2.9 శాతంగా మాత్రమే ఉన్నది.

ఇంకా చాలా విషయాలలో ఎన్డీఏ ప్రభుత్వ పనితీరు అధ్వాన్నంగా ఉన్నది. మొత్తం జాతీయ రుణం, కుటుంబ పొదుపుల మొత్తం, బ్యాంకు రుణాల మాఫీ, విద్యా వైద్యాలపై వ్యయాలు మొదలైన అంశాలు ఎన్డీఏ ప్రభుత్వ తప్పుడు విధానాలను, ఆర్థిక వ్యవస్థను సక్రమంగా, సమర్థంగా నిర్వహించకపోవడాన్ని ఎత్తి చూపుతున్నాయని నేను భావిస్తున్నాను. ఎన్డీఏ ప్రభుత్వ పదేళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వోద్యోగుల సంఖ్య తగ్గిపోవడం గమనార్హం. సరే, కొన్ని రంగాలలో ఎన్డీఏ ప్రభుత్వ పనితీరు మెరుగ్గా ఉందనే విషయాన్ని కొట్టివేయలేము. యూపీఏ ప్రభుత్వాలు సాధించిన సార్థక విజయాలు ఎన్నిటినో ప్రభుత్వ శ్వేతపత్రం సరిగ్గా ప్రస్తావించ లేదు. అయితే పెద్ద నోట్ల రద్దు, సూక్ష్మ, మధ్య చిన్న తరహా పరిశ్రమల విధ్వంసంతో సహా ఎన్డీఏ ప్రభుత్వ ఘోర వైఫల్యాలను కప్పి పుచ్చింది. ముఖ్యంగా జన్‌ధన్ బ్యాంక్ ఖాతాలు (గతంలో 'నో ఫ్రిల్స్ ఎకౌంట్'), ఆధార్ కార్డులు, మొబైల్ విప్లవం యూపీఏ ప్రభుత్వాల కృషి ఫలితమేనన్న వాస్తవాన్ని గుర్తించడంలో ప్రభుత్వ శ్వేతపత్రం విఫలమయింది.



> '2014 కు ముందు, తరువాత దేశ ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వ శ్వేతపత్రమూ, 'పది సంవత్సరాల అన్యాయకాలం' అంటూ నరేంద్ర మోదీ పాలనపై కాంగ్రెస్ విడుదల చేసిన 'బ్లాక్ పేపర్'.. రెండూ నిష్పాక్షిక ఆర్థిక సమీక్ష కంటే నిర్దిష్ట రాజకీయ లబ్ధి పొందడానికే ప్రాధాన్యమిచ్చాయి. ఈ రెండు ప్రతాలలోను లేవనెత్తిన అంశాలను గత పదేళ్లలో పార్లమెంటులో చర్చించి ఉండవలసింది. అయితే అలా జరగలేదు. చర్చకు ప్రభుత్వం అనుమతించకపోవడమే అందుకు కారణమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

యూపీఏ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను ముఖ్యంగా 2008–12 సంవత్సరాల మధ్య సమర్థంగా నిర్వహించలేదని ప్రభుత్వ శ్వేతపత్రం ఆరోపించింది. 2008 సెప్టెంబర్ మధ్య రోజుల్లో అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్లు కూలిపోయాయి. ఈ పరిణామంతో ఆర్థిక మాంద్యం ఒక సునామీలా విజృంభించింది. అది ప్రపంచ వ్యాప్తంగా ప్రతి దేశ ఆర్థిక వ్యవస్థకూ ఎనలేని నష్టాన్ని కలిగించింది. పెద్ద ఎత్తున రుణాలు తీసుకుని, సంపన్న దేశాలు అనుసరిస్తున్న 'క్వాంటిటేటివ్ ఈజింగ్' విధానం అమలులో భాగంగా ఆ రుణాలు ఖర్చుచేయడం జరిగింది. దీంతో ద్రవ్యోల్బణం భారీగా పెరిగిపోయింది. జనవరి 2009 నుంచి జూలై 2012 దాకా దేశ ఆర్థిక మంత్రిగా ప్రణబ్ ముఖర్జీ ఉన్నారు. ద్రవ్యోల్బణంతో పాటు ద్రవ్యలోటు కూడ బాగా పెరిగిపోయింది. అయితే ఆ సంక్షోభ కాలంలో ప్రణబ్ అమలుపరిచిన విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, ఉద్యోగాల సృష్టికి దోహదం జరిగింది. అయితే ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణం రూపేణా అందుకు మూల్యం చెల్లించవలసివచ్చింది. సరే, కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన 'బ్లాక్ పేపర్' ఏక పక్షంగా ఉన్నది. వ్యవసాయ రంగం దురవస్థ, పెరిగిన ద్రవ్యోల్బణం, పెచ్చరిల్లిన నిరుద్యోగిత, ఆశ్రిత పక్షపాతం మొదలైన వాటిని వివరంగా పేర్కొంది. అలాగే కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు దుర్వినియోగపరచడం, రాజ్యాంగ సంస్థలను బలహీనపరచడం, మన భూ భాగాలలోకి చైనా చొరబాటు, మణిపూర్ విషాదం మొదలైన ఘటనలు, పరిణామాలను ప్రత్యేకంగా పేర్కొంది. అది నిజంగా ఎన్డీఏ ప్రభుత్వ 'పది సంవత్సరాల అన్యాయ కాలం'పై బ్లాక్ పేపర్ అనడంలో సందేహం లేదు.

దేశ ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితి చాలా స్పష్టంగా ఉన్నప్పటికీ '2014కు ముందు, తరువాత దేశ ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వ శ్వేతపత్రమూ, దానికి ప్రతిస్పందనగా 'పది సంవత్సరాల అన్యాయకాలం' శీర్షికతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదేళ్ల పాలనపై కాంగ్రెస్ విడుదల చేసిన 'బ్లాక్ పేపర్' రెండూ నిష్పాక్షిక ఆర్థిక సమీక్ష కంటే నిర్దిష్ట రాజకీయ లబ్ధి పొందడానికే ప్రాధాన్యమిచ్చాయి. ఈ రెండు పత్రాలలోను లేవనెత్తిన అంశాలను గత పదేళ్లలో పార్లమెంటు ఉభయ సభలలో చర్చించి ఉండవలసింది. అయితే అలా జరగలేదు. ముఖ్యమైన అంశాలపై చర్చకు ప్రభుత్వం అనుమతించక పోవడమే అందుకు కారణమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టంలో ఆ అంశాలపై చర్చకు రంగాన్ని ఆ రెండు పత్రాలూ సిద్ధం చేశాయి. ఆ అంశాలపై చర్చ జరుగుతుందా, ధనం, మతం, విద్వేష ప్రసంగాలు, అధికార దుర్వినియోగం ఇత్యాది విషయాలు ఆ కీలక ఎన్నికల ఫలితాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తాయా అన్న ప్రశ్నకు కాలం మాత్రమే సమాధానం చెప్పగలదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి,

కులమే విదేశీ శక్తుల కుట్ర, కులగణన కాదు!

పాండవులు పదమూడేళ్ల అరణ్య అజ్ఞాతవాసాలు ముగించుకొని ఇంద్రప్రస్థానికి చేరుకున్న తర్వాత కౌరవుల దగ్గరికి రాయబారం పంపారు: 'మేమూ కురువంశ వారసులమే, మాకు దక్కాల్సిన న్యాయమైన వాటా మాకు ఇవ్వాల్సిందే' అనే డిమాండును కౌరవ సభలో పెట్టారు. సోదరులకు దక్కాల్సిన న్యాయమైన వాటాను ఇవ్వడానికి మనసొప్పని కౌరవులు నానా రకాల సాకులు చెప్పి తిరస్కరించి యుద్ధానికి, వినాశనానికి కారకులయ్యారు. 'కులగణన విదేశీ శక్తుల ఎజెండా' శీర్షికన డా. కె.అరవింద రావు రాసిన వ్యాసం (ఫిబ్రవరి 4, 2023) చదివితే దేశంలోని మెజార్టీ వర్గ ప్రజలకు ఆ పురాణాల పాత ముచ్చట యాదికొస్తున్నది. నాటి పాండవులు ఐదుగురు, కౌరవులు వందమంది. కానీ నేడు 'కులగణన చేసి సామాజిక సంపదలో మా న్యాయమైన వాటా తేల్చండి' అని అడుగుతున్న వారు జనాభాలో 90 శాతం కాగా, ఆ న్యాయమైన కోర్కెలను తిరస్కరించి అన్యాయాన్ని కొనసాగించదలుచుకున్నవారు పదిశాతపు మైనారిటీయే! ఇదీ నేటి విషాదం.

'దేశంలో అద్వానీ రథయాత్ర సమయంలో ఒక సాంస్కృతిక జాగరణ జరిగే సమయంలో వి.పి. సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను అమలు చేసింది' అని అరవిందరావు రాసారు. ఆగష్టు 7, 1990న వి.పి. సింగ్ మండల్ కమిషన్ నివేదిక అమలు నిర్ణయాన్ని పార్లమెంటులో ప్రకటించి, ఓబీసీ అభ్యర్థులకు 27శాతం రిజర్వేషన్లను తీసుకొచ్చాడు. మరో యాభై రోజులు గడిచాక సెప్టెంబరు 25, 1990న గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి అద్వానీ రథయాత్ర ప్రారంభించాడు. ఈ క్రోనాలజీ తేల్చి చెబుతున్నది ఏమిటంటే– అద్వానీ రథయాత్ర తీసుకురాదలచిన సాంస్కృతిక జాగరణను ఓబీసీ రిజర్వేషన్లు అడ్డుకోలేదు; ఓబీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడానికే నాటి అగ్రవర్ణాల ప్రోద్బలంతో అద్వానీ రథయాత్ర మొదలుపెట్టారు!

హిందూ మతం కులాన్ని నిర్మించిందన్న ప్రచారం బ్రిటిష్‌వాడు సృష్టించినదంటూ మరో అబద్ధమాడారు వ్యాస రచయిత. 12వ శతాబ్దికి చెందిన పల్నాటి బ్రహ్మనాయుడు వెలమ కులానికి చెందినవాడని, మాల కులానికి చెందిన కన్నమదాసును దత్తత తీసుకున్నాడని, సమాజంలో నెలకొన్న కుల విభేదాలను నిర్మూలించడానికి చాపకూడు నిర్వహించాడని చరిత్రలో నమోదు అయివున్నది. 16వ శతాబ్దికి చెందిన పోతులూరి వీరబ్రహ్మం, వేమనలు కులం పేరిట నాటి సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టారు. మరి ఈ చరిత్ర అంతా బ్రిటిష్‌వాడి రాక పూర్వమే కదా!?



సామాజిక వివక్ష కారణంగా సమ అభివృద్ధికి నోచుకోని వర్గాలకు సామాజిక న్యాయం అందించడానికి తోడ్పడడంతో పాటు ఆయా వర్గాల ప్రజల మధ్య అనవసర గొడవలను నివారించి దేశ ఐక్యతకు సహకరిస్తుంది కులగణన.

హిందూ మత గ్రంథాల్లో నాలుగు వర్ణాల గురించే ఉన్నదని కులాల సృష్టి బ్రాహ్మణులు చేయలేదని అంబేడ్కర్ కూడా అన్నాడని వ్యాసకర్త రాసారు. వర్ణ వ్యవస్థ పాదులోంచే కుల వ్యవస్థ రూపుదాల్చుకున్నదని మన సమాజ పరిణామ క్రమం స్పష్టీకరిస్తున్నది. దేవుడి పేరుతో, మతం పేరుతో సమాజంపై సంపూర్ణ ఆధిపత్యం సంపాదించిన బ్రాహ్మణ వర్ణాల నిర్దేశకత్వంలోనే వర్ణ వ్యవస్థ రూపుదిద్దుకున్నది. వర్ణ వ్యవస్థలో బాధిత సమూహమైన శూద్ర వర్ణంలోని ప్రజల్ని మరింత చీల్చడం కోసం, పైనున్న వర్ణాల దోపిడీ నిరాటంకంగా కొనసాగించడం కోసమే నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ ఏర్పడింది. వర్ణ వ్యవస్థయినా, కుల వ్యవస్థయినా రెంటిలో సారం ఒకటే. 'ఏకమేవతు శూద్రస్య ప్రభుః కర్మసమాదిశత్ ఏతేషామేవ వర్ణానాం శుశ్రూషా మనసూయయా' (మనుస్మృతి 1–91) – 'అసూయ లేకుండా బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ వర్ణాల వారికి సేవ చేయడమే శూద్రుల, శూద్రకులాల వారి విధి అని బ్రహ్మ ఆదేశించా'డన్న ఈ నియమమే అటు వర్ణ వ్యవస్థలోనూ ఇటు కుల వ్యవస్థలోనూ అమలయింది. సాటి సోదరుడిని బానిసగా మార్చిన ఆ పాప కార్యానికి మూలం వేరేచోట ఉండవచ్చునంటూ బుకాయిస్తే సరిపోతుందా?

సామాన్య శక పూర్వం 1700 ప్రాంతంలో మధ్య ఆసియా ప్రాంతం నుండి ఆర్యులు భారతదేశానికి వలస వచ్చి స్థానిక తెగలపై ఆధిపత్యం సాధించి చాతుర్వర్ణ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఆ వర్ణ విభజనలో ఉన్నత స్థానాన్ని తమకు అట్టిపెట్టుకొని, నిమ్న స్థాయిని మూలవాసులకు ఆపాదించారు. వర్ణవ్యవస్థలోని బాధితుల మధ్యన మరిన్ని విభజనలు తెస్తూ కుల వ్యవస్థను మొదలుపెట్టారు. ఈ వర్ణ–కుల వ్యవస్థ విదేశీ ఆర్యుల సృష్టి తప్ప మరొకటి కానేకాదన్నది చరిత్ర నిరూపించిన సత్యం. ఆ కుల వ్యవస్థ రుద్దిన అన్యాయాల పరిధిని తేల్చడం కోసమే, చేయాల్సిన చికిత్సను నిర్ధారించడం కోసమే బాధిత సమూహాలు నేడు కులగణన కోరుతున్నాయి. కులమే విదేశీ శక్తుల కుట్ర తప్ప, కులగణన కాదు! కులగణన నేడు ఒక దేశభక్తియుత కర్తవ్యం! సామాజిక వివక్ష కారణంగా సమ అభివృద్ధికి నోచుకోని వర్గాలకు సామాజిక న్యాయం అందించడానికి తోడ్పడడంతో పాటు ఆయా వర్గాల ప్రజల మధ్య అనవసర గొడవలను నివారించి దేశ ఐక్యతకు సహకరిస్తుంది కులగణన. సాటి సోదరులను మోసగించి ఇప్పటివరకు అన్యాయంగా దండుకు తింటున్న వారే లెక్కలు తీయడాన్ని అడ్డుకుంటున్నారు.

• ఆర్. రాజేశమ్
సామాజిక న్యాయ వేదిక కన్వీనర్

గద్దర్ పేరిట రాజకీయాలొద్దు!

గత ప్రభుత్వం గద్దర్‌ను అవమానాలకు గురి చేస్తే, నేటి ప్రభుత్వం నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా మార్చి ఇస్తానంటోంది. ఇది అనాలోచితంగా, భావోద్వేగంతో చేసిన ప్రకటన అనిపిస్తుంది. గద్దర్ మీద వ్యక్తిగతంగా అభిమానం లేని, గద్దర్ పాట వినని తెలుగువాడు బహుశా ఉండకపోవచ్చు. కానీ గద్దర్ సిద్ధాంతాలు, ఆయన అనుసరించిన ఉద్యమ బాట, విప్లవ నేపథ్యం అందరికీ నచ్చకపోవచ్చు. ఒకప్పుడు రాజ్యం మీద యుద్ధం ప్రకటించిన, ప్రజాస్వామ్యం అంటే నమ్మకం లేని వ్యక్తి ఆయన. పౌర సమాజానికి సేవలందించిన పోలీసు బలగాలను మందు పాతరలు పెట్టి చంపిన నక్సలైట్లకు, తర్వాత మావోయిస్టులకి సిద్ధాంతకర్త. ఆ తరహా ఉద్యమాలకు తన ఆటతో పాటతో ఊపిరిలూది సాహిత్యాన్ని అందించిన వ్యక్తి. నక్సలైట్ ఉద్యమాన్ని ప్రభావితం చేసిన గద్దర్ ఏనాడు ప్రభుత్వ సహాయ సహకారాలను కోరలేదు.

ఆయన నిరాడంబరంగా సాధారణ పౌరుడిలా తుదికంటా జీవించిన వ్యక్తి. సిద్ధాంతం ఏదైనా నిజాయితీగా నికార్సయిన వ్యక్తిత్వంతో బతికాడు. ఉద్యమం నుంచి బయటకు వచ్చిన తర్వాత దేవాలయాలు సందర్శించినా, సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్నా తన ధిక్కార స్వరాన్ని ఏనాడూ వదులుకోలేదు. ఆ తర్వాత చివరి అంకంలో కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితుడై రేవంత్ పాదయాత్రలో కూడా ప్రధాన పాత్ర పోషించాడు. బహుశా అందుకే ఆయనకు ఏదన్నా చేయాలన్న ఆతృత ఆ పార్టీ నేతలకు ఉంటే ఉండొచ్చు. కానీ గద్దర్ జీవితంలో ఉన్న వివిధ కోణాల్లో దేన్ని ప్రేరణగా, స్ఫూర్తిగా తీసుకొని ఈ అవార్డు ఇస్తున్నారో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

కళలకు చిహ్నంగా నంది మన సంస్కృతిలో భాగం కనుక కళాకారులకు నంది అవార్డులు ఇచ్చి గౌరవిస్తున్నామంటే అది వివాదాలకు ఆస్కారం లేనివిధంగా నడిచిపోయింది. వ్యక్తుల పేరుతో అవార్డు ఇస్తే రేపు ఇంకో గొప్ప వ్యక్తి వస్తే పేరు మార్చాల్సి రావచ్చు కదా? ప్రభుత్వం మారితే, ఆ వ్యక్తి నచ్చకుంటే, ఆ అవార్డును తిరిగి రద్దుచేసి తమకు నచ్చిన వ్యక్తి పేరు పెట్టొచ్చు కదా? ఇప్పుడు ప్రభుత్వాలు మారినప్పుడల్లా పేర్లు మార్చడం సర్వసాధారణమైంది. రేపు ఇంకో ప్రభుత్వానికి ఇంకో వ్యక్తి నచ్చితే గద్దర్ పేరు మార్చుకోవచ్చా? ఈ రోజు సీఎం రేవంత్ ప్రేమకొద్దీ తన 'మాటే శాసనం' అంటూ ప్రకటించిన గద్దర్ అవార్డును రేపు వచ్చే కొత్త ప్రభుత్వాలు తీసేయవన్న గ్యారెంటీ ఉందా?



నక్సలైట్ సిద్ధాంతాన్ని వ్యతిరేకించే పౌర సంఘాలకు, పార్టీలకు, వ్యక్తులకు కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు ఎన్నో ఉన్నాయి. ఆనాటి గద్దర్‌ను ఆదర్శంగా తీసుకోవాలా? మారిన గద్దర్‌ను ఆదర్శంగా తీసుకోవాలా? కాంగ్రెస్ పార్టీ ప్రచారకర్తగా ఉన్న గద్దర్‌ను ఆదర్శంగా తీసుకోవాలా? అదీగాక, ఆయనకు సినిమాలపై అంతగా ఆసక్తి లేదు. రెండో మూడో సినిమాల్లో పాటలు పాడి ఉండొచ్చు, విప్లవ నాయకుడిగా కనిపించిన సందర్భాలు ఉండొచ్చు. అంతకుమించి ఆయనకు సినిమాలతో పెద్దగా సంబంధం లేదు. అయాచితంగా ఈ అవార్డును ప్రకటించడం పట్ల సినిమా వాళ్లు గమ్మున ఊరుకున్నారనుకోవడం పొరపాటే. వారికి గొంతెత్తి అరవాలని ఉన్నా ప్రభుత్వంతో ఎందుకు గొడవ అనుకుంటూ ధైర్యం చేయడం లేదు.

రేవంత్ రెడ్డి కావాలనే ఎన్నికలకు ముందు ఈ అవార్డు ప్రకటించి జాతీయవాద, సారూప్యత కలిగిన సంస్థలను ఈ అవార్డు పేరిట రెచ్చగొట్టి లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నట్లు అనిపిస్తుంది. ఎందుకంటే బీజేపీకి ఇప్పటికే తెలంగాణలో మెజార్టీ ఎంపీ స్థానాలు దక్కే అవకాశం ఉంది. జాతీయ భావజాలం కలిగిన సంస్థలకు, సామాజిక ఉద్యమకారులకు, తెలంగాణలో ప్రముఖ కళాకారుడు అయిన గద్దర్‌ను అభిమానించే వ్యక్తులకు, సంస్థలకు మధ్య వైరంతో కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆడుతున్న కొత్త నాటకంగా దీన్ని చూడవచ్చు. గద్దర్ పేరిట ఈ అవార్డును ఇవ్వొద్దంటున్నామంటే అది ఆయన్ను గౌరవించకపోవడం కాదు. ఆయన కీర్తి ప్రతిష్ఠలు తెలుగునేలపై చిరస్థాయిగా ఉంటాయి. కానీ గద్దర్ పేరుతో రాజకీయాలు చేసి పబ్బంగడుపుకోవాలనుకోవడం ఆయన స్ఫూర్తిని అవమానించడమే అవుతుంది. ఏ అవార్డులూ ఆయనకున్న పేరును పెంచలేవు. ఆయనలోని ధిక్కారాన్ని, విప్లవస్ఫూర్తిని, ఔన్నత్యాన్ని ఆయన పాటలే కాపాడుకుంటాయి. దానికి ఏ రాజ్యం గుర్తింపూ అవసరం లేదు.

○ డా. దొంతగాని వీరబాబు

గొంతులేని జనం గొంతు 'నల్లెల రాజయ్య'



వరంగల్ రచయితల సంఘం అధ్యక్షుడు నల్లెల రాజయ్య అకాల మరణం ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే వ్యక్తులకు, శక్తులకు తీరని లోటు. అభ్యుదయ కామునిగా, పర్యావరణ రక్షకునిగా, ప్రకృతి ప్రేమికునిగా, కవిగా, రచయితగా, గొంతులేని జనం గొంతుకగా నల్లెల రాజయ్య తన జీవితాన్ని సాగించారు. భిన్నమైన వ్యక్తిత్వంతో, సాహసోపేతమైన కార్యాచరణతో, స్పందనకు ప్రతిరూపంగా ముందుకు సాగారు. ఇటీవల వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నేను రాసిన 'మరణ సందేశం' పుస్తకావిష్కరణ సభలో నల్లెల రాజయ్య పాల్గొని జీవితం–మరణానంతర జీవితంపై ప్రసంగించారు. పర్యావరణ, ప్రకృతి విధ్వంసాన్ని ఖండిస్తూ యాక్టివిస్టుగా ముందుకు సాగే రాజన్న వివిధ అంశాలపై నాతో చర్చించేవారు. పద్మాక్షమ్మ గుండం రక్షణ కోసం తపించిన రాజన్న పార్థివదేహానికి అదే చోట నివాళి అర్పించాల్సి రావడం విచిత్రం.

రాజకీయాల విషయంలో నువ్వు వెనుకంజ వేశావంటే, మూర్ఖుల ఏలుబడిలో బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వస్తుంది జాగ్రత్త! అంటాడు ప్లేటో. అలాంటి బిక్కుబిక్కుమనే స్థితికి దూరంగా తమ జీవిత ప్రయాణాన్ని సాగించారు రాజన్న. న్యాయం వైపు నిలిచే దాంట్లో, స్పందించే దాంట్లో నల్లెల రాజన్న ముందు వరుసలో ఉంటారు. భావప్రకటనా స్వేచ్ఛకు వేదిక కానప్పుడు ఇది ప్రెస్ క్లబ్ ఎలా అవుతుందంటూ ప్రెస్ క్లబ్‌కు పోస్టర్ వేసి నిరసన తెలిపిన వ్యక్తి. ఒక్కడున్నా సరే నిరసన తెలుపడానికి వెనుకాడని వ్యక్తి. నల్లెల రాజన్నను ఇతరులకు భిన్నంగా తీర్చిదిద్దిన అంశాలు ఏమిటి? ప్రజల మనసులకు అంత దగ్గర చేసిన అయస్కాంతత్వ శక్తి ఎక్కడి నుంచి వచ్చింది.? నిర్భీతి. నమ్ముకున్న సిద్ధాంతం పట్ల విశ్వాసం, మడమతిప్పని తెగింపు, అణచివేతలను లెక్కచేయని గుండెధైర్యం, బలమైన ఆలోచనా విధానం, ఓర్పు, సడలని పట్టుదల... ఈ సుగుణాలతోనే రాజయ్య ప్రస్థానం సాగింది. భారతదేశంలో ప్రజాస్వామ్యం ఒక క్రమపద్ధతిలో విధ్వంసమైపోతోందని ఆవేదన చెందుతూ, ప్రజాస్వామ్య రక్షణకు తపించే వారికి, కవులకు, రచయితలకు, అభ్యుదయవాదులకు, ప్రశ్నించే గొంతుకలకు, పర్యావరణ పరిరక్షకులకు రాజయ్య మరణం తీరని లోటు. నా పుస్తకావిష్కరణలో ఆయన మాట్లాడినట్లుగానే పుట్టుక మరణం మధ్యలో మనిషి ఏం చేశాడు, ఎలాంటి జీవితం కొనసాగించాడు అనే దాన్ని బట్టే మరణానంతర జీవితం ఉంటుందనేదానికి సాక్ష్యం నల్లెల రాజన్న. తన జీవిత ప్రయాణంలో తనకంటూ ఒక పేజీని లిఖించుకున్నాడు. ఆయన అకాల మరణం గొంతులేని జనానికి తీరని లోటు.

– రాజేందర్ దామెర, జర్నలిస్టు

కుల, మత రహిత గుర్తింపు ఇవ్వండి

ముఖ్యమంత్రి గారికి బహిరంగ విన్నపం..

మాది కులాంతర, మతాంతర ప్రేమ వివాహం.. కులి కుతుబ్, భాగమతిల ప్రేమ చిహ్నంగా ఏర్పడిందని చెప్పుకునే హైదరాబాద్‌లోనే మా ఉద్యోగం, ప్రేమ, పెళ్లి, పిల్లల చదువులు, జీవితం కొనసాగుతున్నాయి. మా పిల్లలకు ఎటువంటి కుల మత నేపథ్యాలు ఇవ్వకుండా పెంచాలని మేము భావించాం. అయితే మనకు పుట్టక నుంచి చనిపోయే దాకా వివిధ సందర్భాలలో కుల, మతాల ప్రస్తావన అవసరం ఉంటోంది. సామాజిక నేపథ్యాలు అనుసరించి అణగారిన వర్గాల ప్రజలకు చదువు, ఉద్యోగాలలో కొద్దిపాటి అవకాశాలు కల్పించడం, చట్టసభలలో కొన్ని సీట్లు కేటాయించడం మనకు తెలిసినదే. ఆ క్రమంలో వివిధ అస్తిత్వ సమూహాలను గుర్తిస్తున్నారు. ఇది చాలా మంచి విషయం. అయితే కుల, మతాల వెలుపల, ఆ పరిధి దాటిన అస్తిత్వాలను అంటే కుల, మత రహిత అస్తిత్వాలను అలా అవసరమయిన వారికి గుర్తించ నిరాకరిస్తున్నారు.

ఈ సమస్యను మేము మా చిన్నమ్మాయి సహజను ఎల్‌కేజీలో చేర్చేటప్పటి నుంచీ అంటే 2009 నవంబర్/ డిసెంబర్ నుంచి ఎదుర్కొంటున్నాం. ఆ క్రమంలో అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో వివిధ స్థాయిలలో అధికారులకు అర్జీలు పెట్టుకున్నా సాధ్యం కాకపోవడంతో న్యాయవాది డి.సురేష్‌కుమార్ సహకారంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసాం. జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి గారు మా పిటిషన్‌పై స్పందిస్తూ "మతం నమ్మడానికి, ఆచరించడానికి హక్కు ఉందంటే, ఏ మతమూ ఆచరించకుండా ఉండడానికి కూడా హక్కు ఉన్నట్లే"నని, పిటిషనర్‌ను మతం రాయమని ఒత్తిడి చేయొద్దని 2010 ఏప్రిల్‌లో మా చిన్నమ్మాయి విషయంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఆ సందర్భంలోను ఈ పదిహేనేళ్లలోనూ అనేకమంది మత రహిత, కుల రహిత అస్తిత్వ ప్రకటన తమకు కూడా అవసరమనీ, ఎలా, ఎవరిని సంప్రదించాలనీ అడిగారు.. అడుగుతూనే ఉన్నారు. అలా మమ్మల్ని సంప్రదించిన వారిలో అత్యధికులు దళిత, బహుజన, మైనారిటీ నేపథ్యాలు ఉన్న మిత్రులు.



సమస్య అక్కడితో అయిపోలేదు. మా పెద్దమ్మాయి స్పందన ఇంటర్మీడియెట్ ఆన్‌లైన్ దరఖాస్తులో ఏదో ఒక మతం ఎంపిక చేసుకొనిదే పరీక్షల ఫీజు కట్టడానికి అవకాశం లేదు. అందువల్ల మళ్ళీ మళ్ళీ ఎదురవుతున్న మా సమస్యను, మాలాంటి వారి అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని న్యాయవాది సురేష్‌కుమార్ సహకారంతో 2017లో తెలంగాణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేసాం. ఈ ఏడేళ్లలో ఆయా సందర్భాలలో సంబంధిత ప్రభుత్వ శాఖలను స్పందించవలసిందిగా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఏడేళ్లు అయిపోయినందున ఇటీవల మా న్యాయవాది మా వ్యాజ్యంపై తీర్పు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. మా వ్యాజ్యం ఫిబ్రవరి 5, 2024న తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచ్‌కు వచ్చింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ఆలోక్ అరాధే, న్యాయమూర్తి జూకంటి అనిల్‌కుమార్‌లకు న్యాయవాది వివరించారు. రానున్న దేశ జనాభా లెక్కలు, రాష్ట్రంలో కుల గణన, విద్యా సంవత్సర ప్రారంభం, జనన, మరణాల నమోదు ఇలా అనేక అంశాలలో కుల రహిత, మత రహిత అస్తిత్వ ప్రకటనకూ అవకాశం కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన న్యాయమూర్తులు దీనిపై ప్రభుత్వ వైఖరిని మూడు వారాల్లో తెలియజేయాలని కోరుతూ ఆదేశాలు జారీ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ఈ అంశంపై సానుకూలంగా స్పందించమని కోరుతూ మా విజ్ఞప్తిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మెయిల్ చేశాం. విజ్ఞప్తితో పాటు మా కరపత్రాన్నీ, మా "నో రెలిజియన్, నో కేస్ట్ చేంజ్ డాట్ ఆర్గ్ ఆన్‌లైన్ పిటిషన్"లో మాకు మద్దతుగా చేసిన 55,746 సంతకాల జాబితాను కూడా మెయిల్ చేశాం.

మా మిత్రులు డేవిడ్, రూపా దంపతులు కూడా వారి బాబు ఇవాన్ రూడే విషయంలో మత రహిత, కుల రహిత అస్తిత్వంతో బర్త్ సర్టిఫికెట్ కోరగా, మునిసిపాలిటీ అధికారులు అలా సాధ్యం కాదని చెప్పారు. అప్పుడు వారు 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత ఏడాది అంటే 2023 జూలైలో జస్టిస్ కన్నెగంటి లలితకుమారి గారు ఒక చారిత్రాత్మక తీర్పు ఇచ్చి మత రహిత, కుల రహిత అస్తిత్వ ప్రకటనకూ అవకాశం ఉండాలని, వారు కోరినట్లు బర్త్ సర్టిఫికెట్ ఇమ్మని ప్రభుత్వాన్ని ఆదేశించి కూడా ఆరు నెలలు గడిచిపోయినా ఆ ఆదేశాలు ఇంకా అమలుకాలేదు. 2019లో తమిళనాడు తిరుపత్తూర్‌కు చెందిన న్యాయవాది ఎం.ఎ.స్నేహ (స్నేహ పార్థిబరాజా) వ్యక్తిగత స్థాయిలో తొమ్మిదేళ్లు పోరాటం చేసి మత రహిత, కుల రహిత సర్టిఫికెట్ పొందినా అమలులో ఎక్కడి పరిస్థితి అక్కడే ఉంది. ఈ వెలుగులో మన రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాం.

ఆన్‌లైన్‌లో అయినా, ఆఫ్‌లైన్‌లో అయినా కుల, మత అస్తిత్వ ప్రకటనకూ అవకాశం ఉండాలి. ఇది మన సామాజిక ఉద్యమకారుల స్వప్నం. డా. బి.ఆర్.అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబాపూలే, పెరియార్ సహా అనేకమంది... సామాజిక అంతరాలు తొలగిపోయి, సమభావం, సోదరత్వం వెల్లివిరియాలని కోరుకున్నారు. మన దేశంలో కులాంతర వివాహాలు అటువంటి మార్పునకు ఒక మార్గమని అంబేడ్కర్ విశ్వసించారు. మేము కూడా అలాంటి అనేకానేక ప్రయత్నాలలో భాగంగా ఇటువంటి అస్తిత్వ ప్రకటనకు అవకాశం కలిగించడం కూడా ఒక అంశమని భావిస్తున్నాం. అనేక పథకాల విషయంలో స్వచ్ఛందంగా వదులుకునే అవకాశం ఇచ్చినట్లే ఈ అంశానికీ అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నాం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ దిశగా మీరు సానుకూల నిర్ణయం చేస్తారని, సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేస్తారని ఆశిస్తున్నాం. మన దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వంటి అనేకమంది రాజకీయవేత్తలు, ప్రజాస్వామిక మేధావులు, ప్రగతిశీల ప్రత్యామ్నాయ ఆలోచనాపరులు ఇటువంటి భావనలు మనకు ఇచ్చి వెళ్లారు. అనేకమంది ప్రజలు తమ జీవిత ఆచరణ ద్వారా ఎన్నో మానవీయ విలువలను మనకు అందించారు. ఇవాళ మునుపెన్నటికన్నా కుల మతాల పరిధులు దాటి మానవత్వ పతాకను మరింత సమున్నతంగా ఎత్తిపట్టాల్సిన ఒక సున్నిత సందర్భంలో మనమంతా ఉన్నామన్న విషయాన్ని మీ దృష్టికి తెస్తూ.. ఇటువంటి ప్రజాస్వామిక ఆకాంక్షకూ అవకాశం కలిగించమని మిమ్మల్ని కోరుతున్నాం.

■ డి.వి రామక్రిష్ణారావు
■ ఎస్. క్లారన్స్ కృపాళిని

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com



ధర్నాచౌక్‌లో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ధర్నా

కదిలిన కార్మిక శక్తి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మెకు మద్దతు పలికాయి. కార్యాలయాల వద్ద ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్-మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక, రైతు, ప్రజాస్వామ్య హక్కుల సాధన కోసం ఉద్యమించాయి. బీఎస్ఎన్ఎల్ సంస్థ మనుగడ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ లక్ష్యంగా నగరంలోని బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ఉద్యోగులు శుక్రవారం నిరసన తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పాల్గొన్న యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. సుశీల్‌కుమార్, ఐఏడబ్ల్యుడబ్ల్యుసీసీ సభ్యురాలు పద్మావతి మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆపరేటర్స్‌కు 5జీ ఇచ్చిన ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌కు ఇప్పటికీ 4జీ ఇవ్వలేదని, సంస్థను నిర్వీర్యం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

త్వరలో ఆండ్రాయిడ్ స్పాట్ బిల్లింగ్



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌బిల్లుల రీడింగ్‌లో సరికొత్త టెక్నాలజీ వినియోగానికి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) సిద్ధం అవుతోంది. త్వరలో ఆండ్రాయిడ్ స్పాట్‌బిల్లింగ్ మెషీన్లను అందుబాటులోకి తేనుంది. ప్రతి నెలా 6వ తేదీలోపు బిల్లుల జారీ వంద శాతం పూర్తిచేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం స్పాట్ బిల్లింగ్ మెషీన్లతో బిల్లులు జారీ చేస్తుండగా వాటిని మరింత అప్‌డేట్ చేసి ఆండ్రాయిడ్ మెషీన్లను తేనున్నారు. ఈ మెషిన్లలో రెండు సిమ్‌కార్డులతో పాటు మెమరీ కార్డు ఉంటుంది. దీంతో సాధారణ స్పాట్ బిల్లింగ్ మెషీన్ కంటే రెట్టింపు స్పీడ్‌తో బిల్లుల జారీకి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం బిల్లుల జారీ ప్రక్రియను ప్రతినెలా 2వ తేదీన ప్రారంభించి 14వ తేదీ వరకు రీడర్లు పూర్తి చేస్తున్నారు. ఆండ్రాయిడ్ మెషీన్లు వస్తే ఆరో తేదీకే ఈ ప్రక్రియ పూర్తవుతుంది.



ఆలయం.. దేదీప్యమానం..

జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి రథోత్సవం శుక్రవారం కన్నులపండువగా నిర్వహించారు. విద్యుత్ దీపాలు, బాణసంచా వెలుగుల్లో ఆలయం ధగధగలాడింది. 8

- తొలివిడతలో 87 ప్రాంతాల గుర్తింపు
- ఫ్రీ లెఫ్ట్, పాదచారుల బాటలు, వంతెనలు, అండర్‌పాస్‌లు, గ్రేడ్ సెపరేటర్లు కూడా..
- ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెట్టేలా పనులు
- సీఎం ఆదేశాలతో రంగంలోకి అధికారులు

ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్లు!

ఆ దిశగా అభివృద్ధికి అడుగులు



పనులకు నోచుకున్న జంక్షన్లు
(బ్రాకెట్లో అంచనా వ్యయం రూ.కోట్లలో)..

పురోగతిలో ఉన్నవి..
- హబ్సిగూడ (2.02) ● కొత్తపేట (3.05)
- ఐఎస్‌సదన్ (3.20) ● ఆరాంఘర్ ఎక్స్‌రోడ్ (2.63) ● పంజాగుట్ట (1.98)
- ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ (2.00)
- గుల్మోహర్ జంక్షన్ (5.00) ● నారాయణగూడ (1.99) ● సంగీత్ (1.98)

పూర్తయినవి..
- సోమాజిగూడ (2.00)
- మియాపూర్ ఎక్స్ రోడ్ (2.00)
- కృష్ణకుంజ్ (1.30)
- ఐడీపీఎల్ (2.00)

మహానగరంలో జామ్‌జాటం లేని ప్రయాణం దిశగా అడుగులు పడుతున్నాయి. ఈమేరకు చౌరస్తాలను అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో గుర్తించిన 87 ప్రాంతాల్లో తొలుత పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఏం చేయాలనేది గుర్తించేందుకు అధ్యయన బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించనున్నారు. త్వరలో టెండర్ నోటిఫికేషన్ ప్రకటించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో జీహెచ్ఎంసీ, పోలీస్ విభాగాలు దీనిపై దృష్టి సారించాయి.

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మహానగర అభివృద్ధి, మెరుగైన సదుపాయాల కల్పనను ఔటర్ వరకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీహెచ్ఎంసీతో పాటు, ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, మురుగు, వరద నీటి ప్రవాహ వ్యవస్థ మెరుగుదలతోపాటు.. ట్రాఫిక్ చిక్కులు లేని ప్రయాణానికి బాటలు వేయాలని భావిస్తోంది. ఈమేరకు సిగ్నల్ ఫ్రీ రాకపోకల కోసం ఏం చేయాలి, ఎన్ని ఆస్తులు సేకరించాలనే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించింది.

సీఎం ఆదేశాలతో..

నగరంలో జనాభాతో పోటీగా వాహనాల సంఖ్య పెరుగుతోంది. ట్రాఫిక్ కష్టాలూ అధికమవుతున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులు అధికమయ్యాయన్న ఫిర్యాదులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వచ్చినట్టు తెలిసింది. సచివాలయం, ఇతర కార్యక్రమాలకు వెళ్తోన్న సందర్భంలో తానూ స్వయంగా ట్రాఫిక్‌జామ్‌లు చూస్తున్నానని, మెరుగైన పరిష్కారం చూపేలా సమగ్ర చర్యలు తీసుకోవాలని సమావేశంలో సీఎం పేర్కొన్నట్టు ఓ అధికారి తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే ఓ దఫా జీహెచ్ఎంసీ, పోలీస్ విభాగాలతో రేవంత్‌రెడ్డి సమీక్షించారు. అనంతరం జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, ఇతర ప్రాంతాల్లోని చౌరస్తాలను ఉన్నతాధికారులు పరిశీలించారు. 30ఏళ్ల వరకు పెరగనున్న ట్రాఫిక్‌ను అంచనా వేసి.. తదనుగుణంగా జంక్షన్ల విస్తరణ/అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నారు.

గతంలో 13 జంక్షన్లలో..

గ్రేటర్‌లోని 13 జంక్షన్ల అభివృద్ధి పనులను రెండేళ్ల క్రితం జీహెచ్ఎంసీ చేపట్టింది. రూ.31.17 కోట్లతో ఎంపిక చేసిన చౌరస్తాల్లో వాహనాల రాకపోకలకు అనుగుణంగా లేన్‌లు, ఫుట్‌పాత్‌లు, పాదచారులు, సైకిల్ క్రాసింగ్స్, లైటింగ్, వరద నీటి డ్రైన్‌లు, సిగ్నళ్లు, పబ్లిక్ స్పేస్ డిజైన్ వంటివి చేపట్టారు. సోమాజిగూడ, మియాపూర్ ఎక్స్‌రోడ్, కృష్ణకుంజ్, ఐడీపీఎల్ జంక్షన్ల పనులు పూర్తి కాగా, ఇతర ప్రాంతాల్లో వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పనుల్లో భాగంగా వాహనాల రాకపోకలకు అనుగుణంగా ఫ్రీ లెఫ్ట్‌లు, పాదచారులు సురక్షితంగా నడిచేలా పనులను ప్రతిపాదించారు. ఇక ముందు చేపట్టే ప్రణాళికల్లో అండర్‌పాస్‌లు, వంతెనలు, గ్రేడ్ సెపరేటర్లు ఉండనున్నాయి. గతంతో పోలిస్తే ఇది భారీ ప్రాజెక్టు అని ఇంజనీరింగ్ విభాగం వర్గాలు చెబుతున్నాయి.

కొత్తగా అభివృద్ధి పనులు చేపట్టే జంక్షన్లు
(పోలీస్ కమిషనరేట్ల వారీగా)

హైదరాబాద్

సీటీఓ, పరేడ్ గ్రౌండ్, సికింద్రాబాద్ ● రసూల్‌పురా ● మెహిదీపట్నం ● నానల్‌నగర్ ● హబ్సిగూడ ● చాదర్‌ఘాట్ (బహెతి స్టీల్) ● మదీనా ● కర్బలా మైదాన్ ● రెహ్మత్‌నగర్, పీజేఆర్ విగ్రహం ● జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ -36 ● ఆర్టీసీ క్రాస్‌రోడ్ ● లిబర్టీ వద్ద ఫ్రీ లెఫ్ట్ ● బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1, 12 ● మల్లేపల్లి నోబుల్ టాకీస్ ● టప్పాచబుత్ర ● రేతిబౌలి ● పురానాపూల్ ● ఎంజే బ్రిడ్జి, భూలక్ష్మి ఆలయం ● చాదర్‌ఘాట్ రోటరీ ● నల్గొండ ఎక్స్‌రోడ్ ● బహదూర్‌పురా ఎక్స్‌రోడ్ ● మిధానీ ● తిరుమలగిరి ఎక్స్‌రోడ్ ● యూసుఫ్‌గూడ బస్తీ, కృష్ణాకాంత్ పార్క్

మిగతా 6వ పేజీలో..

అక్కడ ఆరులైన్ల రోడ్డు
- మియాపూర్ నుంచి గండిమైసమ్మకు.. 8
- ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో విస్తరణ

ట్యాంకర్ల కోసం రోజూ 1500 బుకింగ్‌లు

- వేసవికి ముందే పెరిగిన డిమాండ్ ● పెండింగ్‌లో రోజుకు 400



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): వేసవికి ముందే గ్రేటర్ హైదరాబాద్‌లో నీటి కష్టాలు మొదలయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటడం, వాటర్ బోర్డు సరఫరాచేసే నీళ్లు సరిపోకపోవడంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ఈనేపథ్యంలో బుక్ చేసిన ట్యాంకర్ ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. సాధారణంగా వాటర్‌బోర్డు ట్యాంకర్లకు మార్చి నెల రెండో వారం నుంచి డిమాండ్ ఉండేది. ఈసారి ఫిబ్రవరి రెండో వారం నుంచే మొదలైంది. ఇటీవల రోజుకు 1500కు పైగా ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి. డిమాండ్ మేరకు అధికారులు సరఫరా చేయలేకపోతున్నారు. ఎండలు ముదురుతుండడంతో నీటి అవసరాలు పెరిగాయి. ఈ ఏడాది ఆశించినస్థాయిలో వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. అప్పుడే కొన్నిబోర్లు పని చేయడం లేదు. ముఖ్యంగా మాదాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి, మియాపూర్, కేపీహెచ్‌బీ, ప్రగతినగర్, నిజాంపేట, తదితర ప్రాంతాల్లో బోర్లలో నీళ్లు అడుగంటాయి. వాటర్‌బోర్డు సరఫరా చేసే నీరే

మిగతా 8వ పేజీలో..

మేడారానికి 800 సిటీ బస్సులు

- గ్రేటర్‌జోన్‌లో ఉన్నవి 2,600 ● సిటీ ప్రయాణికులకు ఇక్కట్లు తప్పవా?

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు 800కు పైగా సిటీబస్సులు తరలివెళ్లనున్నాయి. 21 నుంచి 24 వరకు జరిగే జాతర కోసం గ్రేటర్‌జోన్‌లోని పలు డిపోల నుంచి దశలవారీగా బస్సులను తరలించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గ్రేటర్‌జోన్‌లో ఆర్టీసీ 2,600 బస్సులు నడుపుతుండగా, వాటిలో 800 మేడారానికి వెళ్తే సిటీలో బస్సుల సంఖ్య తగ్గి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. అయితే 21వ తేదీ నుంచి 24 వరకు నాలుగురోజుల పాటు ప్రయాణికుల రద్దీ సాధారణం కంటే తక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నగరంలో రోజూ 21 లక్షల మంది ప్రయాణాలు సాగిస్తున్నారు.



మరో 400 ప్రత్యేక బస్సులు

మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం ఈనెల 18 నుంచి 400 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ ప్రాంతాల నుంచి ఈ బస్సులను నడుపుతామని వెల్లడించారు.



ఏప్రిల్ నాటికి 100 ఎలక్ట్రిక్ బస్సులు

- పెంపుపై ఆర్టీసీ చర్యలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు మండుతుండటంతో గ్రేటర్‌లో ఏసీ బస్సులకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నాటికి కొత్తగా మరో 100 ఎలక్ట్రిక్‌బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. ఎండలు ముదిరేనాటికి రోడ్లపైకి తెస్తే ఆదరణ పెరుగుతుందని సంస్థ భావిస్తోంది. గ్రేటర్‌జోన్‌లో ఇప్పటికే 64 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను ఆర్టీసీ నడుపుతున్నది. ఎయిర్‌పోర్ట్ రూట్లలో నడిచే ఏసీ బస్సులకు సాధారణరోజుల్లో 60 శాతం ఆక్యుపెన్సీ ఉంటే, వేసవిలో 85 శాతానికి పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

- కొన్ని స్కూళ్లలో రూ. 8 లక్షల వరకు
- పేరొందిన సంస్థల్లో హడలెత్తిస్తున్న ఫీజులు
- బాచుపల్లిలోని ఓ స్కూల్‌లో ఎల్‌కేజీకి రూ. 3,78,100
- గతేడాది ఇదే తరగతికి రూ.3,24,850 వసూలు
- ట్రాన్స్‌పోర్టు, లంచ్ చార్జీలు అదనం

ఎల్‌కేజీ ఫీజు ₹4 లక్షలు



బాచుపల్లిలోని ఓ ఇంటర్నేషల్ స్కూల్‌లో ఎల్‌కేజీ ఫీజు (2024-25) (రూపాయల్లో)

మొదట ఇన్‌స్టాల్‌మెంట్-ఏప్రిల్-1	1,70,100
రెండో ఇన్‌స్టాల్‌మెంట్-ఆగస్టు-1	1,13,500
మూడో ఇన్‌స్టాల్‌మెంట్- డిసెంబర్-1	94,500

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎల్‌కేజీ చదువుకు ఫీజు రూ. 4 లక్షల నుంచి 8 లక్షలు. ఇది ఎక్కడో కాదు.. మహానగరంలోని కొన్ని ఇంటర్నేషనల్ స్కూళ్లలో వసూలు చేస్తున్న రుసుం. నిబంధనలకు పాటించకుండా, ఇష్టారాజ్యంగా ఫీజులను వసూలు చేస్తున్నా యాజమాన్యాలపై చర్యలు తీసుకునే వారు కరువయ్యారు. కరోనా సమయంలో ప్రత్యక్ష బోధనలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ప్రైవేట్ విద్యాసంస్థలు రెండేళ్లుగా ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి. ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచి తల్లిదండ్రుల జేబులను గుల్లచేస్తున్నాయి. అడ్మిషన్ మొదలుకుని నెలవారీ ఫీజుల వరకు అన్నింటిలో 25 నుంచి 30శాతం పెంచి వసూలు చేస్తున్నారు.

కానరాని ఫీజుల నియంత్రణ కమిటీలు

ప్రైవేట్ కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్లలో ఫీజులను నియంత్రించేందుకు 2017లో ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ తిరుపతిరావు అధ్యక్షతన అప్పటి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఏటా ఫీజులను ఎంత పెంచాలనే దానిపై కమిటీ నివేదిక సమర్పించింది. ఆ నివేదికను ఇప్పటి వరకు బహిర్గతం చేయకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. కరోనాకు ముందు ఫీజుల పెంపు కాస్త అటుఇటూగా ఉన్నప్పటికీ 2022 నుంచి ఎడాపెడా పెంచుతున్నారని విద్యార్థి

మిగతా 6వ పేజీలో..

గ్రేటర్‌లో ఇదీ లెక్క					
	4,756	19,06,953	45 ఇంటర్నేషనల్ స్కూళ్లు	650 కార్పొరేట్	860

సీఎం రేవంత్‌తో 'పెటా' ప్రతినిధుల భేటీ

● సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి హామీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్(పెటా) ప్రతినిధులు కోరారు. శుక్రవారం శాసనసభలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డిని పెటా తెలంగాణ సంఘం కార్యదర్శి కృష్ణమూర్తిగౌడ్, రాఘవ రెడ్డి తదితరులు కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 14 ఏళ్లుగా పనిచేస్తున్న పీఈటీలకు పదోన్నతులు నిలిచిపోయాయని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అలానే జీఓ నెంబర్ 79 ప్రకారం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను 70 శాతం పదోన్నతుల ద్వారా, 30 శాతం నేరుగా నియామకం చేపట్టాలని, ఇందుకున్న అడ్డంకులను కూడా పరిష్కరించాలని రేవంత్‌ను కోరారు. వీరి సమస్యలను సావధానంగా విన్న సీఎం, సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



రేవంత్‌కు సమస్యలు విన్నవిస్తున్న కృష్ణమూర్తి

వారం నుంచి విష జ్వరం.. ఆపై గుండెపోటు

కెనడాలో హైదరాబాద్ యువకుడి మృతి

యాకుత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లిన హైదరాబాద్ యువకుడు కార్డియాక్ అరెస్ట్‌తో ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్ టోలిచౌకీ బాల్‌రెడ్డినగర్ వాసి షేక్ ముజామీల్ అహ్మద్ (25) మాస్టర్స్ కోసం 2022లో కెనడా వెళ్లాడు. ఒంటారియో ప్రావిన్స్ కిచెనర్ సిటీలోని కొనెస్టోగా కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో చదువుతున్నాడు. అహ్మద్ వారం రోజులుగా విష జ్వరంతో బాధపడుతున్నాడు. శుక్రవారం అతడు చనిపోయాడంటూ కుటుంబ సభ్యులకు స్నేహితుడు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో అహ్మద్ కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ముజామీల్ తండ్రి షేక్ ముజాఫర్ అహ్మద్ కుటుంబాన్ని ఎంఐఎం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్, ఎంబీటీ అధికార ప్రతినిధి మహ్మద్ అంజాదుల్లా ఖాన్ పరామర్శించారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ద్వారా విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ జైశంకర్‌కు వివరాలు అందజేశారు. ఒట్టావాలోని భారత హైకమిషన్, టొరంటోలోని కాన్సులేట్ జనరల్‌కు ఆదేశాలు జారీ చేసి అహ్మద్ మృతదేహాన్ని స్వదేశం తీసుకొచ్చేందుకు సాయం చేయాలని కోరారు. మృతదేహాన్ని భారత్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టొరంటోలోని భారత కాన్సులేట్ జనరల్ ధీరజ్ పారిక్ సమాచారమిచ్చారు.



ముజమిల్ అహ్మద్(ఫైల్)

ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్లు!

(5వ పేజీ తరువాయి)

- చిలకలగూడ ఎక్స్‌రోడ్ - దామోదర సంజీవయ్య విగ్రహం - మాడపాటి చలపతిరావు విగ్రహం, జర్నలిస్ట్ కాలనీ టీ జంక్షన్ - సాలార్ జంగ్ రోటరీ - ఒరిస్సా ఐస్‌లాండ్

సైబరాబాద్..

- గచ్చిబౌలి - ఐఐఐటీ (డీఎల్ఎఫ్) - ఖాజాగూడ - అల్విన్ - మియాపూర్ - ఆర్టీఓ ఆఫీస్ కొండాపూర్ (న్యూ జంక్షన్) - ఖానామెట్ - విప్రో - ఐసీఐసీఐ బ్యాంక్ - కాంటినెంటల్ ఆస్పత్రి - రాడిసన్ డీఎల్ఎఫ్ (న్యూ జంక్షన్) - క్యూ సిటీ - సీఓడీ - పర్వత్‌నగర్ - బయోడైవర్సిటీ - ఐడీపీఎల్ గుండెన్‌మెట్ - గాజులరామారం - అరాంఘర్ దుర్గానగర్ - లక్ష్మీగూడ - పిల్లర్ నెంబర్ -294 (పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే) - పీడీపీ జంక్షన్ - పిల్లర్ నెంబర్ 202 (పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే) బన్సిలాల్‌నగర్ ఇందిరా గాంధీ విగ్రహం

రాచకొండ..

సరూర్‌నగర్ పోస్టాఫీస్ - ఆనంద్‌నగర్, నాగోల్ - గాంధీ విగ్రహం, సరూర్‌నగర్ - మన్సురాబాద్ వై జంక్షన్ - బండ్లగూడ - ఎల్బీనగర్ ఎక్స్‌రోడ్(పురోగతి) - కర్మన్‌ఘట్ హుడా ఎక్స్‌రోడ్ (కంప్లీటెడ్) - సాగర్ ఎక్స్‌రోడ్ - రైతుబజార్, వనస్థలిపురం - హైవే బవార్చి, హయత్‌నగర్ - కుంట్లూరు ఎక్స్‌రోడ్, హయత్‌నగర్ - ఎన్‌జీఓస్‌కాలనీ, వనస్థలిపురం - బీఎన్‌రెడ్డినగర్ - మందమల్లమ్మ - ఏఎస్‌రావునగర్ - చక్రీపురం - ఈసీఐఎల్ - రాధికా ఎక్స్‌రోడ్ - ఎన్ఎఫ్‌సీ - ఎన్‌టీఆర్ విగ్రహం, హెచ్‌బీ కాలనీ

- అశోక్‌నగర్ - కెనరా బ్యాంక్ - నేతాజీనగర్ - తార్నాక జంక్షన్ - డీమార్ట్ జంక్షన్, కుషాయిగూడ - శారద, కుషాయిగూడ - ఎన్ఎఫ్‌సీ బ్రిడ్జి - ఉప్పల్ ఎక్స్‌రోడ్ - యాప్రాల్ - ఆనంద్‌బాగ్, మల్కాజిగిరి - ఆనంద్‌బాగ్ - వినాయక్‌నగర్ సఫిల్‌గూడ

ఎల్‌కేజీ ఫీజు 4 లక్షలు

(5వ పేజీ తరువాయి)

సంఘాల నాయకులు మండిపడుతున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు కూడా కార్పొరేట్ విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని వారు కోరుతున్నారు.

ఫీజు రెగ్యులేటరీ కమిటీని నియమించాలి

- వెంకట్ సాయినాథ్, హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్, ప్రధాన కార్యదర్శి

గ్రేటర్‌లోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ ఆగడం లేదు. ఏటా 5 నుంచి 7 శాతం పెంచాలనే నిబంధనలున్నా.. కొంతమంది 20 నుంచి 25 శాతం పెంచుతున్నారు. స్కూళ్లలో ఫీజుల నియంత్రణపై కమిటీ వేయాలని కోరుతున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. గ్రేటర్‌లో ఇంటర్నేషనల్, కార్పొరేట్ స్కూళ్లు రాజకీయ నాయకులకు చెందినవి కావడంతో వాటిపై చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై ప్రత్యేక చొరవ చూపాలి.

గచ్చిబౌలిలోని ఓ సాధారణ కార్పొరేట్ స్కూల్‌లో ఫీజులు ఇలా..

తరగతి	2023	2024
ఒకటి	రూ.45,600	68,780
రెండో	రూ.58,500	74,900
మూడో	రూ.64,500	79,980
నాలుగో	రూ.78,590	94,600
ఐదో	రూ.98,980	1,10,560

అడ్మిషన్‌కు రూ.లక్ష నుంచి లక్షన్నర

- బాచుపల్లిలోని ఓ పేరొందిన ఇంటర్నేషనల్ పాఠశాలలో అడ్మిషన్‌కు రూ.1.20 లక్షలు, ఏడాది ఫీజు రూ.3,78,100 ఉంది.
- గతేడాది రూ.3.24,850 లక్షలు ఉండేది.
- గచ్చిబౌలిలోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో నర్సరీకి అడ్మిషన్ ఫీజు రూ.65 వేలు, ఏడాది ఫీజు రూ.1.35 లక్షలు ఉంది.
- పలు ఇంటర్నేషనల్ స్కూళ్లలో ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటో తరగతికి ఏడాదికి రూ.4 లక్షల నుంచి 8 లక్షల వరకు వసూలు చేస్తున్నారు.



బైరామల్‌గూడలో నూతనంగా నిర్మించిన ఫ్లై ఓవర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఫ్లై ఓవర్లకు నిలయం.. ఎల్‌బీనగర్ నియోజకవర్గం

చంపాపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఫ్లై ఓవర్లకు నిలయంగా మారిందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ అలేఖ్య టవర్ ముందు నూతనంగా నిర్మించిన స్కై, ఫ్లైఓవర్‌ను శుక్రవారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చేపట్టిన స్కై, ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులు పూర్తయినట్లు తెలిపారు. త్వరలో స్కై, ఫ్లై ఓవర్లు ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లు, దీంతో వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు పూర్తిగా తొలగిపోనున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. రాబోయే రోజుల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ఫ్లై ఓవర్లను నిర్మించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ అధికారులు దేవానంద్, రాజు, పరమేష్, రోహిణి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మద్దెలకుంట చెరువును సందర్శించిన అడ్వకేట్ కమిషనర్ బృందం



చెరువును పరిశీలిస్తున్న హైకోర్టు అడ్వకేట్ కమిషనర్‌లు ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి

చంపాపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ మండలం చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలోని సర్వే నెం.16లోని మద్దెలకుంట చెరువును శుక్రవారం హైకోర్టు అడ్వకేట్ కమిషనర్ బృందం సందర్శించింది. చెరువు ఆక్రమణకు గురైనట్లు, ఎఫ్‌టీఎల్ నిర్మాణాలు జరిగినట్లు పేర్కొంటూ 2007లో (నెం14728/2007) గమన ఆర్గనైజేషన్ యండీ అనిల్ సి దయాకర్ అనే వ్యక్తి హైకోర్టులో పిటీషన్ వేశారు. దీంతో హైకోర్టు కేసు విచారణ జరిపి 2024 ఫిబ్రవరి 6న అడ్వకేట్ కమిషనర్స్‌ను నియమించింది. ఇందులో భాగంగా డిప్యూటీ సోలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా జి.ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ విభాగం ప్రభుత్వ న్యాయవాది టి.శ్రీకాంత్‌రెడ్డి బృందం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి చెరువును, చెరువు మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం వారు పరిసర ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. 6ఎకరాల 25గుంటల విస్తీర్ణంలో ఉండాల్సిన చెరువు కుషించుకుపోవడానికి గల కారణాలు, ఎఫ్‌టీఎల్ వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు. ఎల్‌బీనగర్ ఎస్‌ఐ దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చెరువు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అడ్వకేట్ కమిషనర్‌ల బృందం వెంట సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్‌ఐలు యాదయ్య, గీత, ఇరిగేషన్ ఏడీఈ నాగరాజు, సర్వేయర్స్ శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, స్పెషల్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

సైదాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అదనపు ఎస్పీ రాందాస్ తేజా సూచించారు. బంజారాల ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ మహారాజ్ మహాబోగ్ బండార్ కార్యక్రమం సేవాలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో సింగరేణి కాలనీ రోడ్డు నెంబరు-14లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజన్న, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఎస్సై మోజీరాం నాయక్, అడ్వకేట్ ఆంజనేయులు, సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్ర మోతీలాల్‌నాయక్, మహిళా అధ్యక్షురాలు సక్రీబాయి పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిని అభినందించిన మధుకర్‌స్వామి, వినయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారికి అభినందన

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అంతసులువు కాదని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్, డీసీపీ మధుకర్‌స్వామి అన్నారు. ఏస్ సంస్థలో శిక్షణ పొంది వివిధ ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు సాధించిన వారిని అభినందిస్తూ శుక్రవారం శ్రీసాయి ఫంక్షన్‌హాల్‌లో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏస్ చైర్మన్ వినయ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బందితో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులను ప్రశంసిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి

జాబ్ మేళాలో 150 మంది విద్యార్థుల ఎంపిక

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థులకు విద్యతోపాటు ఉపాధి కల్పిస్తున్నట్లు నోబుల్ విద్యాసంస్థల చైర్మన్ ఆర్.రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని నోబుల్ డిగ్రీ, పీజీ కళాశాల, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 350 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 150 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.భాస్కర్‌రావు, ప్రోగ్రాం మేనేజర్ రాకేష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో వ్యక్తిత్వ వికాస నిపుణులు వేణుగోపాల్‌రెడ్డి, డా.వసంతరాయలు

విద్యార్థి దశలోనే లక్ష్యం నిర్దేశించుకోవాలి

కొత్తపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే లక్ష్యం నిర్దేశించుకోవాలని, అందుకు తగిన ప్రణాళిక తయారు చేసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు వేణుగోపాల్‌రెడ్డి, డా.వీరభోగ వసంతరాయలు సూచించారు. శుక్రవారం కొత్తపేట జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు వారు విజయ సాధన, ప్రేరణ, ఏకాగ్రత తదితర అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఎంచుకున్న రంగంలో అభివృద్ధిని సాధించాలి

వనస్థలిపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురంలోని బచ్‌పన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బచ్‌పన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ రిజనల్ డైరెక్టర్స్ కె.శ్రీకాంత్ రెడ్డి, రూపారెడ్డిలు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో అభివృద్ధిని సాధించాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటే సాంస్కృతిక అంశాలపట్ల అవగాహన పెంపొందించుకోవాలనీ సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కె.కౌశిక్ రెడ్డి, గిరీష్ మక్వానా, ఎస్.కల్పవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం

కేంద్రం అవలంభిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన సమ్మె విజయవంతమైంది. పలుచోట్ల ర్యాలీలు తీశారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులను బానిసలుగా చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మన్సూరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి.కృష్ణమూర్తి మాట్లాడారు. మోదీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు రూ.7లక్షల కోట్ల రుణాలు మాఫీ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మచారి, ఆంజనేయులు, ఎన్.సుదర్శన్‌రెడ్డి, సోమయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు లింగం, సుధీర్ పాల్గొన్నారు. ఎల్‌బీనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య, సర్కిల్ అధ్యక్షుడు రామస్వామి, నాయకులు పార్వంది శ్రీనివాస్, దుర్గారావు, నగేష్, కృష్ణమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో...

గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతుగా సరూర్‌నగర్ సర్కిల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మనోహర్, టీఆర్‌టీయూ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు జలంధర్, భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా కోశాధికారి చైతన్య, రంగారెడ్డి జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి మల్లేష్, రంగారెడ్డి జిల్లా మత్స్యకార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకన్న, శ్రీనివాసులు, సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ నేతలు ఎండీ లతీఫ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు అరుణ్ పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హయత్‌నగర్ మండల కేంద్రంలో పలు కార్మిక సంఘాలు సంఘీభావం తెలిపాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, ఏఐటీయూసీ సబ్ కమిటి సభ్యుడు సామిడి శేఖర్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సక్రు నాయక్, వంశీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దఅంబర్‌పేట్ చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

తుర్కయంజాల్ చౌరస్తాలో సీఐటీయూ, ఏఐటీయూసి, రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తా రోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్ ఏఐటీయూ జిల్లా కార్యదర్శి యాదయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య తదితరులు పాల్గొన్నారు

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని విజయవాడ జాతీయ రహదారి, పెద్దఅంబర్‌పేట్ చెక్‌పోస్టు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, మండల కన్వీనర్ ఏర్పుల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

ఏఐటీయూసీ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్ ఆధ్వర్యంలో ఆర్‌ఎన్‌ఆర్ కాలనీ నుంచి 150 బైక్‌లు, ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కుంట్లూర్ మీదుగా పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, వెంకన్న, ప్రసాద్, నరసింహ, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్‌లో...

బాలాపూర్ చౌరస్తాలో శుక్రవారం సీపీఐ మండల శాఖ అధ్యక్షుడు అయోధ్య వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాల్వ శంకర్, నరేందర్, రాజు, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బాలాపూర్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఐ నేతలు, కార్మిక సంఘాల ప్రతినిధులు



అబ్దుల్లాపూర్‌మెట్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మికత ఎంతో అవసరం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవరచుకోవాల్సిన అవసరం ఉన్నదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని ప్రశాంతిహిల్స్‌లో గల శ్రీద్వారకామాయి సాయిబాబా పీఠాధిపతి శ్రీగోపాలకృష్ణానంద స్వామీజీ రచించిన రెండు ఆధ్యాత్మిక గ్రంథాలను(రహస్య తత్త్వార్థ బోధలు, శ్రీఆదిత్య హృదయం) శుక్రవారం పీఠంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. బాబా విగ్రహం వద్ద ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. పీఠాధిపతి తన ఆధ్యాత్మిక బోధనలు, రచనలతో సామాన్యుల్లోనూ ఆధ్యాత్మిక భావనను నెలకొల్పుతున్నారని, ప్రస్తుత సమాజానికి ఇది ఎంతో అవసరమని అన్నారు. బాబా కృపతో అటు దేశం, ఇటు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నానని, రెండు చోట్లా పాలన సవ్యంగా సాగేలా చూడాలని వేడుకుంటున్నానని గవర్నర్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, హెటిరో గ్రూప్ చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి, మాజీ ఐఏఎస్ జానకి కొండపి, పీఠం మాతాజీ, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు సామిడి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక గ్రంథాలను ఆవిష్కరిస్తున్న గవర్నర్ తమిళిసై



మార్కెట్‌లో రోడ్లపై మురుగునీరు

మలక్‌పేట వ్యవసాయమార్కెట్‌లో డ్రైనేజీ కంపు

ఓల్డ్‌మలక్‌పేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ (గంజ్)లో డ్రైనేజీ కంపు కొడుతోంది. పైపులు పగిలి మురుగునీరు బయటకి వస్తోంది. మార్కెట్ ముందు భాగంలో ఉన్న రోడ్లన్ని డ్రైనేజీ నీటితో బురదమయంగా మారాయి. రెండో రోడ్‌లో మ్యాన్ హోల్ పగిలి మురుగునీరంతా రోడ్లపై ప్రవహిస్తుంది. నడవటానికి కూడా వీలులేకుండా అధ్వానంగా ఉంది. జీహెచ్‌ఎంసీ, మార్కెట్ సిబ్బంది దృష్టి సారించి మార్కెట్‌లో డ్రైనేజి సమస్యను అరికట్టాలని వ్యాపారస్తులు, మార్కెట్‌కు వచ్చేవారు కోరుతున్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ల పనులను అడ్డుకోవడం తగదు

కొత్తపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ పైప్‌లైన్ల పనులను, అంతర్గతదారుల పనులను అడ్డుకోవడం తగదని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. న్యూ మారుతీనగర్ కాలనీలో అర్ధంతరంగా ఆగిన అభివృద్ధి పనులను పునరుద్ధరించాలని కాలనీవాసులు కార్పొరేటర్‌కు విన్నవించారు. కాలనీలో గ్రీనరీ కోసం పైప్‌లైన్ పనులు వేస్తుండగా ఓ వ్యక్తి ఇంటిప్రహరీ గోడ కూలింది. దీంతో సదరు వ్యక్తి పనులను అడ్డుకున్నట్టు సమాచారం. శుక్రవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ ఏఈ మాతృనాయక్‌తో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీలో ఆగిన పనులు, ఇతర సమస్యలనూ కార్యదర్శి దుడ్డు సుబ్రమణ్యం ఆయనకు వివరించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు కొనసాగేలా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు సుమన్, శివ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం...



మౌనిక

జవహర్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వివాహిత ఇంటినుంచి వెళ్లిపోయిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సీతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. యప్రాల్‌లో నివాసం ఉంటున్న లకౌత్ సురేశ్, బూక్య మౌనిక(22) భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు కూడా ఉన్నాడు. కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన మౌనిక ఈనెల 15న ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త పలుచోట్ల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాచ్‌మన్ ఆత్మహత్య

సైదాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో వాచ్‌మన్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాతృ శ్రీ కాలనీలో శ్రీ వైష్ణవి నిలయం అపార్ట్‌మెంట్‌లో కాకినాడకు చెందిన శ్రీనివాస్(27) తల్లిదండ్రులతో ఉంటూ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం తల్లిదండ్రులు కాకినాడకు వెళ్లారు. శుక్రవారం సాయంత్రం తండ్రికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. వెంటనే తండ్రి సైదాబాద్ లక్ష్మీనగర్‌లో ఉంటోన్న కూతురికి ఫోన్ చేసి వెళ్లి చూడమని చెప్పాడు. ఆమె వెళ్లి చూడగా గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సైదాబాద్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు వస్తే కారణాలు తెలిసే అవకాశముందని పోలీసులు తెలిపారు.

మరో యువకుడి ఆత్మహత్య...

వివాహం జరగటం లేదని మనస్థాపంతో శుక్రవారం సాయంత్రం సైదాబాద్ పూసలబస్తీకి చెందిన సాగర్(25) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ అనురాధ

రూ. 35 కోట్ల 17 లక్షల బడ్జెట్‌కు తుర్కయంజాల్ మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

హయత్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపల్ బడ్జెట్ సమావేశం శుక్రవారం చైర్ పర్సన్ ఎం.అనురాధ అధ్యక్షతన రాగన్నగూడ వార్డు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రూ. 35 కోట్ల 17లక్షల బడ్జెట్‌కు తుర్కయంజాల్ మున్సిపాలిటి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ మొత్తం ఆదాయం రూ. 28 కోట్ల 87 లక్షలు కాగా, వివిధ గ్రాంట్ల ద్వారా రూ. 4 కోట్ల 80 లక్షలు, హరిత బడ్జెట్ ద్వారా రూ. 2 కోట్ల 88 లక్షలు సమకుర్చుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ హరిత, కౌన్సిలర్ ఫ్లోర్‌లీడర్ కొశిక ఐలయ్య, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు మంగమ్మ, శ్రీలత, ఉదయశ్రీ, వేముల స్వాతి, మాధవి, రేవల్లి హరిత, అనురాధ, శివలింగంగౌడ్, బాల్‌రాజ్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్ కమిషనర్‌గా సత్యనారాయణరెడ్డి

తుర్కయంజాల్ మున్సిపాలిటి నూతన కమిషనర్‌గా బి. సత్యనారాయణరెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. రెండు రోజుల క్రితం తుర్కయంజాల్ కమిషనర్‌గా ఉన్న శ్రీకాంత్ రామగుండం కమిషనర్‌గా బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఖమ్మం కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణరెడ్డిని ప్రభుత్వం తుర్కయంజాల్ మున్సిపాలిటి కమిషనర్‌గా బదిలీ చేసింది. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్‌రెడ్డితోపాటు కార్యాలయం సిబ్బంది ఉన్నారు.



డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి చేతుల మీదుగా డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకపత్రం అందుకుంటున్న నవీన్‌గౌడ్

డీసీసీ ఉపాధ్యక్షుడిగా నవీన్‌గౌడ్ నియామకం

చంపాపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన పులి నవీన్‌గౌడ్ నియమితులయ్యారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి చేతుల మీదుగా డీసీసీ ఉపాధ్యక్షుడుగా నవీన్‌గౌడ్ నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటి చైర్మన్ మధుయాష్కీగౌడ్, చల్లా నర్సింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పల శ్రవణ్‌కుమార్, ఎల్లెందర్, హరి నారాయణరెడ్డి, జంగయ్యగౌడ్, వెంకటేశ్వర్లు, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.



పూజ కార్యక్రమంలో కొత్తకాపు రవీందర్ రెడ్డి, సహదేవ్ యాదవ్

ఘనంగా గోశాల వార్షికోత్సవం

సైదాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మాదన్నపేట మార్కెట్‌లో ఉన్న గోశాల మూడో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం గణపతి హోమం, గోమాత పూజలు నిర్వహించారు. గోమాతకు హిందూ ధర్మంలో ఎంతో పవిత్రత ఉందని, గోమాతను పూజిస్తే శ్రీ కృష్ణుడిని ఆరాధించినట్లేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొత్తకాపు రవిందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, కమిటీ సభ్యులు ఉగాది మహేశ్, సాయి కిరణ్, శ్యాం, సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల సుందరీకరణ కోసం చర్యలు

చంపాపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ భూపేష్ గుప్తానగర్‌కాలనీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నెలకొన్న రాళ్లు, పిచ్చి మొక్కలు తొలగించి విద్యార్థులకు ఆటస్థలం ఏర్పాటు చేయనున్నట్లు కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ డైరెక్టర్, కాలనీ అధ్యక్షుడు, 'మీకోసం మేమున్నాం' ఫౌండేషన్ చైర్మన్ నారగోని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన పాఠశాల ఆవరణలో జేసీబీ సహాయంతో రాళ్లు, పిచ్చిమొక్కల తొలగింపు పనులను పర్యవేక్షించారు. శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ. తనతో పాటు ఏంవీ ఫౌండేషన్ చైర్మన్ నారాయణచారి, కాలనీ పెద్దల సహకారంతో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు, బోరు డ్రిల్లింగ్, పార్కు, వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డేవిడ్ పాల్గొన్నారు.



కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అరుణాప్రభాకర్‌రెడ్డి, ప్రమీలాయాదగిరి

కాంగ్రెస్‌లో చేరిన మీర్‌పేట్ బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన ఇద్దరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. 28వ డివిజన్ కార్పొరేటర్ జిల్లెల అరుణాప్రభాకర్‌రెడ్డి, 30వ డివిజన్ కార్పొరేటర్ పిడుగు ప్రమీలాయాదగిరి శుక్రవారం మీర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ సమక్షంలో వారు హస్తం గూటికి చేరుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చల్లా కవితాబాల్‌రెడ్డి, పోరెడ్డి పద్మాభాస్కర్‌రెడ్డి, వేముల నర్సింహ, సిద్దాల మౌనికాశ్రీశైలం, అక్కి మాధవీఈశ్వర్‌గౌడ్, గజ్జెల రాంచందర్, కాంగ్రెస్ నాయకులు కీసరి యాదిరెడ్డి, సప్పిడి జంగారెడ్డి, జంగారెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులను పరిశీలించిన ఆర్‌అండ్‌బీ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా మిగిలిన పెద్దఅంబర్‌పేట్ 5వ వార్డు పరిధిలోని చాకరి వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ బొర్ర అనురాధసురేష్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. డీఈ వేణుగోపాల్‌రెడ్డి కాంట్రాక్టర్‌తో మాట్లాడి బ్రిడ్జికి రెండు వైపుల సైడ్ వాల్స్ పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. వర్షాకాలంలోగా బ్రిడ్జి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ అనురాధ సురేష్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

25న గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని ఎన్నుకునేందుకు ఈ నెల 25వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ చిదర రమేష్ వెల్లడించారు. ఫిబ్రవరి 20 ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గడ్డిఅన్నారం లలితానగర్‌లోని వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థాన కళ్యాణ మండపంలో నామినేషన్‌లు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 25 ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కోదండరామ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎన్నికలు ఎన్నికల నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికలలో పోటీ చేయాలనుకునే అభ్యర్దులు చీఫ్ ఎన్నికల అధికారి చిదర రమేష్ (ఫోన్ నెం.8555045634)ను సంప్రదించాలని తెలిపారు.



ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చనగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

అష్టలక్ష్మి ఆలయంలో ఘనంగా రథసప్తమి వేడుకలు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని వాసవీకాలనీలో అష్టలక్ష్మి దేవాలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, దేవాలయ కమిటీ చైర్మన్ సోమ సురేష్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, పాల్గొన్నారు.

జూపార్కు నిర్వహణ భేష్

● ఇంగ్లండ్ జూ ఫౌండర్ డైరెక్టర్ మెలిసా మేస్



వైట్ బెంగాల్ టైగర్ ఎన్‌క్లోజర్‌ను పరిశీలిస్తున్న మెలిసా మేస్, తదితరులు

మదీన, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ జూపార్కును శుక్రవారం ఇంగ్లండ్‌కు చెందిన హోల్మ్స్ చాపల్ జూ వ్యవస్థాపక డైరెక్టర్ మెలిసా మేస్, డైరెక్టర్ బెన్ మేస్ సందర్శించారు. 12 రోజుల భారతదేశ పర్యటనలో భాగంగా వారు శుక్రవారం జూపార్కును సందర్శించగా.. జూ క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరమెత్, జూ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం జూపార్కులోని వివిధ విభాగాల పనితీరును వారికి వివరించారు. యానిమల్ ఎన్‌క్లోజర్లు, సఫారీ పార్కు, రిప్టైల్ హౌజ్‌తోపాటు జంతువులకు అందిస్తున్న వైద్యసేవలు, కొద్దిరోజులుగా చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్లు, జంతువుల పునరుత్పత్తి కేంద్రం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మెలిసా మేస్, బెన్ మేస్‌లు మాట్లాడుతూ జూపార్కు నిర్వహణ చాలా బాగుందన్నారు. వెటర్నరీ విభాగం ఆధ్వర్యంలో 194 రకాలకు చెందిన 2,221 జంతువుల పర్యవేక్షణ బాగుందని కితాబునిచ్చారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించాలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం మరింత చేయూతనివ్వాలని తెలంగాణ స్టేట్ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అశోక్‌కుమార్, ప్రధానకార్యదర్శి టి.శ్రీహరిబాబు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ స్టేట్ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీకి రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ తోడైతే లబ్ధిదారులపై ఆర్థికభారం మరింత తగ్గుతుందన్నారు. టెండర్లు ఆహ్వానిస్తూ సోలార్ విద్యుత్ ఉత్పత్తిని కొనడంతో రాష్ట్ర ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ లభించే అవకాశముందన్నారు. గ్రేటర్‌తోపాటు పలు ప్రైవేట్ సంస్థలను సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో భాగస్వామ్యం చేస్తే సోలార్‌విద్యుత్ ఉత్పత్తి భారీగా పెంచుకునే అవకాశాలు మెరుగు పడుతాయన్నారు. ఓపెన్ యాక్సిస్‌తో ఒకచోట ఉత్పత్తి చేసుకున్న సోలార్ విద్యుత్తును మరో చోటికి నిబంధనలకు లోబడి విక్రయించేలా అనుమతులిస్తే రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న వేల ఎకరాల భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనాల్సిన అవసరం తగ్గిపోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు సోలార్ విద్యుత్‌ఉత్పత్తి గణనీయంగా పెంచడం ఒక్కటే మార్గమని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజేష్ పరకాల అన్నారు.

జేఎన్‌టీయూ జోక్యంపై 'మైనారిటీ' కాలేజీల అభ్యంతరం

● పాలకమండళ్లలో వర్సిటీ నామినీల ఉపసంహరణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైనారిటీ ఇంజనీరింగ్ కళాశాలలపై జేఎన్‌టీయూ అధికారుల జోక్యం పట్ల ఆయా కళాశాలల యాజమాన్యాలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశాయి. వాస్తవానికి యూనివర్సిటీ అఫిలియేటెడ్ కళాశాలల పాలకమండళ్ల(గవర్నింగ్ బాడీ)లో జేఎన్‌టీయూ తరఫున ఒక ప్రొఫెసర్‌ను సభ్యుడిగా రిజిస్ట్రార్ నియమిస్తారు. బోర్డు ఆఫ్ స్టడీస్, అకడమిక్ కౌన్సిల్, ఫైనాన్స్ కమిటీలు తీసుకున్న నిర్ణయాలు, ఆయా కమిటీలు చేసిన సిఫార్సులను గవర్నింగ్ బాడీస్ ఆమోదించాల్సి ఉంటుంది. అయితే.. మైనారిటీ విద్యాసంస్థలకు ఈ తరహా నియామకాలు అక్కర్లేదంటూ 20ఏళ్ల కిందటే జాతీయ మైనారిటీ కమిషన్ మినహాయింపులు ఇచ్చినప్పటికీ.. యూనివర్సిటీ ఉన్నతాధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆయా కాలేజీల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. యూనివర్సిటీ అధికారుల జోక్యంతో తమ పాలకమండళ్లకు ఉన్న స్వయం ప్రతిపత్తిని కోల్పోవాల్సి వస్తుందని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ విషయమై కొన్ని మైనారిటీ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు ఇటీవల మైనారిటీ కమిషన్‌ను, మరి కొన్ని కళాశాలల ప్రతినిధులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ మేరకు జేఎన్‌టీయూ అధికారులకు మైనారిటీ కమిషన్‌ను నుంచి నోటీసులు రావడంతో.. మైనారిటీ కళాశాలల పాలక మండళ్లలో ఇప్పటికే నియమించిన యూనివర్సిటీ నామినీల నియామకాలను రద్దు చేస్తూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

గతంలో అభ్యంతరం చెప్పలేదు: వీసీ నర్సింహారెడ్డి

ఈ విషయమై యూనివర్సిటీ వీసీ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డిని వివరణ కోరగా, గతంలో మైనారిటీ కళాశాలల గవర్నింగ్ బాడీస్‌లో వర్సిటీ తరఫున నామినీలను నియమించినపుడు మైనారిటీ ఇంజనీరింగ్ కళాశాలలేవీ అభ్యంతరం తెలపలేదన్నారు. ఈ ఏడాది కొన్ని కళాశాలల యాజమాన్యాలు జాతీయ మైనారిటీ కమిషన్ ఉత్తర్వుల్లో ఇచ్చిన మినహాయింపులను పొందుపరుస్తూ తమకు విజ్ఞాపనలు పంపాయని, వాటిని పరిశీలించిన మీదట ఆయా కళాశాలల్లో ఇప్పటికే నియమించిన వర్సిటీ నామినీలను ఉపసంహరించుకున్నట్లు ఆయన తెలిపారు.

అంజనీకుమార్ ఇన్‌స్టా ఖాతా హ్యాక్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల గవర్నర్ తమిళి సై, ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ ట్విటర్ ఖాతాలను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు.. మాజీ డీజీపీ, ప్రస్తుత రోడ్ సేఫ్టీ చైర్మన్ అంజనీకుమార్‌నూ వదల్లేదు. అంజనీకుమార్ '1100' పేరుతో ఇన్‌స్టాలో నకిలీ ఖాతాను తెరిచారు. విషయం తెలుసుకున్న అంజనీకుమార్ పీఏ హలీమ్ హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ క్రిమినల్స్‌తో జర పైలం

● ఆన్‌లైన్ లావాదేవీలు చేసేవారికి పోలీసుల సూచన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో నిబంధనల మేరకు క్రిప్టో లావాదేవీలు జరిపే వారు మోసపూరితమైన లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. తెలిసీ తెలియక సైబర్ క్రిమినల్స్‌తో లావాదేవీలు జరిపి ఇబ్బందుల్లో పడొద్దని, వారు తెలివిగా అమాయకులను సైబర్ నేరాల్లో ఇరికిస్తున్నారని సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ శిల్పవల్లి సూచించారు.

గ్రూప్స్ రాస్తున్న విద్యార్థి అకౌంట్ ఫ్రీజ్..

గ్రూప్స్‌కు ప్రిపేరవుతున్న ఓ విద్యార్థి సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి తన బ్యాంకు ఖాతా ఫ్రీజ్ అయిందని, అందులో రూ.1.20లక్షలు ఉన్నాయని తెలిపారు. ఫ్రీజ్ కావడానికి కారణం తెలపాలని కోరాడు. దాంతో టెక్నికల్ ఎవిడెన్స్‌ను సేకరించిన పోలీసులకు అతనితో సైబర్ నేరగాళ్లు మోసపూరితమైన లావాదేవీలు జరిపి, సైబర్ క్రైమ్‌లో ఇరికించినట్లు తెలుసుకున్నారు. సదరు విద్యార్థి ఆన్‌లైన్‌లో నిబంధనల ప్రకారమే క్రిప్టో ట్రేడింగ్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నుంచి కొల్లగొట్టిన డబ్బును కొంతమొత్తాన్ని ఆ విద్యార్థికి పంపి క్రిప్టోలో ఇన్వెస్ట్‌మెంట్ చేయించారు. ఎప్పుడైతే సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ నేరగాడి బ్యాంకు ఖాతాలు చెక్ చేశారో.. అతడి ఖాతా నుంచి విద్యార్థి ఖాతాకు డబ్బులు బదిలీ అయినట్లు గుర్తించారు. దాంతో పోలీసులు ఆ ఖాతాను కూడా ఫ్రీజ్ చేశారు. నేరగాడు పంపిన డబ్బును విద్యార్థి క్రిప్టోలో ఇన్వెస్ట్ చేశాడు. కానీ, ఖాతా ఫ్రీజ్ చేయడం వల్ల అందులో ఉన్న అతని సొంత డబ్బు నిలిచిపోయింది. దాంతో ఆయన పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇలాంటి మోసపూరితమైన ఆర్థిక లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీసీపీ సూచించారు. సైబర్ నేరగాళ్లు తెలివిగా అమాయకులను ఇలాంటి కేసుల్లో ఇరికించి తప్పించుకుంటున్నారని వెల్లడించారు.

నూతన విద్యావిధానాన్ని రద్దుచేయాలి

పలు విద్యార్థి సంఘాల డిమాండ్



క్రాస్‌రోడ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో అమలుకు యత్నిస్తున్న నూతన విద్యావిధానాన్ని వెంటనే రద్దు చేయాలని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. భారత్ బంద్‌కు మద్దతుగా శుక్రవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యూ, ఏఐడీఎస్‌వో, పీడీఎస్‌యు(వి) తదితర వామపక్షవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నారాయణగూడ నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్ వరకు భారీ విద్యార్థి ప్రదర్శన జరిగింది. అనంతరం క్రాస్‌రోడ్‌లో నిరసన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు టి. నాగరాజు, ఆర్ఎల్ మూర్తి, పుట్టా లక్ష్మణ్, మహేష్, రామకృష్ణ, మల్లేష్, హకీమ్, నవీద్, ఎ. విజయ్ తదితరులు మాట్లాడుతూ విదేశీ యూనివర్శిటీలను రద్దు చేయాలని, యూజీసీకి గ్రాంట్ పెంచాలని డిమాండ్ చేశారు.ఢిల్లీ సరిహద్దు శంభూలో పోరాడుతున్న అన్నదాతలపై లాఠీచార్జీ చేసి కాల్పులు జరిపి దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు.

సాహిత్య అధ్యయనం తగ్గడం వల్లే నేర ప్రవృత్తి

● ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్



తెలంగాణ లిటరరీ కాంగ్రెస్ సదస్సులో అంపశయ్య నవీన్, అల్లం రాజయ్య, పెద్దింటి అశోక్ కుమార్, కాశీం తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విద్యార్థి జీవితమే అంపశయ్య నవలకు ప్రేరణను, నేపథ్యాన్ని అందించిందని ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్ తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నవలలను అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఓయూ తెలుగు శాఖ అధ్యక్షుడు కాశీం నిర్వహణలోని 'తెలుగు సాహిత్య మహాసభ' రెండోరోజు సమావేశం శుక్రవారం నవలా సమయం, విమర్శాదర్శనం తదితర అంశాలపై సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంపశయ్య నవీన్ మాట్లాడుతూ సాహిత్య అధ్యయనం కొరవడడం వల్ల సమాజంలో నేరప్రవృత్తి పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాల మధ్య ఘర్షణే నవలా సాహిత్యంలోని వస్తు వైవిధ్యానికి ప్రేరణ అని ప్రముఖ రచయిత అల్లం రాజయ్య పేర్కొన్నారు. తెలంగాణలో గత పదేళ్లలో వచ్చిన నవలలు నిరాశపరిచాయని, మధ్యతరగతి జీవితాన్ని చిత్రించే నవలలు పెద్దగా రాలేదని విమర్శకుడు కాసుల ప్రతాపరెడ్డి అన్నారు. నవలా రచనలో పాత్రల పరికల్పన అంశంపై ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ ప్రసంగించారు. వర్తమాన నాటకరంగంపై కోట్ల హనుమంతరావు మాట్లాడారు. నవలా రచయితగా తన అనుభవాలను బండి నారాయణ స్వామి వివరించారు. 'విమర్శనా దర్శనం', 'సాహిత్య శిల్పం' తదితర అంశాలపై సదస్సులో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు సాహితీ విమర్శకులు, రచయిత్రులు, కవులు పాల్గొన్నారు. ఈ మూడు రోజుల తెలుగు లిటరరీ కాంగ్రెస్ ను చరిత్రలో నిలిచిపోయేదిగా పలువురు అభివర్ణించారు. ఈ వేదిక కన్వీనర్‌గా ఇలాంటి బృహత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోన్న ప్రొఫెసర్ చింతకింది కాశీం కృషి అభినందనీయమని వక్తలు ప్రశంసించారు.

ఓయూలో కోలాహలంగా తెలుగు సాహిత్య మహాసభ

తార్నాక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరుగుతున్న తెలుగు సాహిత్య మహాసభలతో ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం కళకళలాడుతున్నది. శుక్రవారం కవులు, గాయకులతో కోలాహలంగా మారింది. 'కవితా పొద్దు'లో భాగంగా కవి, గాయక సమ్మేళనాలు, సామూహిక కవితా పఠనం విద్యార్థులను అలరించాయి. ఈ సందర్భంగా ఓయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొ. సి.కాశీం మాట్లాడుతూ వేలాదిమంది విద్యార్థుల సమక్షంలో కవిగాయక సభ జరగడం ఒక కొత్త సంప్రదాయానికి నాంది పలికిందన్నారు.

నేటి కార్యక్రమాలు

- మధ్యాహ్నం 2గంటలకు చిన్నారుల నృత్య పోటీలు
- సాయంత్రం 4గంటలకు 'సమూహ' కవితా సంపుటి ఆవిష్కరణ
- సాయంత్రం 4.30గంటలకు రూపా రుక్మిణి 'మిగుల్చుకున్న వాక్యాలు కొన్ని' కవితా సంపుటి ఆవిష్కరణ
- సాయంత్రం 5 గంటలకు సింగిడి తెలంగాణ రచయితల ఆధ్వర్యంలో 'తండ్రి పెరియార్' పుస్తకావిష్కరణ
- సాయంత్రం 6గంటలకు కథారచయిత పెద్దింటి అశోక్ కుమార్‌తో ముఖాముఖి
- సాయంత్రం 6.45 గంటలకు నాటక రచయిత దెంచనాల శ్రీనివాస్‌తో ముఖాముఖి
- సాయంత్రం 7.15గంటలకు 'వెనుకబడిన తరగతుల సాధికారత సంస్థ' ఆధ్వర్యంలో మహనీయుల సంక్షిప్త జీవిత చరిత్ర పుస్తకాల ఆవిష్కరణ
- సందర్శన వేళలు - మధ్యాహ్నం 1నుంచి రాత్రి 9 గంటల వరకు



పుస్తక ప్రదర్శన

మరో రెండు రోజులు మాత్రమే.!

ఎన్టీఆర్ స్టేడియంలోని పుస్తకప్రదర్శన మరో రెండు రోజులు మాత్రమే కొనసాగనుంది. ఇందులో సామాజిక, ఆర్థిక, రాజకీయ, మనోవైజ్ఞానిక శాస్త్రాలు, సాంకేతిక పరిశోధనలు, చరిత్ర అధ్యయనాలు, జీవిత చరిత్రలు, కథ, నవల, కవిత్వం, బాల సాహిత్యం ఇలా సమస్త విజ్ఞాన భాండాగారం కొలువుదీరింది. సాహిత్యాభిమానులు నగర శివారు ప్రాంతాల నుంచేగాక తెలంగాణ, ఏపీ జిల్లాల నుంచి వస్తున్నారు. ఏడాదికి ఒకసారి వచ్చే పుస్తకాల పండుగను చూసి తమకు నచ్చిన పుస్తకాలను చేతుల్లోకి తీసుకొని మురిసిపోవడం ఈ కొలువులో మాత్రమే కనిపించే దృశ్యం. పుస్తక ప్రదర్శన సోమవారంతో ముగియనుంది.

జీవితాన్ని వ్యాఖ్యానించేది కవిత్వమే..

ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్



'యువతరం కవుల అంతరంగం' ఆవిష్కరణలో అమ్మంగి వేణుగోపాల్, ప్రసేన్ తదితరులు

జీవితం లేకుండా కవిత్వం లేదని, జీవితాన్ని వ్యాఖ్యానించేది కవిత్వం మాత్రమే అని కాళోజీ పురస్కార గ్రహీత, ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్ అన్నారు. నిరంతర అధ్యయనం ద్వారానే మంచి కవిత్వం రాయగలమని అన్నారు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియలద్వారా యువ కవులు, రచయితలు గళమెత్తాలని హితవుపలికారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని రవ్వా శ్రీహరి వేదికపై 'యువతరం కవుల అంతరంగ ఆవిష్కరణ' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమ్మంగి వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని రణగొణ ధ్వనుల్ని నేటి తరం కవులు అధిగమించాలని సూచించారు. సభాధ్యక్షత వహించిన కవి ప్రసేన్ మాట్లాడుతూ సృజనాత్మకతతో రాయడంతోపాటు సొంత శైలిలో రాయాలని సూచించారు. ఈ తరం ముందు ఎన్నో సవాళ్లున్నాయని, వాటిని ఎదుర్కొంటూ సాహిత్య సృజన జరగాలని హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ కవి యాకూబ్, యువతరం కవులు దొంతం చరణ్, పేర్ల రాము, కల్యాణి కుంజ, లిఖిత్ కుమార్ గోదా తదితరులు పాల్గొన్నారు.





పెద్దమ్మతల్లి రథోత్సవంలో విష్ణువర్ధన్‌రెడ్డి, మేయర్ విజయలక్ష్మి తదితరులు

అంగరంగ వైభవంగా పెద్దమ్మ తల్లి రథోత్సవం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన పెద్దమ్మ తల్లి రథోత్సవం కన్నులపండువగా సాగింది. ఆలయ 30వ వార్షికోత్సవంలో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం రుత్విక్ హోమం, బలిహరణ గావించారు. పూర్ణాహుతి అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథం మీదకు చేర్చారు. 'జై బోలో పెద్దమ్మ తల్లికీ జై..' అంటూ ఆధ్యాత్మిక నినాదాలు మార్మోగాయి. అమ్మవారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబసభ్యులు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, బీఆర్ఎస్ నాయకుడు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

19న జీహెచ్ఎంసీలో 'ప్రజావాణి' రద్దు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 19వ తేదీన నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. అయితే, సర్కిల్ కార్యాలయాల్లో ప్రజావాణి యథావిధిగా ఉంటుందని, సమస్యలపై పౌరులు తమ సర్కిళ్లలో ఫిర్యాదు చేయొచ్చని ఆయన సూచించారు.

కులగణనపై మేయర్ హర్షం

సమగ్ర కులగణన తీర్మానాన్ని అసెంబ్లీలో ఆమోదించడంపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కులగణనతో దశాబ్దాలుగా బడుగు బలహీన వర్గాలకు సామాజికంగా, రాజకీయంగా జరుగుతోన్న అన్యాయానికి చెక్ పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్టార్ కేన్సర్ సెంటర్‌కు అవార్డులు



అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ విపిన్ గోయెల్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కేన్సర్ నివారణకుగాను ముందస్తు పరీక్షలు, రోగులకు అవగాహన కల్పించడంలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ కేన్సర్ సెంటర్‌కు ప్రతిష్ఠాత్మక రెండు అవార్డులు దక్కాయి. న్యూఢిల్లీలోని ఇంటిగ్రేటెడ్ హెల్త్ అండ్ వెల్-బీయింగ్ కౌన్సిల్‌లో జరిగిన 5వ కేన్సర్ సమ్మిట్‌లో ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, సర్జికల్, అంకాలజీ విభాగం అధిపతి డాక్టర్ విపిన్ గోయెల్ ఈ అవార్డులను అందుకున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో కేవలం మూడు నెలల్లో మూడు వేల మందికిపైగా వ్యక్తులను పరీక్షించడంతో సేవలను గుర్తించి అవార్డులకు ఎంపిక చేశారు.

బ్యూటీ పార్లర్ పేరుతో ఘరానా మోసం

ఫ్రాంఛైజీలంటూ రూ.3 కోట్లు వసూలు
నలుగురు నిర్వాహకులు అరెస్టు
పరారీలో ముగ్గురు ప్రధాన నిందితులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బ్యూటీ పార్లర్ పేరుతో ఆకర్షించారు. ఫ్రాంఛైజీలంటూ ఉమ్మడి మెదక్ జిల్లాలోని బాధితుల నుంచి దాదాపు రూ.3 కోట్లు వసూలు చేసి పరారయ్యారు. ఆలస్యంగా వెలుగు చూసిన కిలాడీ దంపతుల ఘరానా మోసం వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పరిధిలోని ప్రగతినగర్‌లో నివాసమున్న సమీనా, ఇస్మాయిల్ దంపతులు రోజ్ గోల్డ్ బ్యూటీపార్లర్ అకాడమీ పేరుతో యూట్యూబ్‌లో ప్రకటనలు అప్‌లోడ్ చేసి అమాయకుల దృష్టిని ఆకర్షించారు. ఫ్రాంఛైజీ తీసుకుంటే బ్యూటీషియన్ కోర్సు నేర్పించి ఏజెన్సీ నుంచి కొన్ని ప్రొడక్ట్స్ ఇచ్చి నెలకు రూ.35 వేల జీతం ఇస్తూ.. బిజినెస్ చేయిస్తామని నమ్మించారు. దీనిని నమ్మి మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలో వందల సంఖ్యలో సభ్యులు చేరారు. ఒక్కో బ్యూటీ పార్లర్ ఫ్రాంఛైజీ కోసం రూ.2.70 లక్షలు చొప్పున వారి నుంచి దాదాపు రూ.3కోట్లు వసూలు చేశారు. ఫ్రాంఛైజీ తీసుకున్న వారికి ఐదారు నెలలపాటు జీతం ఇచ్చారు. ఆ తర్వాత రేపు, మాపు అంటూ కాలం వెళ్లదీశారు. అనుమానంతో మెదక్ జిల్లాకు చెందిన 10 మంది బాధితులు ప్రగతినగర్‌లోని హెడ్‌ఆఫీస్‌కు వెళ్లి చూడగా కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో మోసపోయామని గ్రహించారు. ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా బాచుపల్లి పోలీసుల సూచన మేరకు గత నెల 30న మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన మెదక్ సీఐ దిలీప్‌కుమార్ గురువారం సంస్థ నిర్వాహకులు ప్రేమకుమారి, దేవిక, రవి, విశ్వతేజలను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితులైన సమీనా, ఇస్మాయిల్, జానీ పాషా పరారీలో ఉన్నట్లు సీఐ వెల్లడించారు.

సాహితీవేత్త భాగవతుల కన్నుమూత



విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సాహితీవేత్త, గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని 'ఓలి' పేరుతో ఆంగ్లంలోకి అనువదించిన భాగవతుల రాధాకృష్ణమూర్తి శుక్రవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన వయస్సు 82 సంవత్సరాలు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో జన్మించిన రాధాకృష్ణమూర్తి వృత్తిరీత్యా మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా పనిచేశారు. పదవీ విరమణ అనంతరం విశాఖ నగరంలోని రుషికొండలో స్థిరపడ్డారు. అనారోగ్యానికి గురికావడంతో కొద్దికాలంగా హైదరాబాద్‌లోని పిల్లల వద్ద ఉంటున్నారు. శుక్రవారం తుదిశ్వాస విడిచారు. రాధాకృష్ణమూర్తి మృతికి విశాఖ రచయితల సంఘం తరఫున బీవీ అప్పారావు నివాళులర్పించారు.

విద్యుత్ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తే మెరుపు సమ్మె

● టీఎస్‌పీఈజేఏసీ ఆధ్వర్యంలో నిరసన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తే మెరుపు సమ్మెకు పూనుకుంటామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈజేఏసీ) నాయకులు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ రంగ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్‌మోర్చా, సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ తలపెట్టిన దేశవ్యాప్త ఆందోళనకు మద్దతుగా ఖైరతాబాద్ టీఎస్ఎస్‌పీడీసీఎల్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు భోజన విరామ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్ల కార్డులతో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌పీఈజేఏసీ నాయకులు రత్నాకర్‌రావు, గోవర్ధన్, తులసి నాగరాణి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను ప్రైవేట్ పరం చేయకుండా అడ్డుకునే వారికే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, ఈశ్వరరావు, గాంబో నాగరాజు, వెంకట నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతిరాణి, తదితరులు పాల్గొన్నారు.

అక్కడ ఆరులైన్ల రోడ్డు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు మియాపూర్ ఎక్స్‌రోడ్డు నుంచి గండిమైసమ్మ వరకు గల ప్రధానరోడ్డును ఆరులైన్లుగా విస్తరించనున్నారు. హెచ్ఎండీఏ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సుమారు రూ.104కోట్ల వ్యయంతో పనులు చేపట్టడానికి అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, జనావాసాలు పెరగడంతో గ్రేటర్‌హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాలు అత్యంత రద్దీగా మారుతున్నాయి. దాంతో ట్రాఫిక్ రద్దీ కూడా పెరిగింది. ఈక్రమంలో రోడ్డు విస్తరణలు చేపట్టాలని డిమాండ్‌లు పెరుగుతున్నాయి. ఇప్పటికే హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో బీరంగూడ-రామకృష్ణాపురం, పెద్దఅంబర్‌పేట నుంచి పసుమాముల, బాచుపల్లి-మల్లంపేట- బహదూర్‌పల్లి, ఉప్పల్ నల్లచెరువు నుంచి పీర్జాదిగూడ కార్పొరేషన్‌లోని పర్వాతాపూర్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టారు.

ఏడాదిన్నర క్రితం పాలనా అనుమతులు


మియాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి గండిమైసమ్మ ఎక్స్ రోడ్డు వరకు ఆరు లైన్ల రోడ్డును విస్తరించాలన్న స్థానికుల డిమాండ్ నేపథ్యంలో 2022 అక్టోబర్ 29న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.135 కోట్లతో అనుమతులిచ్చింది. జీఓ ఎంఎస్ నెం.195ను జారీ చేసింది. హెచ్ఎండీఏలో వరుసగా భూములు, ప్లాట్ల వేలం తదితర పనుల నేపథ్యంలో విస్తరణ పనులు కార్యరూపం దాల్చలేదు. తాజాగా ఆ పనులను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. దీంతో నిలిచిన టెండర్ ప్రక్రియను హెచ్ఎండీఏ అధికారులు వేగవంతం చేశారు.

మరో 30 ప్రాంతాల్లో..

ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని నిజాంపేట, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లతో పాటు పెద్దఅంబర్‌పేట, తుర్కయాంజల్, కొంపల్లి, మణికొండ, జల్‌పల్లి, తెల్లాపూర్, అమీన్‌పూర్, పోచారం, దుండిగల్, నార్సింగి మున్సిపాలిటీ తదితర 30 ప్రాంతాల్లో రద్దీగా ఉండే రోడ్లను హెచ్ఎండీఏ అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులను అధ్యయనం చేసి విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

కిస్‌వాహ్ నగల దొంగలు బైక్ రైడర్స్

● ముగ్గురి అరెస్టు ● రూ.24 లక్షల బంగారు నగలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీ జానకీ ధరావత్, పోలీసు ఉన్నతాధికారులు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని కిస్‌వాహ్ జువెలర్స్‌లో దోపిడీకి పాల్పడ్డ ముగ్గురు ర్యాపిడో రైడర్స్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.24లక్షల విలువ గల 330గ్రాముల బంగారు నగలు, 124 గ్రాముల వెండి వస్తువులు, మూడు బైక్‌లు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు ఫేస్ మాస్కులను స్వాధీనం చేసుకున్నారు. సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీ జానకీ ధరావత్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. ముంబైకి చెందిన నజీమ్ అజీజ్ కొటాడియా (36) కొంపల్లిలోని స్కై గార్డెన్‌లో నివాసముంటూ ర్యాపిడో బైక్ రైడర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని వద్ద సహాయకులుగా ఉత్తర్‌ప్రదేశ్ ఘాజీపూర్ జిల్లా ఎస్పీపూర్ గ్రామానికి చెందిన షౌకత్ రైనీ (19), వారిస్ (18) పనిచేస్తున్నారు. వీరిద్దరూ జీడిమెట్లలోని సుభాష్‌నగర్‌లో నివాసముంటున్నారు. ఇటీవల నజీమ్ ర్యాపిడో బైక్‌పై కస్టమర్‌ను మలక్‌పేట, అక్బర్‌బాగ్‌లో దింపడానికి వచ్చాడు. ఆ సమయంలో కిస్‌వాహ్ జువెలర్స్‌లో ఒకే వ్యక్తి ఉన్నట్లుగా గుర్తించాడు. దోపిడీ చేసేందుకు నిర్ణయించుకుని తన సహాయకులకు తెలిపాడు.

వారం రోజులు రెక్కీ...

నజీమ్ తన సహాయకులు షౌకత్ రైనీ, వారిస్‌లతో వారం రోజులపాటు రెక్కీ నిర్వహించాడు. ఈనెల 14న ముగ్గురూ వేర్వేరుగా బయల్దేరి మలక్‌పేట రైల్వేస్టేషన్ పార్కింగ్‌లో ఓ బైక్‌ను, జువెలర్స్ షాపునకు సమీపంలో మరో బైక్‌ను పార్క్ చేశారు. షౌకత్ రైనీ కొనుగోలుదారుడిగా దుకాణంలోకి వెళ్లగా షాపు యజమాని కుమారుడు షాజీ ఉర్ రెహమాన్ నగలు చూపించాడు. అదే సమయంలో నజీమ్, వారిస్‌లు ముఖానికి మాస్కులు ధరించి షాపులోకి వస్తూనే కత్తితో రెహమాన్‌పై దాడికి పాల్పడ్డారు. అనంతరం నిందితులు ముగ్గురూ నగలను తీసుకుని ఒకే బైక్‌పై పారిపోయారు. మధ్యలో ఆటోలోకి మారి రామంతాపూర్, ఉప్పల్ మీదుగా కొంపల్లికి వెళ్లి నగలను భద్రపరిచారు. అదే రోజు సాయంత్రం మలక్‌పేట రైల్వేస్టేషన్‌లో పార్క్ చేసిన ర్యాపిడో బైక్ కోసం ముగ్గురూ క్యాబ్‌లో వచ్చారు. కేసు దర్యాప్తు చేపట్టిన చాదర్‌ఘాట్ క్రైం, సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. వారొచ్చిన క్యాబ్ డ్రైవర్‌ను విచారించి అతడిచ్చిన సమాచారంతో కొంపల్లిలో భద్రపరిచిన నగలను స్వాధీనం చేసుకున్నారు. సంఘటన జరిగిన 16 గంటల్లోనే నిందితులను పట్టుకున్నారు. నిందితుడు నజీమ్ అజీజ్ కొటాడియా 2015 నుంచి 2022 వరకు అమెరికాలో బైక్ రైడర్‌గా పనిచేసినట్టు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు నగల షాపులో చోరీ చేయాలని పథకం వేసి పోలీసులకు చిక్కాడు. నిందితులను పట్టుకున్న సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్, క్రైం ఇన్‌స్పెక్టర్ సంజయ్ బృందాలను, జోన్ అదనపు డీసీపీ మనోహర్, మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డిని డీసీపీ జానకీ ధరావత్ ప్రశంసించారు.

ట్యాంకర్ల కోసం రోజూ 1500 బుకింగ్‌లు

(5వ పేజీ తరువాయి)

ఆధారంగా మారింది. ఈ నేపథ్యంలో వాటర్‌బోర్డు ట్యాంకర్లను బుక్ చేసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో రోజుకు 500 నుంచి 700ల వరకు ఉండే ట్యాంకర్ల బుకింగ్‌లు, ప్రస్తుతం రెండింతలు పెరిగాయి. ఈక్రమంలో ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద ట్యాంకర్లు బారులు తీరుతున్నాయి. ప్రస్తుతం వచ్చే బుకింగ్‌ల ఆధారంగా ట్యాంకర్లను వాటర్‌బోర్డు సరఫరా చేస్తున్నా, రోజుకు కనీసం 400 వరకు పెండింగ్‌లో ఉంటున్నాయి. బుక్ చేసిన 24 గంటలు తర్వాత కూడా సరఫరా చేసే పరిస్థితి కనిపించడం లేదు. మున్ముందు రోజుకు 2 వేల నుంచి 4వేలకు పైగా బుకింగ్‌లు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేస్తున్నారు.

సరఫరాపై ట్రాఫిక్ ఆంక్షల ఎఫెక్ట్

నగరంలో ట్రాఫిక్ పెరిగిన నేపథ్యంలో పోలీసులు వాటర్‌బోర్డు ట్యాంకర్లపై ఆంక్షలు విధించారు. నగరంలో సుమారు 600 వరకు ట్యాంకర్లు ఉండగా ఇందులో చాలా వరకు పర్మిట్ గడువు కూడా తీరింది. పలువురు డ్రైవర్లకు లైసెన్స్‌లు కూడా లేవు. పర్మిట్‌లేని ట్యాంకర్లు నగరంలోని రోడ్లపై తిరుగుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్యాంకర్లు పెద్దఎత్తున రోడ్లపైకి వస్తుండడంతో ట్రాఫిక్‌జామ్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో పోలీసులు వాటర్‌బోర్డు ట్యాంకర్లపై ఆంక్షలు విధించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు ట్యాంకర్లు రోడ్డెక్కకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆంక్షల నేపథ్యంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ఆలస్యం అవుతోంది.



ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో రాష్ట్ర పోలీసులకు పతకాల పంట

» సీఎం రేవంత్ రెడ్డి అభినందన

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు సత్తా చాటారు. లక్నోలో ఈ నెల 12 నుంచి 16 వరకు జరిగిన 67వ 'ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్'లో పతకాల పంట పండించారు. ఆయా విభాగాల్లో జరిగిన పోటీల్లో ఐదు బంగారు, ఏడు వెండి పతకాలు సాధించారు. అలాగే ఈ టోర్నీకి సంబంధించి 'ఓవరాల్ చాంపియన్ షిప్' సాధించినందుకు రాష్ట్ర పోలీసులు 'చార్మినార్ ట్రోఫీ'ని అందుకున్నారు. జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కు ఒక వెండి, మూడు కాంస్య పతకాలు, మూడో స్థానంలో నిలిచిన ఐటీబీపీ సిబ్బందికి ఒక బంగారు, నాలుగు కాంస్య పతకాలు దక్కాయి. యూపీ సీఎం యోగి చేతుల మీదుగా విజేతలు ట్రోఫీని అందుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర పోలీస్‌లను సీఎం రేవంత్ అభినందించారు.

వీధి కుక్కల్ని వెంటాడి.. తుపాకీతో వేటాడి!

» 18 శునకాల మృత్యువాత
» మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన

మహబూబ్‌నగర్/అడ్డాకుల, ఫిబ్రవరి 16: ఇంట్లోంచి బయట అడుగుపెడితే వెంబడించి కరుస్తున్నాయన్న కారణంతో ఊర్లోనే కొందరు చేసిన పనా? లేదంటే.. కుక్కకాటుతో తమ ఆప్తుల్లో ఎవరైనా ఆస్పత్రి పాలయ్యారనే ఆగ్రహంతో సాగించిన వేటా? లేదంటే.. చోరీలకు 'అడ్డు'గా ఉన్నాయని దొంగలు పని గట్టుకొని చేశారా? తెలియదు గానీ.. వీధి కుక్కలపై తుపాకీ మోత మోగింది. పథకం ప్రకారం అర్ధరాత్రి పూట కారులో గ్రామంలోకి చొరబడిన కొందరు వీధి కుక్కలను వెంటాడి మరీ కాల్పులు జరిపారు. అరగంటకుపైగా వీధి వీధినా తిరుగుతూ బీభత్సం సృష్టించారు. ఈ ఘటనలో 18 కుక్కలు మృతిచెందాయి. మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గురువారం అర్ధరాత్రి తర్వాత 1.25 గంటలకు కారులో నలుగురు వ్యక్తులు ముసుగులు ధరించి గ్రామంలోకి చొరబడ్డారు. లోకల్‌మేడ్ తుపాకులతో కనిపించిన కుక్కలపై గుళ్ల వర్షం కురిపించారు. అరగంట పాటు గ్రామం అంతా తిరుగుతూ కాల్పులు జరిపారు. కుక్కల అరుపులు, గన్ శబ్దాలతో బయటకొచ్చిన గ్రామస్తులు జరిగిన ఘటనను చూసి భయంతో ఇళ్లలోకి వెళ్లిపోయి తలుపులు వేసుకున్నారు. కొందరు ఇళ్లపై ఎక్కి చూశారు. వచ్చిన దుండగులు.. 2.08 గంటలకు పని ముగించుకొని వచ్చిన కారులోనే వెళ్లిపోయారు. దుండగులొచ్చింది బ్రెజా కారులో అని చెబుతున్నారు. శుక్రవారం ఉదయం పోలీసులు, పశుసంవర్ధక శాఖ అధికారులు క్లూస్ టీమ్‌తో గ్రామానికి చేరుకొని ప్రజలను విచారించారు. వెటర్నరీ డాక్టర్ రాజేశ్‌ఖన్నా ఆధ్వర్యంలో గ్రామ స్మశాన వాటిక వద్ద కుక్కల కళేబరాలకు పంచనామా నిర్వహించారు. శాంపిళ్లను హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. కుక్కల కళేబరాల్లో చిన్న సైజు బుల్లెట్లను పోలీసులు గుర్తించారు. గ్రామ కార్యదర్శి విజయరామరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కంట్రీమేడ్ గన్ ఉపయోగించి కుక్కలను చంపారని, నిందితులను పట్టుకోవడానికి విచారణ వేగవంతం చేశామని ఎస్సై శ్రీనివాస్ చెప్పారు. అయితే.. కుక్కలను ఎందుకు చంపారనేది మిస్టరీగా మారింది.

మేడారం జాతరకు 3కోట్ల కేంద్ర నిధులు

ప్రకటించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. జాతరకు ప్రత్యేక రైళ్లు.. రేపటి నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]


జంపన్నవాగు వద్ద భక్తజనం

గిర్మాజిపేట, వరంగల్, మేడారం/సుబేదారి, ఫిబ్రవరి 16: మేడారం మహా జాతరకు కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో 'మేడారం జాతరకు కేంద్రం మొండిచేయి' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో సర్కారు స్పందించింది. జాతర కోసం 21 నుంచి ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో రోజూ ఉదయం 9:52 గంటలకు బయలుదేరి వరంగల్‌కు ఒంటి గంటకు చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 1:55 గంటలకు వరంగల్ నుంచి బయలుదేరుతుంది. ఈ 21 నుంచి 25 వరకు నడుస్తుంది. నిజామాబాద్ నుంచి మేడారం రైలు ఈ నెల 21 నుంచి 24 వరకు సికింద్రాబాద్ మీదుగా వరంగల్ వరకు నడుస్తుంది. రోజూ ఉదయం 7:05 గంటలకు నిజామాబాద్‌లో బయలుదేరి సికింద్రాబాద్‌కు 11 గంటలకు, వరంగల్‌కు 1:45 గంటలకు చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు వరంగల్‌లో బయలుదేరి రాత్రి 10:30 గంటలకు నిజామాబాద్ చేరుతుంది. కాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్ల వద్ద మేడారం వెళ్లేందుకు ఆర్టీసీ బస్‌స్టేషన్లను ఏర్పాటు చేసింది. పలు జిల్లాల నుంచి శనివారం నుంచి మేడారానికి 6 వేల బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇక మేడారంలో 55 ఎకరాల్లో తాత్కాలికంగా ఆర్టీసీ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. కాగా, మరో ఐదు రోజుల్లో మేడారం మహా జాతరకు తెరలేవనుంది. ఆలోపే అక్కడ జాతర వాతావరణం కళ్లకు కడుతోంది. పుట్టపగిలి చీమలొచ్చినట్లు జంపన్నవాగు, వనదేవతల గద్దెల వద్ద విశేష సంఖ్యలో భక్తులు కనిపిస్తున్నారు. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్ల మధ్య శివసత్తుల పూనకాలు, బాజా భజంత్రీల హోరుతో మేడారం పరిసరాలు మార్మోగుతున్నాయి.

వైద్యాధికారికి లంచాల రోగం

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 16: లంచం తీసుకుంటూ నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చునాయక్ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) వలకు చిక్కారు. ఆస్పత్రికి నాన్‌టెండర్ సర్జికల్, డ్రగ్స్ సరఫరా చేసే కాంట్రాక్టర్ నుంచి శుక్రవారం లచ్చునాయక్ తన ఇంట్లో రూ.3లక్షలు తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. నల్లగొండలోని రవి మెడికల్ డిస్ట్రిబ్యూటర్ రాపోలు వెంకన్న ఎల్-1 కాంట్రాక్టర్. రెండేళ్ల కిందట జేసీ అధ్యక్షతన గల కొనుగోలు కమిటీ ద్వారా ఆస్పత్రికి అవసరమయ్యే మందుల సరఫరాకు సంబంధించిన టెండర్ దక్కించుకున్నాడు. టెండర్ ప్రకారం మందులు సరాఫరా చేయడమే కాకుండా గత మార్చి నుంచి అధికారుల ఆదేశానుసారం నాన్‌టెండర్‌లోని అత్యవసర సర్జికల్, డ్రగ్స్‌ను కూడా డిస్కౌంట్ మేరకు సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చునాయక్ నాన్‌టెండర్ సర్జికల్, డ్రగ్స్ సరఫరా విషయంలో సదరు డిస్ట్రిబ్యూటర్‌ను మందుల సరఫరాకు టెండర్ పిలుస్తానని వేధిస్తున్నారు. టెండరు లేకుండా సరఫరా చేయాలంటే లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు వెంకన్న 45 రోజుల కిందట రూ.లక్ష, ఆ తర్వాత 10 రోజుల తర్వాత మరో రూ.లక్ష సూపరింటెండెంట్‌కు ఇచ్చాడు. అయినా సూపరింటెండెంట్ వేధింపులు ఆగలేదు. మరో రూ.3 లక్షలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశాడు. దీంతో వెంకన్న ఏసీబీని ఆశ్రయించాడు. అధికారుల సూచన మేరకు వెంకన్న శుక్రవారం రూ.3లక్షల నగదును సూపరింటెండెంట్ లచ్చునాయక్ ఇంటికి వెళ్లి ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

చంద్రబాబు నివాసంలో రాజశ్యామల యాగం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో శుక్రవారం రాజశ్యామల యాగాన్ని చేపట్టారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో మూడు రోజుల పాటు ఈ యాగం జరగనున్నది. తొలి రోజు జరిగిన యాగం క్రతువు, పూజా కార్యక్రమాల్లో చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి పాల్గొన్నారు.

జగన్‌రెడ్డీ నీ సినిమా అయిపోయింది

'జగన్‌రెడ్డీ నీ సినిమా అయిపోయింది. అసలు సినిమా ఇప్పుడు మొదలవుతుంది... కాస్కో..!' అని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. 'రాజధాని ఫైల్స్' సినిమా ప్రదర్శనకు హైకోర్టు అనుమతించిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ తెలుగు ప్రజలంతా ఆ సినిమా చూడాలని, వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. 'ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి రాష్ట్ర రాజధానిపై పగబట్టి సర్వనాశనం చేసిన ప్రాంతం అమరావతి. ఈ కుట్రలకు, దారుణాలకు అద్దం పట్టిన చిత్రం 'రాజధాని ఫైల్స్'. అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర హితం కోరే వారంతా 'రాజధాని ఫైల్స్' సినిమాను చూడాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కోరారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన చేస్తూ... 'గొప్ప సందేశాత్మక చిత్రమిది. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో జరుగుతున్న యదార్థ సంఘటనల్ని చిత్రీకరించడం నిజంగా అభినందనీయం' అని అచ్చెన్న పేర్కొన్నారు.

వచ్చే వారమే ఎన్డీయేలోకి టీడీపీ!

» 19 లేదా 20న ఢిల్లీకి బాబు, పవన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వచ్చే వారమే ఎన్డీయేలో తిరిగి చేరనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఈనెల 19న గానీ, 20న గానీ దేశ రాజధాని ఢిల్లీ వచ్చే అవకాశాలున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేసేందుకు శని, ఆదివారాల్లో ఇక్కడ బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగనున్నాయి. ఇవి పూర్తయిన వెంటనే పొత్తులపై వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని బీజేపీ అగ్ర నేతలు భావిస్తున్నారు. తెలుగుదేశం, జనసేన నేతలతో ఈ నెల 20న లాంఛనంగా చర్చలు ఉండవచ్చని తెలుస్తోంది. ఏయే పార్టీ ఎన్ని సీట్లకు పోటీ చేయాలో ఇప్పటికే మూడు పార్టీల మధ్య అవగాహన కుదిరిందని, ఏయే స్థానాల్లో బరిలోకి దిగాలో కూడా ఒక అభిప్రాయానికి వచ్చారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా.. ఎన్డీయేలో చేరే ఇతర పార్టీల అధినేతలందరినీ పిలిచి విస్తృత భేటీ ఏర్పాటు చేయాలని కమలనాథులు భావిస్తున్నారు.


ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

'అధిక దిగుబడుల'పై రిసెర్చ్ చేయండి

» శాస్త్రవేత్తలకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సూచన
» రాజేంద్రనగర్‌లో అగ్రి టెక్ సౌత్-2024 ప్రదర్శన ప్రారంభం

రాజేంద్రనగర్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): రైతాంగం అధిక దిగుబడులు సాధించే దిశగా పరిశోధనలు చేపట్టాలని శాస్త్రవేత్తలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. భారత పరిశ్రమల సమాఖ్య, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు రాజేంద్రనగర్‌లో నిర్వహించనున్న అగ్రి టెక్ సౌత్-2024 వ్యవసాయ ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ప్రతి సంవత్సరం అగ్రిటెక్ సౌత్ పేరుతో చేపడుతున్న వ్యవసాయ ప్రదర్శన ద్వారా లక్షలాది మంది రైతులకు ఉపయోగం కలుగుతోందని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవి సుబ్బారెడ్డి తెలిపారు.

విశ్వవిద్యాలయం భూములలో హైకోర్టు నిర్మించొద్దు

రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన భూములలో హైకోర్టు భవనం నిర్మించొద్దు అని కోరుతూ వర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్స్, విద్యార్థి సంఘాల నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

గృహజ్యోతికి ఆధార్ సేకరణకు చట్టబద్ధత

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు కరెంట్ వినియోగించేవారికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో లబ్ధిదారులకు సంబంధించిన ఆధార్ వివరాలను సమీకరించడానికి చట్టబద్ధత పొందాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆధార్‌యాక్ట్-2016లోని సెక్షన్-7 ప్రకారం ఆధార్‌తోపాటు ఇతర చట్టాల (సవరణ) యాక్ట్-2019 ప్రకారం నోటిఫికేషన్ ఇస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ శుక్రవారం జీవో నంబరు6ను జారీ చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆర్థికంగా ప్రయోజనం పొందే పథకాలకు మాత్రమే ఆధార్ వివరాలు సేకరించడానికి చట్టబద్ధత ఉంది. అయితే తాజా నోటిఫికేషన్‌తో గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల నుంచి డిస్కమ్‌లు ఆధార్ వివరాలు స్వీకరించనున్నాయి.

సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లకు శిక్షణ ఇచ్చి..

టీఎస్ఎస్‌పీపై వివక్షా?: ప్రవీణ్‌కుమార్

ఒకే నోటిఫికేషన్ ద్వారా సివిల్, ఏఆర్, టీఎస్ఎస్‌పీ(తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్) విభాగాలకు కానిస్టేబుల్‌గా ఎంపికైతే ప్రభుత్వం కేవలం సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లకు మాత్రమే శిక్షణ ఇస్తూ.. టీఎస్ఎస్‌పీ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వకపోవడం వివక్షేనని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. దీని వల్ల టీఎస్ఎస్‌పీకి ఎంపికైన అభ్యర్థులు రెండేళ్ల సర్వీసును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వారి సర్వీసును మిగిలిన వారితో సమానంగా చూడాలని, వారితోపాటే వేతనాలు చెల్లించాలని కోరారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

- పోస్టుకార్డుల ద్వారా రాష్ట్రపతికి టీడీపీ నేతల అభ్యర్థన

ఖమ్మం మామిళ్లగూడెం, ఫిబ్రవరి 16: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం నందమూరి తారకరామారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్నను ప్రకటించాలని ఖమ్మం పార్లమెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో కేతినేని ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోస్టుకార్డులను రాష్ట్రపతికి పంపించారు.

ఆండ్రాయిడ్ ఆధారిత యంత్రాలతో మీటర్ రీడింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల జారీ విధానంలో కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలని దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెలా డిస్కమ్‌లు రీడింగ్ తీసే కనెక్షన్లు 1.54 కోట్ల దాకా ఉన్నాయి. డేటాను మరింత కచ్చితంగా రాబట్టుకోవడంలో భాగంగా ఆండ్రాయిడ్ ఆధారిత సాఫ్ట్‌వేర్‌తో పని చేసే 'ఇంటిగ్రేటెడ్ ఆల్ ఇన్ వన్ ఎలక్ట్రిసిటీ బిల్లింగ్ యంత్రాలు' సమకూర్చుకోవాలని ఎస్పీడీసీఎల్ యోచిస్తోంది. ఇందుకోసం ఆధునిక బిల్లింగ్ యంత్రాలను సమకూర్చే సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. సరఫరాదారులతో ఈనెల 22న హైదరాబాద్‌లోని విఎంట్‌కాంపౌండ్‌లో సమావేశం జరగనుంది. దక్షిణ డిస్కమ్ పరిధిలో 4వేల దాకా యంత్రాలు అవసరం. ప్రస్తుతం ఇన్‌ఫ్రారెడ్(ఐఆర్) టెక్నాలజీతో మీటర్ రీడింగ్ తీస్తున్నారు. దీంతో మీటర్ ముందు యంత్రం పెట్టగానే బిల్లు జనరేట్ అవుతుంది. ఈ యంత్రాలతో ఒక ఉద్యోగి రోజుకు 200 కనెక్షన్లకు మాత్రమే రీడింగ్ తీసే అవకాశం ఉండగా...ఆండ్రాయిడ్ ఆధారిత యంత్రాలతో రోజుకు 400 దాకా కనెక్షన్లకు బిల్లులు జారీ చేయవచ్చు.

వేలంలోనే బొగ్గు గనుల కేటాయింపు:

- కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బొగ్గు గనులు కావాలంటే వేలం పాటలో పాల్గొనాల్సిందేనని కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా స్పష్టం చేశారు. 2020లో తెచ్చిన మార్గదర్శకాల ప్రకారం... ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఏవైనా వాటికి వేలం పాట ద్వారానే గనులు కేటాయిస్తామని తెలిపారు. కోల్/లిగ్నైట్ గ్యాసిఫికేషన్‌పై వివిధ వర్గాలతో సంప్రదింపుల కోసం హైదరాబాద్ వచ్చిన ఆయన ఆ కార్యక్రమం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 893 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని, వచ్చే ఏడాది ఒక బిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తామని వెల్లడించారు. 7 రౌండ్లలో 91 బొగ్గు బ్లాకులను వేలం వేశామని, బొగ్గు ఉత్పత్తికి 51 నెలల గడువు ఉండగా... పలు బ్లాకులు 31 నెలల్లోనే ఉత్పత్తిని ప్రారంభించాయని చెప్పారు. ఆ తర్వాత సింగరేణి భవన్‌కు చేరుకొని సింగరేణి కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. సింగరేణి కొత్త గనులకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కోల్‌బెల్ట్‌లోని మూడు గనులను సింగరేణికే కేటాయించాలని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరాం ఈ సందర్భంగా ఆయనను కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలో..

ఆర్థికమంత్రిగా హరీశ్‌రావు పేరు!

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలో రాష్ట్ర ఆర్థిక మంత్రిగా హరీశ్‌రావు పేరును ప్రస్తావించడం వివాదంగా మారింది. ఈ విషయంలో బోర్డు అధికారులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వస్తున్నాయి. ఇంటర్మీడియట్ విద్యకు సంబంధించి ఇంగ్లిష్ సబ్జెక్టులో మొదటిసారి ప్రాక్టికల్స్‌ను ప్రారంభించారు. ఈ ప్రాక్టికల్స్‌కు 20 మార్కులను కూడా కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం పరీక్ష నిర్వహించారు. అయితే..ఈ ప్రాక్టికల్ కోసం 2022లో ప్రయోగ దీపిక మాదిరిగా ఒక వర్క్ బుక్‌ను ముద్రించారు. ఇంగ్లిష్ భాషలో రాయడం, చదవడం వంటి వాటి విషయంలో విద్యార్థులకు మెరుగైన అవగాహనను కల్పించడం కోసం దీనిని రూపొందించారు. శుక్రవారం నిర్వహించిన ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలో చూసి చదవడం అనే అంశంపై వర్క్‌బుక్‌లోని పేరా-26ను ప్రశ్న రూపంగా విద్యార్థులకు ఇచ్చారు. ఇందులో.. సిద్దిపేటలో స్వచ్ఛ బడి కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్థిక మంత్ర హరీశ్‌రావు ప్రారంభించినట్లు ఉంది.బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఈ బుక్‌ను ముద్రించారు. గతంలో ముద్రించిన పుస్తకంలోని పేరాను ప్రాక్టికల్‌లో ప్రశ్నగా ఇవ్వడంతో వివాదం నెలకొంది. అయితే.. ఇది తాము ఉద్దేశంగా చేసింది కాదని అధికారులు పేర్కొంటున్నారు.

బీజేపీతో పొత్తున్నా.. 'మల్కాజిగిరి' మాదే

- బండిసంజయ్‌తో అయ్యేదిలేదు.. పొయ్యేదిలేదు: మల్లారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): "బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటే.. మా పార్టీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారంటూ.. బండి సంజయ్ ఎందుకంటారు. ఆయనవి మాటలే తప్ప ఆయనతో అయ్యేది లేదు.. పొయ్యేది లేదు. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తున్నా.. మల్కాజిగిరి ఎంపీ టికెట్ మాదే" అని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో చిట్ చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుత పరిణామాలపై హాట్ కామెంట్స్ చేశారు. మల్కాజిగిరి ఎంపీ టికెట్ భద్రంగా ఉందని పేర్కొన్నారు. "నా కుమారునికి టికెట్ ఇస్తే కుటుంబం అని ప్రచారం చేయడం తగదు. మా అల్లుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కుటుంబం వేరు. మా కుటుంబం వేరు. అందరినీ కలిపి కుటుంబం అని అనడం సరికాదు" అని అభిప్రాయపడ్డారు. అదే విధంగా తన వర్సిటీలలో అక్రమ కట్టడాలు ఉంటే ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చని, కావాలని తనపై కక్ష సాధించాలనుకుంటే ఏమీ చేయలేనని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా సయ్యద్ అజ్మతుల్లా హుసేని



హైదరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా సయ్యద్ అజ్మతుల్లా హుసేని ఎన్నికయ్యారు. చైర్మన్‌ను ఎన్నుకునేందుకు వక్ఫ్ బోర్డు డైరెక్టర్లు శుక్రవారం హజ్‌హౌస్‌లో సమావేశమయ్యారు. చైర్మన్‌గా పోటీలో ఆయన ఒక్కరే ఉండటం, డైరెక్టర్లంతా మద్దతు పలకడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. హైదరాబాద్ మల్లెపల్లికి చెందిన హుసేని ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో పలు పదవులు చేపట్టారు. 2016 నుంచి 2021 వరకు యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, జాతీయ అధికార ప్రతినిధిగానూ పనిచేశారు. పీసీసీ ప్రచార కమిటీకి ప్రస్తుతం కన్వీనర్‌గా ఉన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ భూముల పరిరక్షణ, అన్యాక్రాంతమైన భూముల స్వాధీనంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని చైర్మన్‌గా ఎన్నికైన అనంతరం పేర్కొన్నారు. చైర్మన్‌గా అవకాశం కల్పించినసీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చేతిలోని భూమి.. రికార్డుల్లో హుష్‌కాకి!

నకిలీ పత్రాలతో దొంగ రిజిస్ట్రేషన్లు .. అధికార్లను కట్టుకొని మ్యుటేషన్లు.. చక్రం తిప్పిన కీలక ప్రజాప్రతినిధి

- రెవెన్యూ రికార్డుల్లో రైతు పేరు మాయం
- కోర్టు ఆదేశాలను లెక్క చేయని వైనం
- రామేశ్వరంబండలో కేటుగాళ్ల బరితెగింపు
- వారసులమంటూ ఫోర్జరీ పత్రాల సృష్టి
- స్టే ఆర్డర్ ఉన్నా అడ్డగోలు బెదిరింపులు



రామేశ్వరంబండ సర్వే నెంబర్ 67లోని పట్టా భూములు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చేతిలో అధికారం ఉందన్న ధీమాతో ఫోర్జరీ పత్రాలను సృష్టించి కోట్ల రూపాయల విలువైన పట్టా భూములను కొల్లగొట్టే ప్రయత్నం పటాన్‌చెరు సమీపంలోని రామేశ్వరంబండలో వెలుగు చూసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కీలక ప్రజాప్రతినిధి అండతో భూమిని కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. గత ఏడాది శాసనసభ ఎన్నికలకు ముందు స్థానిక ప్రజాప్రతినిధి, రెవెన్యూ అధికారులు కలిసి పటాన్‌చెరు ఓఆర్ఆర్ ప్రాంతంలోని రామేశ్వరం బండలో ఐదెకరాల పట్టా భూమికి సంబంధించి రైతు పేరును హఠాత్తుగా రెవెన్యూ రికార్డులోంచి ఎత్తేయించారు. ఎప్పుడో 45 ఏళ్ల క్రితం కొన్న భూమికి నువ్వు యజమానివి కాదు పొమ్మన్నారు. 2009లో గుట్టు చప్పుడు కాకుండా దొంగ పత్రాలతో ఎవరికీ తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఇద్దరు వ్యక్తుల పేర్ల మీద ఐదెకరాల భూమిని గత ఏడాది జూలైలో మ్యుటేషన్ చేయించారు. అసలు యజమాని తక్షణమే మేల్కొని అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు తెచ్చుకున్నా వాటిని అమలు చేయకుండా నాలా మార్పిడి కూడా చేసేసి, గజాల రూపంలో ఇతర వ్యక్తులకు బదలాయించారు. నిజానికి అక్కడ అసలు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. 2009లో దొంగ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన వారి మీద కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకొని ఆగస్టులో కేసు నమోదు చేసినా దర్యాప్తు మాత్రం ముందుకు సాగడం లేదు.

1968లోనే కొన్నారు

రామేశ్వరంబండ గ్రామంలోని సర్వే నంబర్లు 48నుంచి 55 వరకు, 57నుంచి 76 వరకు, 78 నుంచి 83 వరకు దేశ్‌పాండే అండాళమ్మ పేరుతో మొత్తం 396.39 ఎకరాల భూమి ఉండేది. ఆండాళమ్మ కంచెగా పిలుస్తారు. ఆమె కుమార్తెలు గూడ భారతమ్మ, చేపూరి భార్గవిల నుంచి 1968లో రామినేని రుక్మిణి, మరో 24 మంది రైతులు కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. సర్వే నెంబర్ 67లో 12.07 ఎకరాల భూమిని రామినేని రుక్మిణి సేల్ డీడ్ డాక్యుమెంట్ నెంబర్ 694/1968 ద్వారా కొనుగోలు చేశారు. 1979లో ఆమె అదే భూమిని అట్లూరి భారతాంబ, చాపరాల వెంకటకృష్ణారావులకు విక్రయించారు. అప్పటి నుంచి సదరు భూమిని అట్లూరి భారతాంబ కుమారుడు అట్లూరి వెంకట రమణమూర్తి, చాపరాల వెంకటకృష్ణారావులే సాగు చేసుకుంటున్నారు. మామిడి తోటను పెంచి అంతర పంటలు సాగు చేసుకుంటున్నారు.

2009 వరకు రెవెన్యూ రికార్డుల్లో వారి పేర్లే

భూముల రేట్లు పెరగడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో ల్యాండ్ మాఫియా కన్ను మరోసారి ఈ భూములపై పడింది. ఆండాళమ్మ వారసుల ద్వారా 2009లో జీపీఏ ద్వారా ఐదెకరాల భూమిని విక్రయించినట్లు చూపిస్తున్న డాక్యుమెంట్‌ను ఆధారంగా చేసుకుని రెవెన్యూ రికార్డులను రాత్రికి రాత్రే మార్చేశారు. ఆండాళమ్మ మునిమనవలు జీపీఏ ఇచ్చారంటూ ఫోర్జరీ డాక్యుమెంట్‌ను సృష్టించి నల్గొండ జిల్లా చిట్యాల మండలం రాహులగూడం వాస్తవ్యుడిగా పేర్కొన్న ఆరకంట్ల సాంబశివరావు, నిమ్మనేని సంజీవరావులు తమ పేర్ల మీద రిజిస్టర్ చేసుకున్నారు. జీపీఏ డాక్యుమెంట్లు 9536/2009, 11335/2009లలో అతికించిన ఫోటోలకు ఆండాళమ్మ వారసులకు సంబంధం లేదు. డాక్యుమెంట్లో కేవలం ఫోటోలు తప్ప వారి గుర్తింపు కార్డులను జత చేయకుండా జాగ్రత్త పడ్డారు. ఫోర్జరీ జీపీఏ సృష్టించి భూమిని విక్రయించిన కేటుగాళ్లు పథకం ప్రకారం సైలెంట్‌గా ఉండిపోయారు. వెంచర్లు పుంజుకోవడంతో అక్రమాలకు తెరతీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక కీలక ప్రజాప్రతినిధి అండతో రెవెన్యూ, ధరణి రికార్డులను మార్చేశారు. ఆయన డైరెక్షన్‌లోనే పటాన్‌చెరు తహశీల్దార్ డాక్యుమెంట్లను పరిశీలించకుండానే మ్యూటేషన్లతో పాటు రిజిస్ట్రేషన్లు చేశారు. 2009లో రిజిస్ట్రేషన్‌కు కారణమైన ఫోర్జరీ పత్రాలకు తమకు ఎలాంటి సంబంధం లేదని స్వయంగా ఆండాళమ్మ వారసులే కోర్టులో ధ్రువీకరించినా ఫోర్జరీ పత్రాలను సృష్టించిన కేటుగాళ్లకే రెవెన్యూ యంత్రాంగం వత్తాసు పలికింది.

ఫోర్జరీ పత్రాలతోనే మ్యూటేషన్లు, రిజిస్ట్రేషన్లు

ఫోర్జరీ జీపీఏ డాక్యుమెంట్ ఆధారంగా చేసుకొని 2023 జూన్‌లో అప్పటి సంగారెడ్డి కలెక్టర్ ఆదేశాలతో పటాన్‌చెరు తహశీల్దార్ భూవిని ఆరకంట్ల సాంబశివరావు, నిమ్మనేని సంజీవరావుల పేర్లపై మ్యుటేషన్ చేసి, రికార్డులకు ఎక్కించారు. అప్పటి వరకు రికార్డుల్లో చాపరాల వెంకటకృష్ణా రావు పేరు మీద ఉన్న పట్టా భూమి(పీపీబీవై-317468) మాయమైంది. రెండు రోజుల వ్యవధిలో నాలా మార్పిడి సైతం జరిగిపోయింది. తరువాత సాంబశివరావు తన పేరు మీద ఉన్న నాలా మార్పిడి భూమిని వీరాంజనేయులు, మధుసూదన్, చిరుమామిళ్ల నవీన్, పసుపులేటి మురళి తదితర పేర్ల మీద గజాల రూపంలో రిజిస్ట్రేషన్‌లు చేయడం చకచకా జరిగిపోయాయి. అసలు పట్టాదారులు చాపరాల వెంకటకృష్ణారావు, అట్లూరి వెంకటరమణమూర్తి పేర్లను రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించి ధరణిలో మార్పులు చేయాలని అప్పటికే కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. తమ పేర్ల మీద కోర్టు ఆదేశాల మేరకు మ్యుటేషన్ చేయాలని అప్పటి జిల్లా కలెక్టర్ శరత్‌ను ఆశ్రయించి పట్టాదారులు దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి ఫోర్జరీ జీపీఏ డాక్యుమెంట్ సృష్టించిన వ్యక్తుల పేర్లతో ప్రొసీడింగ్‌లను జారీ చేసి తమ స్వామిభక్తిని ప్రదర్శించారు. ఈ వ్యవహారం వెనక పెద్దఎత్తున డబ్బు చేతులు మారాయని ప్రచారం జరిగింది. భూమిని కొల్లగొట్టేందుకు కుట్రలు చేసిన వ్యక్తులకు తెర వెనక ఓ ప్రజాప్రతినిధి పూర్తి స్థాయిలో వెన్నుదన్నుగా నిలిచారని తెలిసింది. బినామీల పేర్లమీదకు భూమిని మార్పిడి చేసి ఓ బిల్డర్‌కు అప్పగించేందుకు తెరవెనక ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

అసలు డెత్‌సర్టిఫికెట్‌తో గుట్టురట్టు

ఆండాళమ్మ భూములు 396 ఎకరాలను అమ్ముకున్న తర్వాత వారసులు దాన్ని వివాదాస్పదం చేశారు. ఆమె 1965లోనే చనిపోయిందని నకిలీ డెత్ సర్టిఫికెట్ పుట్టించారు. ఆ తర్వాత తేదీలతో జరిగిన రిజిస్ట్రేషన్లు అన్నింటినీ వివాదాస్పదం చేశారు. దాంతో రైతులు కోర్టును ఆశ్రయించి 2010-2013 మధ్య స్టేటస్ కో ఉత్తర్వులు తెచ్చుకున్నారు. తాను కూడా ఆండాలమ్మ వారసురాలినే అంటూ 2014లో లలితాబాయ్ అనే మహిళ వాటా కోసం సూట్ వేసింది. ఆమె మరో నకిలీ డెత్ సర్టిఫికెట్ పట్టుకొచ్చింది. రెండు సర్టిఫికెట్లలో తేదీలు తేడాగా ఉన్నాయి. రెండూ నకిలీవేనని గ్రహించి బాధిత రైతులు దానిపై శోధించారు. 1981, ఫిబ్రవరి 11న ఆండాళమ్మ మృతి చెందిందని తెలుసుకొని, కాచిగూడ లోని హిందూ శ్మశానవాటిక నుంచి ఆండాళమ్మ ఒరిజనల్ డెత్ సర్టిఫికెట్ తెప్పించారు. గతంలో ఆండాళమ్మ 1975లో సీలింగ్ భూముల క్రమబద్ధీకరణ ట్రైబ్యునల్‌కు స్వయంగా హాజరైనట్లు కూడా ఆధారాలు సంపాదించారు. తాము ఇరుక్కుంటున్నామని గ్రహించి ఆండాళమ్మ వారసులుగా చెప్పుకుంటున్న వారంతా కేసును ఉపసంహరించుకుంటున్నట్లు కోర్టుకు అఫిడవిట్‌లు సమర్పించారు. దాంతో 2009లో జరిగిన రిజిస్ట్రేషన్లకు ఫేక్ డాక్యుమెంట్లే ఆధారమని రుజువైంది. దీనికితోడు 2010, 2013లో కోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఆర్డర్ కూడా ఉంది. వీటన్నింటినీ విస్మరించి, ఫోర్జరీ సంతకాలతో గుర్తు తెలియని వ్యక్తులతో సృష్టించిన జీపీఏ హోల్డర్లను రికార్డుల్లోకి ఎక్కించడం గమనార్హం.

విచారణకు పోలీసుల సహాయ నిరాకరణ

రామేశ్వరంబండ భూములకు ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించిన వ్యక్తులను పట్టుకోవాలని సాక్ష్యాత్తు కోర్టు ఆదేశాలు జారీ చేసినా పటాన్‌చెరు పోలీసులు పట్టించుకోవడం లేదు. బాధితులు నేరుగా ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా, అప్పట్లో సదరు ప్రజాప్రతినిధి వత్తిడితో కేసు నమోదు చేసేందుకు పోలీసులు సాహసించలేదు. దీంతో బాధిత రైతులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు రెఫర్ కేసుగా... జీపీఏ చేసుకున్న ఆరకంట్ల సాంబశివరావు, ఎస్.సంజీవరావులపై పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఐపీసీ సెక్షన్లు 406, 419,420, 471, 506 కింద ఆగస్టు 22, 2023న ఎఫ్ఐఆర్ (602/2023) నమోదైంది. నెలలు గడుస్తున్నా కేసులో ఎలాంటి పురోగతి లేదు. డాక్యుమెంట్ ఆధారంగా నిందితులను గుర్తించడంలో తాత్సరం వెనక కారణాలు తెలియడం లేదు. ఫోర్జరీ పత్రాలు సృష్టించి భూములను విక్రయించి పట్టాదారులైన రైతుల జీవితాలతో చెలగాటాలాడుతున్న భూమాఫియాగాళ్ల భరతం పట్టడంలో పోలీసులు వెనకంజ వేస్తున్నారన్న విమర్శలు వ్యక్తవుతున్నాయి. ప్రభుత్వం మారినా భూమాఫియా ఆగడాలకు అడ్డుకట్టపడటం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో పాగా వేసేందుకు కొందరు వ్యక్తులు బెదిరింపులకు దిగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారు. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా అమలుకు నోచుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. రామేశ్వరంబండ గ్రామం సర్వే నెంబర్ 67లో భూమాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేసి నిజమైన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు జిల్లా కలెక్టర్ వల్లూరిక్రాంతి, ఎస్పీ రూపేష్‌లను ఆశ్రయించారు.



సభ్యులెవరూ హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఇబ్రహీంపట్నం చైర్‌పర్సన్‌పై

వీగిన అవిశ్వాసం

- సమావేశానికి హాజరుకాని సభ్యులు
- గంటపాటు వేచి చూసిన పీఓ
- అవిశ్వాసం వీగిపోయిందని ప్రకటన
- మంథని మునిసిపల్‌లో నెగ్గిన అవిశ్వాసం
- పదవులు కోల్పోయిన చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్

ఇబ్రహీంపట్నం/మంథని, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మునిసిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి(కాంగ్రెస్)పై బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో అవిశ్వాసంపై ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశానికి సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయిందని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి ప్రకటించారు. ఉదయం 11 గంటలకు మునిసిపల్ కార్యాలయంలో సమావేశానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 11.30 గంటల వరకు వేచి చూసినా సభ్యులెవరూ హాజరుకాలేదు. దీంతో అరగంట సేపు సమావేశాన్ని వాయిదా వేసి, తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం నిర్వహించారు. అప్పుడు కూడా సభ్యులెవరూ రాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయిందని అనంతరెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం మునిసిపాలిటీలో 24 మంది సభ్యులు ఉండగా.. ఎక్స్‌అఫీషియో సభ్యుడు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిపి సభ్యుల సంఖ్య 25కు పెరిగింది. అవిశ్వాసం నెగ్గాలంటే మూడింట రెండొంతులు అంటే.. 17 మంది సభ్యులు హాజరుకావాల్సి ఉంది. మునిసిపల్ చైర్‌పర్సన్ స్రవంతిపై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన 15 మంది బీఆర్ఎస్, ఇద్దరు బీజేపీ సభ్యుల్లో బీఆర్ఎస్ సభ్యులు శంకరయ్య, జెర్కోని బాల్‌రాజ్‌లు స్రవంతి శిబిరంలో చేరడంతో అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన సభ్యుల సంఖ్య 15కు పడిపోయింది. దాంతో అవిశ్వాస పర్వానికి తెరపడినట్లయింది.

మంథనిలో బీఆర్ఎస్‌కు షాక్..

పెద్దపల్లి జిల్లా మంథని మునిసిపల్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. జడ్పీ చైర్మన్ పుట్ట మధు సతీమణి, మునిసిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్‌చైర్మన్ ఆరెపల్లి కుమార్‌లపై 9 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. మొత్తం 13 మంది కౌన్సిలర్లకు గానూ, మెజార్టీ సభ్యులు అవిశ్వాస నోటీసు ఇవ్వడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రిసైడింగ్ అధికారి, మంథని ఆర్డీవో హనుమానాయక్ మునిసిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో 9 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. దీంతో మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లు తమ పదవులు కోల్పోయారు.

వెల్‌కం.. సునీతమ్మా..!

రాష్ట్రంలో హ్యాట్రిక్ జడ్పీ చైర్‌పర్సన్‌గా రికార్డు మీది

- సునీతామహేందర్‌రెడ్డితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి







కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో పార్టీలో చేరుతున్న పట్నం సునీతారెడ్డి మహేందర్ రెడ్డి బొంతు రామ్మోహన్, కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

హైదరాబాద్/వికారాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): హ్యాట్రిక్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతమ్మా.. కాంగ్రెస్‌లోకి వెల్ కం.. అంటూ సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి సతీమణి పట్నం సునీతారెడ్డి గాంధీభవన్‌లో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. అంతకు ముందు ఆమె, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, కుమారుడు రినీష్‌రెడ్డి, అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి జూబ్లీహిల్స్‌లోని తమ నివాసం నుంచి గాంధీభవన్‌కు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. అక్కడ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సునీతా రెడ్డి, రినీష్‌రెడ్డిలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పట్నం ఫ్యామిలీని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అసెంబ్లీకి తీసుకువెళ్లారు. అక్కడ సీఎం తన చాంబర్‌లో సునీతారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, రినీష్‌రెడ్డితో రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. 'మహేందర్ అన్నా.. మీరు కూడా ఈ రోజే పార్టీలో చేరి ఉంటే బాగుండేది' అని సీఎం వారితో అన్నారు. అక్కడే ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మహేందర్‌రెడ్డి దంపతులను ఆప్యాయంగా పలకరించారు. సునీతారెడ్డి మూడుసార్లు వరుసగా జడ్పీ చైర్‌పర్సన్ కావడం ఉమ్మడి రాష్ట్రంలోనే ఒక రికార్డు అని ఆయన కొనియాడారు.

అల్లు అర్జున్ మామ కంచర్ల, మాజీ మేయర్ దంపతుల చేరిక

ప్రముఖ సినీ హీరో అల్లు అర్జున్ మామ, బీఆర్ఎస్ పార్టీ నేత కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో పార్టీలో చేరారు. ఇటీవలి ఎన్నికల్లో ఆయన బీఆర్ఎస్ తరఫున నాగార్జునసాగర్ టికెట్‌ను ఆశించారు. కానీ కేసీఆర్ ఆ సీటును సిటింగ్‌కే కేటాయించడంతో అసంతృప్తితో ఉన్న ఆయన ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. దీంతో త్వరలోనే కాంగ్రెస్‌లో చేరనున్నట్లు వార్తలు వచ్చాయి. అలాగే బీఆర్ఎస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన సతీమణి, కార్పొరేటర్ శ్రీదేవి కూడా మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారందరూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

చలమల్ల కృష్ణారెడ్డి చేరిక కలకలం..!

అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన చలమల్ల కృషారెడ్డి.. దీపాదాస్ మున్షీ సమక్షంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరారంటూ శుక్రవారం ప్రచారం జరిగింది. కనీసం తమ నోటీస్‌లోకి రాకుండా పార్టీలో ఎలా చేర్చుకున్నారంటూ కోమటిరెడ్డి సోదరులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లూ ప్రచారంలోకి వచ్చింది. దీంతో చల్లమల్ల కృష్ణారెడ్డి.. మున్షీని కలిశారు.. కానీ అధికారికంగా పార్టీలో చేరలేదంటూ నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు.

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం: దీపాదాస్ మున్షీ

లోక్‌సభ ఎన్నికలకు అన్ని రకాలుగా సిద్ధం కావాలంటూ డీసీసీ అధ్యక్షులకు దీపాదాస్ మున్షీ దిశానిర్దేశం చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆమె డీసీసీ అధ్యక్షులతో సమావేశమయ్యారు.

నచ్చక ఉద్యోగం మానేస్తే

కిడ్నాప్ చేసి వైర్లతో కొట్టారు!

లాంగ్ డ్రైవ్ కార్స్ యాజమాని దాష్టీకంపై ప్రజావాణికొచ్చి గోడు చెప్పుకొన్న బాధితులు

- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన



తమ వీపులపై 'లాంగ్ డ్రైవ్ కార్స్' యజమాని కొట్టిన దెబ్బల తాలూకు వాతలను చూపిస్తున్న మాజీ ఉద్యోగులు

బేగంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిలు, అబ్బాయిలు కలిపి మొత్తంగా ఏడుగురున్నారు. అంతా కలిసి ప్రజావాణికొచ్చారు. ఉద్యోగం నచ్చక కొన్నిరోజుల క్రితం మానేస్తే కక్ష కట్టిన యాజమాన్యం తమను అపహరించి.. ఓ షెడ్డులో బంధించి.. తాళ్లు, గ్యాస్ పైపులు, వైర్లతో విచక్షణారహితంగా కొట్టారని వాపోయారు. తమను కులం పేరుతో దూషిస్తూ చిత్రహింసలకు గురిచేస్తూ అంతా వీడియో తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. 'లాంగ్ డ్రైవ్ కార్స్' యజమాని కొప్పుల హరిదీప్‌రెడ్డే ఇదంతా చేశారని ఆరోపిస్తూ ఆ సంస్థ మాజీ ఉద్యోగులు ఏడుగురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. యువకులను చొక్కాలు విప్పించి తాళ్లు, వైర్లతో కొడుతూ వీడియో తీసి బెదిరించాడని, యువతులను పలుచోట్ల చిత్రహింసలకు గురి చేశాడని బాధితులు చెప్పుకొని బాధపడ్డారు. సోషల్ మీడియాలో కిడ్నాప్ విషయం బయటకు రావడంతో వదిలేశారని, లేదంటే తమను చంపేసేవారని కన్నీటిపర్యంతమయ్యారు. యువకులంతా తమ వీపులపై పడిన దెబ్బల తాలూకు వాతలను చూపించారు. అంతా సావధానంగా విన్న నోడల్ అధికారి దివ్యా దేవరాజన్, ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కాగా శుక్రవారం పలు సమస్యలపై ప్రజావాణికి 1364 దరఖాస్తులొచ్చాయి. శాఖల వారీగా ప్రజల నుంచి అర్జీలను తీసుకునే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు.

460 ఎకరాల్లో ప్లాట్ల కబ్జాపై

ప్రధానంగా గండిపేట మండలం వట్టినాగుల పల్లిలోని శంకరహిల్స్‌లో 1983లో వేసిన వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేశామని, రిజిస్ట్రేషన్లు, ఈసీ తమ పేరుమీద ఉన్నాయని, అయితే ధరణిలో కొందరు భూకబ్జాదారులు గత ప్రభుత్వ పెద్దలతో కుమ్మక్కై రాత్రి పూట ధరణి ఓపెన్ చేసి ఇక్కడ ఉన్న 460 ఎకరాల్లోని తమ ప్లాట్లను మార్చుకున్నారని బాధితులు ఆరోపించారు. ధరణి రాత్రి పూట ఓపెన్ అవుతుందని.. పగలు కనిపించడం లేదంటూ ఈ విషయంపై గత ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, న్యాయం చేయాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 19 ఎకరాలు ఉన్న యాప్రాల్ చెరువు.. ప్రస్తుతం ఎనిమిదెకరాలకు ఎకరాలకు చేరిందని, ఇక్కడ ఓ మాజీ మంత్రి అండతో ఫంక్షన్ హాల్ నిర్మించారని, దీనితో పాటు పలు గొలుసుకట్టు చెరువులు కబ్జాకు గురయ్యాయని యాప్రాల్ నాగిరెడ్డి గొలుసుకట్టు చెరువు పరిరక్షణ కోసం యాప్రాల్ జేఏసీ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎల్బీ స్టేడియంలో ఇటీవల కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చారని, అయితే 15,441 మంది అభ్యర్థులకు గాను 13,400 మందికి మాత్రమే నియామక పత్రాలు ఇచ్చారని, మిగిలిన 2వేల మందికి నియామక పత్రాలు ఇవ్వలేదంటూ పలువురు కానిస్టేబుల్ అభ్యర్థులు ప్రజావాణిలో వినతి పత్రాలు సమర్పించారు.

సమగ్ర కులగణన

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. గత తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు కేటాయించింది రూ.23 వేల కోట్లు మాత్రమేనని, ఎంబీసీలకు రూ.1000 కోట్లు ఇస్తామని చెప్పి.. రూ.1000 కూడా విడుదల చేయలేదని ఆక్షేపించారు. కాగా, రాష్ట్ర చరిత్రలోనే కులగణన అత్యంత కీలక నిర్ణయమని, దేశానికి ఇది ఉదాహరణగా నిలవనుందని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కులగణనపై చర్చలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో భారీగా అవినీతికి పాల్పడిందని, కేసీఆర్ పాపాల భైరవుడని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించేంత వరకు తమ అభిప్రాయాలు చెప్పబోమని హరీశ్‌రావు అన్నారు. ఈ క్రమంలో వాకౌట్ చేయాలని కేటీఆర్ చెప్పగా.. వద్దంటూ హరీశ్‌రావు వారించారు. ఆ తర్వాత మంత్రి వ్యాఖ్యలను తొలగిస్తున్నామని స్పీకర్ ప్రసాద్ కుమార్ చెప్పడంతో హరీశ్‌రావు తన ప్రసంగాన్ని కొనసాగించారు. శాసనసభలో శుక్రవారం నీటిపారుదల శాఖపై లఘు చర్చ జరుగుతుందని ఎజెండాలో ప్రస్తావించడంతో సభకు ఆ అంశంపై ప్రిపేరై వచ్చానని చెప్పారు. ఉదయం నుంచి దాని కోసం నిరీక్షిస్తున్నానని, అకస్మాత్తుగా సభను రేపటికి వాయిదా వేయాలని నిర్ణయించడం సరికాదని అన్నారు. అవసరమైతే సభను రాత్రి 11 గంటల దాకైనా సభను నడిపించాలని స్పీకర్‌ను కోరారు. కాగా, కులగణన కోసం చేసిన తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. 2004లో కేంద్ర మంత్రివర్గంలో కేసీఆర్ ఉన్నప్పుడే బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉండాలని ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సభ శుక్రవారం ముగుస్తుందని చెప్పినందున శనివారం నుంచి ఢిల్లీలో రెండు రోజుల సమావేశం పెట్టుకున్నామని తెలిపారు. సభను ముగించాలని, లేకుంటే నాలుగైదు రోజుల తర్వాత సమావేశాలు నిర్వహించాలని కోరారు.

తీర్మానం సరిపోదు.. చట్టం చేయాలి..

కులగణనపై చేయాల్సింది తీర్మానం కాదని, చట్టం చేస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కులగణన బీసీలకు మాత్రమే పరిమితమవుతుందా? ఇతర కులాలను కూడా చేర్చుతారా? కులగణనను ఎంతకాలం చేపడతారు? ఎప్పుడు పూర్తి చేస్తారు? అని ప్రశ్నించారు. కాగా, సమగ్ర కులగణన ద్వారా రాష్ట్రంలోని బీసీలతోపాటు అన్నివర్గాల జనాభా, వాటా శాతాన్ని తేల్చాలని బీజేపీ శాసనసభాపక్ష ఉపనేత, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. సర్వేకు కాలపరిమితిని నిర్ణయించాలని, ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఎంఐఎం సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ ప్రజాధనంతో 2014లో చేసిన సమగ్ర సర్వే నివేదికనూ సభలో పెట్టాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు చేసిన సర్వే ఎవరికోసం చేశారు? దాంతో ఎవరు లబ్ధి పొందారు.? అని ప్రశ్నించారు. నెహ్రూ కాలం నుంచి కాంగ్రెస్‌కు మద్దతుగా ఉన్న ముస్లింలను కేవలం ఓటుబ్యాంకుగానే ఉపయోగించుకుంటున్నారని, వారి ఆర్థిక, సామాజిక వెనకబాటుపై గత ప్రభుత్వాలు దృష్టి సారించలేదని అన్నారు. దేశ ప్రధానిగా ఉండి బాబ్రీ మసీదును కూలగొట్టేందుకు సహకరించినందునే కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఓ నేతకు భారతరత్న ఇచ్చిందంటూ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు.



కులగణనపై తీర్మానం చేయడంతో గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

గాంధీభవన్‌లో సంబరాలు

రాష్ట్ర శాసనసభ శుక్రవారం కులగణన తీర్మానానికి ఆమోదం తెలిపిన నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు గాంధీభవన్‌లో సంబరాలు చేసుకున్నారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సంబరాల్లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, ఓబీసీ సెల్ నేతలు పాల్గొన్నారు. శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో జ్యోతిరావ్ పూలే విగ్రహాలు, చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని టీపీసీసీ ఓబీసీ సెల్ నేతలు, కార్యకర్తలకు సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్‌గౌడ్ పిలుపునిచ్చారు. కాగా, అసెంబ్లీలో కులగణన తీర్మానం.. బీసీల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ అన్నారు. ఓబీసీనని చెప్పుకొంటున్న ప్రధాని మోదీ.. ఏనాడూ ఓబీసీ సమస్యలను పట్టించుకోకుండా బీసీ ద్రోహిగా మిగిలారని ఆరోపించారు. కులగణన తీర్మానానికి ఆమోదం పలికిన తెలంగాణ శాసనసభకు, ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు ఏఐసీసీ ఓబీసీ నేత ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. దీని క్రెడిట్ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి దక్కుతుందన్నారు.

సర్వరోగ నివారిణి : భట్టి

రాష్ట్రంలోని బీసీ కులాలతోపాటు అన్ని సామాజికవర్గాల జనాభా, వారి ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సర్వే చేస్తామని, ఇది అన్ని సమస్యలకు సర్వరోగ నివారిణిలా పనిచేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కులగణనపై చర్చలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులకు ఈ సర్వే నాంది పలుకుతుందన్నారు. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు, ఇతర అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. కొన్ని వర్గాల వద్దే కేంద్రీకృతమైన సంపదను దామాషా ప్రకారం అన్ని వర్గాలకు పంచడంతోపాటు రాజకీయ ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఇలా సర్వే చేపట్టే మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ అవుతుందన్నారు.

సంపూర్ణ సామాజిక ముఖచిత్రం

- 93 ఏళ్ల తర్వాత తెలంగాణలో కులగణన.. చివరిసారి 1931లో
- కులగణనతో కులాల వివరాలు వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కులగణనకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిన నేపథ్యంలో.. రాష్ట్రంలో కులాల వారీగా జనాభా లెక్కలను సేకరించటానికి మార్గం సుగమమైంది. తెలంగాణ ప్రాంతం హైదరాబాద్ రాజ్యంలో భాగంగా ఉన్నప్పుడు చివరిసారిగా 1931లో కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించారు. మళ్లీ 93 ఏళ్ల తర్వాత కులగణన జరగనుంది. దీంట్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని కులాల జనాభాను వాటిలోని ఉప కులాలతోపాటు లెక్కించే అవకాశం ఉంది. ఒకే కులంలో అనేకానేక ఉపకులాలు, అనుబంధ కులాలు, శాఖలు ఉన్నందున.. వీటన్నింటినీ విడివిడిగా లెక్కిస్తే గందరగోళం తలెత్తే అవకాశం ఉంది. ఇటువంటి సమస్య ఎదురవకుండా, బిహార్‌లో కులగణన సమయంలో.. ఒకే కులానికి చెందిన ఉపకులాలను, శాఖలను.. సారూప్యత ఉన్న కులాలను ఒకే కులం కింద లెక్కించారు. ఫలితంగా అగ్రకులాలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీల జనసంఖ్యకు సంబంధించి స్పష్టత వచ్చింది. తెలంగాణలో కూడా ఇదే తరహాలో కులగణన జరిపే అవకాశం ఉంది. దీని కోసం కులగణనకు ముందే కులాల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసుకొని, ఆ జాబితాలో ఉన్న కులాల మేరకే వివరాలను సేకరించవచ్చు. మరోవైపు, కులగణనలో ఆయా కులాల ప్రజల జీవన పరిస్థితులు ఎలా ఉన్నాయన్నదీ నమోదు చేస్తారు. సంప్రదాయ కులవృత్తులపై ఆధారపడిన వారు ఎంత మంది? వారి జీవనం ఎలా ఉంది? తదితర వివరాలనూ సేకరిస్తారు. అలాగే, అగ్రకులాల్లో ఉన్న ఆర్థిక అంతరాలు, పదవుల పరంగా ఉన్న తేడాలు, ప్రాతినిధ్యం తదితర వివరాలు వెల్లడవుతాయి. ఎస్సీల వర్గీకరణ అంశం ఇప్పటికే సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున.. రాష్ట్రంలో కులగణనతో వెల్లడయ్యే ఎస్సీల సామాజిక ఆర్థిక పరిస్థితులు.. ఈ అంశంపై మరింత స్పష్టతను ఇవ్వవచ్చు. మొత్తానికి, కులగణనతో రాష్ట్రంలో విభిన్న సామాజిక వర్గాల ముఖచిత్రం సంపూర్ణంగా ఆవిష్కృతమయ్యే అవకాశం ఉంది. తద్వారా, రిజర్వేషన్లలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశాలున్నాయి.

ఇతర రాష్ట్రాలకు వెళ్లి అధ్యయనం

రాష్ట్రంలో కులగణనకు ముందే.. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో జరిగిన కులగణన తీరును అధ్యయనం చేయనున్నారు. ఈ మేరకు అధికారుల బృందాలను ఆయా రాష్ట్రాలకు పంపించాలని నిర్ణయించినట్టు సమాచారం. మరోవైపు, కులగణన కోసం ఒక కమిషన్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలుస్తోంది. విధి విధానాలుగా ఏయే అంశాలను తీసుకోవాలన్న దానిపై మేధావులతో సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. కులగణనకు 6-8నెలల సమయం పడుతుందని అంచనా. ఇందుకోసం 150కోట్లు కేటాయిస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలో కులగణనను ఆయనే పర్యవేక్షించనున్నారు.

చరిత్రాత్మక ఘట్టం: వకుళాభరణం

పది వేల మందితో విజయోత్సవ సభ: జాజుల

రాష్ట్రంలో కులగణన నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. బలహీనవర్గాలు సమున్నతంగా ఎదిగే లక్ష్యసాధనకు ఇది శుభారంభంగా నిలుస్తుందన్నారు. అసెంబ్లీకి వెళ్లి సీఎం రేవంత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రేవంత్‌ను సన్మానించారు. కాగా, కులగణనపై గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం దిశగా ముందుకెళుతోందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. కులగణనపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహిస్తామని, త్వరలో హైదరాబాద్‌లో పది వేల మందితో విజయోత్సవ సభ నిర్వహిస్తామని ప్రకటించారు.

పట్టువస్త్రాలతో మంత్రి పొన్నం

కులగణన తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ మూడు రోజులుగా పట్టువస్త్రాలతో అసెంబ్లీకి వచ్చారు. కానీ, సభలో చర్చల నేపథ్యంలో అందుకు వీలుకాలేదు. ఎట్టకేలకు శుక్రవారం ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కాగా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా శాసన సభలో కులగణన తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతో తన జీవితం ధన్యమైందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దీనికి శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం పట్ల ఒక ప్రకటనలో ఆయన హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సాగు నీటి శాఖపై నేడు శ్వేతపత్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సాగు నీటి శాఖపై శ్వేతపత్రం విడుదలకు సంబంధించి కొన సాగుతున్న ఉత్కంఠకు తెరదించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిజానికి శ్వేతపత్రం విడుదలతోపాటు, దానిపై లఘుచర్చ కూడా శుక్రవారమే జరుగుతుందని ఎజెండా విడుదలైంది. కానీ, సాయంత్రం దాకా చూసినా ఫలితం లేకపోయింది. శనివారంనాడు కేసీఆర్ పుట్టినరోజు కావడంతో.. అదేరోజు ఆయన అవినీతిని సభలో బయటపెట్టాలని అధికార పక్షం భావించినట్టు సమాచారం. ఈమేరకు శనివారం శాసనసభలో నీటిపారుదల శాఖపై శ్వేతపత్రాన్ని విడుదల చేసి, దానిపై లఘు చర్చను నిర్వహించనుంది. అయితే, నీటిపారుదల శాఖలోని కీలక అధికారుల ద్వారా ఈ శ్వేతపత్రం ఇప్పటికే విపక్షానికి చేరడంతో.. దాన్ని పూర్తిగా అధ్యయనం చేసిన బీఆర్ఎస్, అందులోని ప్రతి అంశంపైనా అధికార పక్షంపై ఎదురుదాడికి సిద్ధమయినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో లోపాలకు ఏ మాత్రం తావులేకుండా అధికార పార్టీ శ్వేతపత్రానికి తుదిమెరుగులు దిద్దుతోంది. కాళేశ్వరంలో అవినీతిని కడిగేస్తూ కాగ్ నివేదిక ఇవ్వడం.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణ లోపాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మధ్యంతర నివేదిక కూడా చేతికి రావడం, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) సిఫారసులు అందుబాటులో ఉండటంతో వాటినన్నింటినీ పొందుపరిచి ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయనుంది. రూ.81,911 కోట్లతో చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి అన్ని కాంపోనెంట్లనూ కాగ్ దాదాపు రెండేళ్లపాటు వడపోసి కచ్చితమైన లెక్కలు తీసింది. నీటిపారుదల శాఖ శ్వేతపత్రంలో అవే అంశాలు ప్రధానంగా ఉండే అవకాశాలున్నాయని అధికార వర్గాలు తెలిపాయి.

త్వరితగతిన యాదాద్రి పవర్ ప్లాంటు పనులు

- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం



యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. నిర్దేశించుకున్న గడువు నాటికి 1600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. శుక్రవారం రాత్రి సచివాలయంలో యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. స్టేజీ-1 లో రెండు యూనిట్లు, స్టేజీ-2లో మూడు యూనిట్ల పనుల పురోగతిని ఆరా తీశారు. బొగ్గు రవాణాకు సంబంధించి ఇప్పటి వరకు 75 శాతం రైల్వే పనులు పూర్తయ్యాయని మిగతా పనులపై దృష్టి పెట్టినట్టు జెన్‌కో అధికారులు వివరించారు. గత మూడేళ్లుగా పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో వివరించారు. పర్యావరణ అనుమతులు వచ్చిన తరువాత చేపట్టే పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని భట్టి ఆదేశించారు.

బైక్‌పై 126 గొర్రెలా? ఎలా సాధ్యం?

- ఆ మోటార్ సైకిల్ ఏ కంపెనీదో తెలుసుకోవాలి
- బీఆర్ఎస్‌ను ఉద్దేశించి మంత్రి కోమటిరెడ్డి వ్యంగ్యాస్త్రం
- గొర్రెల స్కీమ్‌లో అక్రమాలపై చర్యలుంటాయని స్పష్టీకరణ
- 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రస్తావిస్తూ శాసనసభలో ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. మోటారు సైకిల్‌పై ఒకేసారి 126 గొర్రెలను తరలించడం ఎలా సాధ్యమైందో? అంటూ పరోక్షంగా బీఆర్ఎస్‌పై వ్యంగ్యాస్త్రం సంధించారు. 'బైక్‌పై ఒకేసారి 126 గొర్రెలట!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనం అసెంబ్లీలో చర్చనీయాంశమైంది. శుక్రవారం ఉదయం అసెంబ్లీలో జీరో అవర్ నిర్వహించగా, ఇద్దరు సభ్యులు ఈ అంశాన్ని లేవనెత్తారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో చాలా మంది యాదవులు గొర్రెల పంపిణీ పథకం కోసం తమ వాటాధనం కింద రూ.43,750 చొప్పున చెల్లించారని తెలిపారు. ఇప్పటివరకు వారికి యూనిట్లు మంజూరు కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ బైక్‌పై 120 గొర్రెలను తీసుకెళ్లారంటూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిందని, దీనిపై ప్రభుత్వం ఏం చేయదల్చుకున్నదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి..'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపిస్తూ మాట్లాడారు. "ఎన్నికలకు ముందు గొర్రెల పంపిణీ కార్యక్రమం కోసం చాలా మంది యాదవులు వడ్డీలకు తెచ్చి తమ వాటా సొమ్మును ప్రభుత్వానికి చెల్లించారు. ఆరు నెలలకు ముందు డబ్బు కట్టించుకున్న వారికి కూడా గొర్రెల యూనిట్లను ఇవ్వలేదు. బైక్‌పై ఒకేసారి 126 గొర్రెలను తీసుకెళ్లినట్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. అది ఏ మోటారు సైకిలో, ఏ కంపెనీదో తెలుసుకోవాల్సి ఉంది. ఈ పథకంలో జరిగిన అక్రమాలపై తగిన చర్యలు తీసుకుంటాం. త్వరలోనే యాదవులకు గొర్రెల యూనిట్లు అందజేస్తాం" అని స్పష్టం చేశారు.

'బాపు'రే..!

(మొదటిపేజీ తరువాయి)



ఆయన్ను "బాపు"గా సంబోధిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలపడానికి వారంతా సిద్ధమైనట్టు సమాచారం. ప్రజలు సైతం కేసీఆర్‌ను 'బాపు'గా పిలిచేలా అన్ని మాధ్యమాల ద్వారా జనంలో విస్తృత ప్రచారం కల్పించనున్నట్లు తెలిసింది. ముఖ్యంగా పార్టీ అధికారిక ఫేస్‌బుక్, ట్విటర్ ఖాతాల్లో.. పార్టీ కార్యకర్తలు, శ్రేణుల సోషల్ మీడియా ఖాతాల్లో ఈ పేరు పదే పదే మార్మోగేలా చేసేందుకు వ్యూహం రచించినట్లు తెలుస్తోంది. కాగా.. కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను తెలంగాణ భవన్‌లో ఘనంగా జరపడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఈ సందర్భంగా 70 కిలోల కేక్‌ను కట్ చేయడంతోపాటు దివ్యాంగులకు వీల్ చైర్లు, ఆటోడ్రైవర్లకు బీమా పత్రాల అందజేత తదితర కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పార్టీ శ్రేణులు వెల్లడించాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల మాజీ ఛైర్మన్లు, హైదరాబాద్‌కు చెందిన కార్పొరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అయితే గురువారంనాడే ఎర్రవెల్లిలోని తన ఫామ్ హౌస్‌కు వెళ్లిన కేసీఆర్ ప్రస్తుతం అక్కడే ఉన్నారు. శనివారం కూడా ఆయన అక్కడే ఉండే అవకాశాలు ఉన్నట్టు సమాచారం.

భాష మార్చుకోమని కేసీఆర్‌కు చెప్పండి

- కల్వకుంట్ల.. అయినా సంజయ్ మంచోడే
- జీరో అవర్‌లో మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు
- సమస్యలను ఏకరువు పెట్టిన ఎమ్మెల్యేలు
- మంత్రుల దృష్టికి తీసుకెళ్తానన్న కోమటిరెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): 'కల్వకుంట్ల (జగిత్యాల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్) అయినా మంచోడే. మొన్న నల్లగొండ సభలో దున్నపోతు, బర్రెలు అంటూ కేసీఆర్ ఏమేమో మాట్లాడిండు. ఆ మాటలు వినలేక కాసేపు టీవీ బంద్ చేసిన. ఆ భాష మార్చుకోవాలని కేసీఆర్‌కు మీరైనా మెయిల్ చేయండి' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. శాసనసభలో శుక్రవారం జీరో అవర్ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల సమస్యలతోపాటు ఇతర అంశాలను ప్రస్తావించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ తాను కొత్తగా సభలోకి వచ్చానని, తన లాంటి వారి పట్ల వ్యంగ్యంగా మాట్లాడడం సరికాదని, కొందరు సభ్యుల భాషలో మార్పు రావాలని ఆకాంక్షించారు. దీనిపై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ మేరకు స్పందించారు. నల్లగొండ అంటేనే మర్యాదకు మారు పేరని వ్యాఖ్యానించారు. అలాగే, మరి కొందరు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. "ఎన్నికలకు రెండు నెలల ముందు ప్రగతి నివేదికల పేరుతో రూ.లక్ష కోట్ల పనులకు కేటీఆర్ ప్రతిపాదనలు తెప్పించుకున్నారు. ఇప్పుడు ఆ పనులన్నీ నన్ను చేయమని కోరుతున్నారు. నేనేం చేయాలె" అని అన్నారు. సీఎంఆర్ఎఫ్ నుంచి సాయం కావాలని కోరుతూ వచ్చిన 60వేల ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో హాస్టల్ కాంప్లెక్స్‌లు కట్టనున్నామని చెప్పారు. ఆర్టీసీ కోసం మరో 1000బస్సులు కొంటామని ప్రకటించారు. కాగా, తమకు తగిన గౌరవం ఇవ్వాలని, అసెంబ్లీతోపాటు నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ పాటించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కోరారు. పదేళ్లుగా ఆలేరులో ఒక్క కుటుంబం, ఒక్క కులానికే మేలు జరిగిందని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య విమర్శించారు. షాద్‌నగర్ ప్రాంతానికి సాగు నీరు అందించే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే శంకరయ్య కోరారు. మూసీ రివర్ ఫ్రంట్‌తోపాటు మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టాలని, తద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఎల్కుర్తిలో సైనిక్ స్కూల్ ఏర్పాటు ప్రతిపాదన ఉందని, దాన్ని సికింద్రాబాద్‌కు తరలించే యోచన విరమించుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. కాగా, సభ్యులు ప్రస్తావించిన అంశాలన్నింటినీ నోట్ చేసుకున్నామని, వాటిని ఆయా మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు.

పాలితులు పాలకులు కావాలి

బలహీనవర్గాల్ని సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో నిలబెట్టాలి.. అదే మా ప్రభుత్వ ఉద్దేశం

- ఇన్నాళ్లూ అధికారంలో ఉన్నోళ్లకు.. దాన్ని జనాభాలో 50% ఉన్నవారికి ఇవ్వాల్సివస్తుందనే బాధ ఉండొచ్చు
- కులగణనపై మా చిత్తశుద్ధిని శంకించాల్సిన పనిలేదు
- కేటీఆర్ సీటు మార్చటం కాదు.. బయటికి పంపాల్సిందే: సీఎం రేవంత్




హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీసీ సమగ్ర కులగణనలో విషయంలో తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరంలేదని.. బలహీన వర్గాలను బలోపేతం చేయటమే తమ ఉద్దేశమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంతకాలం పాలితులుగా ఉన్నవారిని రాబోయే రోజుల్లో పాలకులుగా తయారుచేయడమే తమ లక్ష్యమన్నారు. సమగ్ర కులగణనపై శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. బలహీన వర్గాలను సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో నిలబెట్టాలన్నదే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. 2014లో గత ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించినప్పటికీ.. ఇంతవరకు ఆ వివరాలను సభలో పెట్టలేదని, ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్ర ప్రజలెవరికీ అందుబాటులోకి తేలేదని సీఎం గుర్తుచేశారు. సమగ్ర కుటుంబ సర్వేను ఒక రహస్య నివేదికలా వినియోగించుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజల వివరాలను ఒకే కుటుంబం దగ్గర పెట్టుకున్నదని.. అవసరమైనప్పుడు రాజకీయం చేయాలనుకున్నపుడు మాత్రమే ఆ సర్వే వివరాలను వినియోగించుకున్నారని రేవంత్ ధ్వజమెత్తారు. "జనాభాలో అర శాతం ఉన్నోళ్లకు తప్పనిసరిగా కడుపులో బాధ ఉంటుంది. 'అరశాతం ఉన్నోళ్లం ఇంతకాలం రాష్ట్రాన్ని గుప్పిట్లో పెట్టుకున్నాం. ఇప్పుడు లెక్కలన్నీ బయటికి వస్తే.. 50 శాతం ఉన్నోళ్లకు ఎక్కడ రాజ్యాధికారంలో భాగం ఇవ్వాల్సి వస్తుందో' అనే ఆలోచనతో కొంత మందికి బాధ ఉండొచ్చు!" అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభకు వచ్చి సలహాలు సూచనలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆయన ఎవరిని సీఎం చేయాలనుకున్నాడో ఆ వ్యక్తి అయినాగానీ.. సలహాలు, సూచలను ఇస్తే బాగుంటుందని వ్యాఖ్యానించారు. కడియం శ్రీహరి చిత్తశుద్ధి పట్ల తమకెలాంటి అనుమానమూ లేదని.. కాకపోతే సహవాస దోషంతోనే ఆయన ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కొంతమంది పక్కన కూర్చొని నకల్ చిట్టీలు అందిస్తూ వారిని కూడా తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ను ఉద్దేశించి అన్నారు. ఈసందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ.. "అయితే నా సీటు మార్చండి!" అన్నారు. దానికి సీఎం రేవంత్.. "మార్చాల్సిందే. సీటు మార్చితే సరిపోదు! ఏకంగా బయటికి పంపించాల్సిందే! గాలి సోకినా ప్రమాదం ఉంటుంది!" అన్నారు.

అన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నాకే..

పార్లమెంటులో జరిగిన చర్చలు, వచ్చిన ప్రశ్నలు, సమాధానాలు, సుప్రీంకోర్టులో వచ్చిన తీర్పులు, ఇతర రాష్ట్రాల్లో ఉన్నత న్యాయస్థానాల్లో వచ్చిన తీర్పులు, గతంలో మైనారిటీ రిజర్వేషన్ సందర్భంగా సచార్ కమిటీ ఇచ్చిన నివేదికలు.. అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టాలనే ప్రయత్నం చేస్తున్నన్నట్టు సీఎం స్పష్టం చేశారు. రాజ్యాంగం రాసుకున్నప్పుడే కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగ పరమైన రక్షణ కల్పించి రిజర్వేషన్లు అమలులోకి తెచ్చినందుకే ఈరోజు రాష్ట్రం నుంచి 19 మంది ఎస్సీలు, 12 మంది ఎస్టీలు సభ్యులై చట్టసభకు వచ్చారని అన్నారు. ముగ్గురు ఎస్సీలు, ఇద్దరు ఎస్టీలు ఎంపీలై పార్లమెంటుకు వెళ్లారని అన్నారు. రాజేందర్ సచార్ కమిటీ ద్వారా మైనారిటీ వర్గాలకు మద్దతు ఇవ్వటంతోపాటు కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు 4 శాతం రిజర్వేషన్ ఇచ్చి విద్య, ఉద్యోగరంగాల్లో అమలుచేసిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. సమగ్ర కులగణన చేపట్టి సమాచారం సేకరించిన తర్వాత రాజకీయరంగంలో ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, జనాభా ప్రాతిపదికన అభివృద్ధి నిధులు కేటాయిస్తామని తెలిపారు. సభలో ఉన్న రాజకీయ పార్టీలతోపాటు సభలో లేని పార్టీలు కూడా సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించి కులగణన ప్రక్రియ చేపడతామని రేవంత్ అన్నారు. అంతేతప్ప అనుమానాలు లేవనెత్తుతూ, సభను తప్పుదోవపట్టిస్తూ, ప్రజలను అయోమయానికి గురిచేసేలా చేయొద్దని ప్రతిపక్షానికి హితవు చెప్పారు. మన రాష్ట్రంలో అన్నివర్గాల సమాచారం సేకరిస్తూనే వెనకబడిన తరగతులకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని, రాజకీయం, విద్య, ఉద్యోగరంగాల్లో ప్రభుత్వం అండగా నిలబడాలని పార్లమెంటు సభ్యులు రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట మేరకు ఈ ప్రక్రియ చేపడుతున్నామని అన్నారు. ఇందుకోసం సమగ్ర ప్రణాళికలు, శాస్త్రీయ విధానాలు రూపొందిస్తామని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. వెనకబడిన తరగతుల, షెడ్యూలు కులాల, షెడ్యూల్డు తెగలతోపాటు మిగిలిన బలహీనవర్గాలకు చెందిన వారికి సామాజిక, ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఈనెల నాలుగో తేదీన చేసిన సిఫారసు మేరకు సమగ్ర కుల గణన చేపడుతున్నట్లు సీఎం వివరించారు. ఒకవేళ ఎన్నికల హామీలు, మానిఫెస్టోపై చర్చ చేయాలని ప్రధాన ప్రతిపక్షం భావిస్తే.. వచ్చే సమావేశాల్లో గానీ, ప్రత్యేక సమావేశాల్లోగానీ 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు- అమలుచేసిన అంశాలతోపాటు, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ఈ 70 రోజుల్లో అమలు చేసిన పథకాలు, రాబోయే రోజుల్లో అమలుచేసే అంశాలపై ముందుకొస్తే మేనిఫెస్టో మీదనే చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని రేవంత్ రెడ్డి అన్నారు. కాగా తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య శుక్రవారం సీఎం రేవంత్‌ను కలిశారు. కాంగ్రెస్‌లో చేరికపై ఆయన మంతనాలు జరిపినట్లు సమాచారం.

రాష్ట్ర ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రెండో ఆర్థిక సంఘాన్ని(స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌ను) గవర్నర్ తమిళిసై ఏర్పాటు చేశారు. దీనికి ఛైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను నియమించారు. ఆయనతో పాటు మల్యాడ్ రమేశ్, సంకేపల్లి సుధీర్‌రెడ్డి, మాలోతు నెహ్రూ నాయక్‌లను సభ్యులుగా నియమించారు. ఈ మేరకు గవర్నర్ ఉత్తర్వులను జారీ చేశారు. వీరి పదవీ కాలం రెండేళ్ల పాటు ఉంటుంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు సిఫారసుల కోసం మొదటి రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటైన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదటి ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా రాజేశంగౌడ్‌ను నియమించారు. ఆయన పదవీ కాలం పూర్తయిన తర్వాత రెండో ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు జరగలేదు. తాజాగా రెండో కమిషన్‌ను గవర్నర్ ఏర్పాటు చేశారు. కాగా, వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత సిరిసిల్ల రాజయ్య వరంగల్ లోక్‌సభ టికెట్‌ను, మహబూబాబాద్ జిల్లాకు చెందిన మాలోతు నెహ్రూ నాయక్ మహబూబాబాద్ ఎంపీ టికెట్‌ను ఆశించారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి సంకేపల్లి సుధీర్‌రెడ్డి 20 ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో రెడ్డి హాస్టల్‌లో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి చదువుకున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన మల్యాడ్ రమేశ్ కాంగ్రెస్‌లో సీనియర్ నాయకులుగా కొనసాగుతున్నారు.

ఐదు పరీక్షల జనరల్ ర్యాంకులు విడుదల

» సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత తుది జాబితా: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఐదు పరీక్షలకు సంబంధించిన జనరల్ ర్యాంకులను టీఎస్‌పీఎస్సీ శుక్రవారం విడుదల చేసింది. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, హార్టికల్చర్ ఆఫీసర్, లైబ్రేరియన్, ఏఎంవీఐ పరీక్షలకు సంబంధించిన జనరల్ ర్యాంకింగ్‌ను విడుదల చేస్తూ ఒక ప్రకటన జారీ చేసింది. నోటిఫికేషన్‌లో పొందుపరిచిన నియమ నిబంధనలు, మెరిట్ ప్రాతిపదికన జీఆర్ఎల్ జాబితా రూపొందించినట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తుది జాబితాను వెలువరిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. అదేక్రమంలో వ్యవసాయ, సహకార శాఖ పరిధిలోని వ్యవసాయశాఖ అధికారి(ఏవో) పోస్టులకు సంబంధించిన జనరల్ ర్యాంకింగ్‌ను కూడా టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది.

కవిత పిటిషన్ విడిగా విచారణ?

» నళిని పిటిషన్‌తో సంబంధం లేదన్న సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో ఈడీ నోటీసులను సవాలు చేస్తూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తన విచారణను ఫిబ్రవరి 28కి వాయిదా వేసింది. ఈ కేసును నళినీ చిదంబరం, అభిషేక్ బెనర్జీల కేసులతో ముడిపెట్టడంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్ కూడిన ధర్మాసనం శుక్రవారం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ కేసుల్లో విచారణాంశం వేరే కదా? అసలు కలిపి ఎలా విచారిస్తారు? అని జస్టిస్ బేలా త్రివేదీ ప్రశ్నించారు. గతంలో సుప్రీం బెంచియే ఈ నిర్ణయం తీసుకున్నదని న్యాయవాదులు కపిల్ సిబాల్, అభిషేక్ సంఘ్వీ ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అయినా, అది సరైంది కాదని జస్టిస్ బేలా త్రివేదీ అన్నారు. న్యాయవాదులు కోరిక మేరకు 28కి కేసు విచారణను వాయిదా వేశారు. న్యాయమూర్తి వ్యాఖ్యల నేపథ్యంలో కవిత కేసు విచారణ వేరుగానే సుప్రీం చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన నిర్ణయం 28న విచారణ సందర్భంగా వెలువడే అవకాశం ఉంది.

కేంద్ర ఉర్దూభాషాభివృద్ధి మండలి సభ్యుడిగా తెలుగు వ్యక్తి

» సీనియర్ పాత్రికేయుడు మెహక్ హైదరాబాదీ నియామకం

» ఆయన స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ ఉర్దూ-తెలుగు అనువాదకుడు మెహక్ హైదరాబాదీ (వీవీ సూర్యనారాయణ మూర్తి) కేంద్ర విద్యాశాఖ పరిధిలోని ఉర్దూ భాషాభివృద్ధి జాతీయమండలి సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ పదవికి ఎంపికైన తొలి తెలుగు వ్యక్తి ఈయనే కావడం విశేషం. ఈ మేరకు మండలి డైరెక్టర్ ధనుంజయ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. మెహక్ హైదరాబాదీ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం. ప్రఖ్యాత ఉర్దూ రచయితల కథా సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించారు. కాల్పనిక, కాల్పనికేతర రచనలు తొమ్మిది వరకు పుస్తకాలుగా వెలువడ్డాయి. ప్రముఖ ఉర్దూ రచయిత్రి జిలానీబానూ కథలతోపాటు ఆమె బాల్య జ్ఞాపకాలు, సాదత్ హసన్‌మంటో కథలు, అమృతా ప్రీతమ్ నవల 'అస్థిపంజరం', హైదరాబాద్ సంస్థానంపై విప్లవ కవి మగ్దూం రాసిన వివాదాస్పద పుస్తకం అందులో ఉన్నాయి. గత 80ఏళ్లలో హైదరాబాద్‌లోని ఉర్దూ రచయితలు హిందువుల జీవితాలపై రాసిన ప్రత్యేక కథలను 'గుల్ దస్త' పేరుతో అనువదించారు. కొన్ని గజల్స్ రాశారు. మెహక్‌ను ఈ సందర్భంగా పలువురు తెలుగు, ఉర్దూ సాహిత్యకారులు అభినందించారు.



రామకృష్ణారెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ఇన్‌సెట్‌లో రామకృష్ణారెడ్డి (ఫైల్)

పీవోడబ్ల్యూ సంధ్య జీవన సహచరుడు రామకృష్ణారెడ్డి కన్నుమూత

రాంనగర్/హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ వి.సంధ్య జీవిత భాగస్వామి, కవి, నవ్య ప్రింటింగ్ ప్రెస్ సంస్థ యజమాని రామకృష్ణారెడ్డి (62) శుక్రవారం ఉదయం మృతి చెందారు. కొంత కాలంగా 'మల్టిపుల్ ఆర్గాన్ డిజార్డర్'తో బాధపడుతున్న ఆయనకు గుండెపోటు రావడంతో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. వెంటనే సమీపంలోని అపోలో ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే రామకృష్ణారెడ్డి మృతిచెందినట్లు తెలిపారు. ఆయన అంత్యక్రియలు శనివారం ఉదయం 11 గంటలకు చిట్యాల సమీపంలోని నేరడలో ఉన్న వారి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తారు. విప్లవ సాహిత్యాన్ని ముద్రిస్తున్నారనే కారణంతో రెండేళ్ల క్రితం నవ్య ప్రింటింగ్ ప్రెస్‌పై పోలీసులు దాడి చేసి సీజ్ చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. విద్యార్థి దశలో పీడీఎస్‌యూలో చురుకుగా పాల్గొన్న రామకృష్ణారెడ్డి అదే సంఘంలో పనిచేస్తున్న ఉద్యమ సహచరురాలు సంధ్యను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత రైతు నేస్తం వెంకటేశ్వర్లు, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, కవులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామికవాదులు రామకృష్ణారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన 1.61 కోట్లు వెనక్కి..

» బాధితులకు అందించిన సిటీ, సైబర్ క్రైమ్ జాయింట్ సీపీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఒకరిని ఆశపెట్టి.. మరొకరిని భయపెట్టి.. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి సైబర్ నేరగాళ్లు రూ.2.2 కోట్లు కొల్లగొట్టగా.. పోలీసులు వారి ఖాతాలను ఫ్రీజ్ చేసి డబ్బు వెనక్కి రాబట్టారు. సిటీ క్రైమ్స్ అండ్ సిట్ జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 'ఫెడెక్స్ పార్శిల్ సర్వీస్'లో మీ పేరుతో తైవాన్‌కు డ్రగ్స్ పార్శిల్ వెళ్తోంది. మీపై విచారణకు ఆదేశించారంటూ ముంబై క్రైమ్ బ్రాంచి పోలీసుల పేరుతో హైదరాబాద్‌కు చెందిన యువతికి అర్ధరాత్రి ఆగంతకులు ఫోన్ చేశారు. విచారణకు హాజరుకావాలని భయపెట్టి రూ.98.79 లక్షలు కొల్లగొట్టారు. మరో ఘటనలో.. ఒక గుర్తు తెలియని వ్యక్తి తానొక పెద్ద స్టాక్ మార్కెట్ బ్రోకర్‌నని హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి ఆన్‌లైన్‌లో పరిచయం చేసుకున్నాడు. తాను చెప్పినట్టు ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించి, విడతలవారీగా రూ.1.04కోట్లు దోచేశాడు. ఈ రెండు కేసుల్లో సైబర్ నేరగాళ్ల ఖాతాలను సైబర్ క్రైం పోలీసులు ఫ్రీజ్ చేయించారు. ఆ బాధితురాలికి రూ.80,76,198, బాధితుడికి రూ.80,48,028 డీడీల రూపంలో అందజేశారు.

26 మంది డిప్యూటీ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది డిప్యూటీ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీ చేశారు. వనపర్తి జిల్లాకు నగేష్, వరంగల్ జిల్లాకు సంధ్యారాణిని అదనపు(రెవెన్యూ) కలెక్టర్లుగా నియమించారు. మరో ముగ్గురు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు కనుగుల శ్రీనివాస్‌ను వరంగల్‌కు, రాజ్యలక్ష్మిని నల్గొండకు, పద్మజారాణిని సంగారెడ్డి జిల్లాకు డీఆర్(డిస్ట్రిక్ట్ రెవెన్యూ)అధికారులుగా నియమించారు. వీరితో పాటు మరో 21మంది డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు.

నకిలీ ధ్రువీకరణ పత్రాల కేసులో మరో ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నకిలీ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు కేసులో తాజాగా చాంద్ ఖాన్, హబీబుల్లా అనే నిందితులను సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోర్టు విచారణ అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. 95 మందికి అక్రమంగా పాసుపోర్టులు సమకూర్చిన కేసులో సీఐడీ ఇప్పటి వరకు 18 మందిని అరెస్ట్ చేసింది.

ధరణితో గోల్‌మాల్

(మొదటి పేజీ తరువాయి)

ప్లాట్లు చేయడానికి ముందు వ్యవసాయ భూమిని అమ్మిన రైతు పేరిటే రెవెన్యూ రికార్డులు చూపిస్తున్నాయి. ధరణి వచ్చాక దీన్ని అధికార పార్టీ నేతలు అవకాశంగా మార్చుకున్నారు. అధికారులను కట్టుకొని భూములను కబ్జా చేస్తున్నారు. ఇప్పటికే లేఅవుట్లు వేసి ప్లాట్లుగా అమ్మిన భూములను మళ్లీ కొంటున్నారు. పాత లేఅవుట్లను చెరిపేసి, బలవంతంగా లేఅవుట్లు వేస్తున్నారు. రెవెన్యూ, సాగునీటి శాఖలు చేతిలో ఉండటంతో పనులు చకచకా పూర్తవుతున్నాయి. ఇదేం అన్యాయమని బాధితులు పోలీసులను ఆశ్రయిస్తే సివిల్ వ్యవహారం కోర్టుకు వెళ్లండని చెబుతున్నారు. కోర్టుల నుంచి నిలుపుదల ఉత్తర్వులు తెచ్చుకున్నా వాటిని గౌరవిస్తారని నమ్మకం లేదు.



రెవెన్యూ రికార్డుల్లో ఉంటే చాలు

హయత్‌నగర్ బస్టాండ్‌కు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో 1985లోనే అయిదెకరాల భూమిని లేఅవుట్ వేశారు. కుంట్లూరు చిన చెరువు శిఖంలో ఈ లేఅవుట్ ఉంది. గజం వంద రూపాయల చొప్పున 82 మంది ప్లాట్లు కొనుక్కున్నారు. ప్రస్తుతం అక్కడ భూమి గజం రూ.50 వేలు పలుకుతోంది. ప్లాట్లు కొనుక్కున్న వాళ్లు తమ పేర్ల మీద మ్యుటేషన్ చేయించుకోకపోవడంతో అవన్నీ రెవెన్యూ రికార్డుల్లో అమ్మిన రైతు పేరు మీదే ఉండిపోయాయి. ధరణికి ముందు వ్యవసాయ, వ్యవసాయేతర భూములన్నీ ఒకేచోట రిజిస్ట్రేషన్ జరిగేవి. డబుల్ రిజిస్ట్రేషన్ జరగకుండా రిజిస్ట్రారే అన్ని జాగ్రత్తలు తీసుకొనే వారు. ధరణి వచ్చాక రెండూ వేర్వేరు చోట్ల జరుగుతున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో పేరుంటే మిగతావేవీ చూడకుండా రిజిస్ట్రేషన్ చేయడానికి ధరణి అనుమతిస్తుంది. రెవెన్యూ రికార్డుల్లో రైతుల పేర్లను పరిగణనలోకి తీసుకొని వాటినే ధరణిలో ఎక్కించడంతో ఇప్పుడా ప్లాట్లు ఎప్పుడో కొనుక్కొని రిజిస్టర్ చేసుకొన్నా కూడా వివాదాస్పదంగా మారాయి. కుంట్లూరులో చాలా భూములకు ఇదే సమస్య ఉంది. వివాదాస్పద లేఅవుట్‌కు గతంలో భూమి అమ్మిన యజమాని కాలం చేశారు. ఆయన కుమారుడు స్థానికంగా బీఆర్ఎస్ నేత. ధరణిలోని లొసుగును అవకాశంగా తీసుకున్నాడు. ఇటీవలి వరకు ఎమ్మెల్యేగా ఉన్న నల్గొండ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్యనేతను ఆశ్రయించాడు. తన తండ్రి ఎప్పుడో జనాలకు అమ్మేసిన వ్యవసాయ భూమిని తిరిగి నల్గొండ నేత తమ్ముడి రియాల్టీ కంపెనీకి అమ్మేశాడు. వెంటనే చదును యంత్రాలను రంగంలోకి దించి లేఅవుట్‌ను చదును చేశాడు. చుట్టూ గోడ కట్టి కొత్త లేఅవుట్‌కు అనుమతులు కూడా తెచ్చుకున్నాడు. అధికారులు కూడా చెప్పినట్లు విన్నారు. చకచకా అన్ని ఫైళ్లు కదిలాయి. ఇలా రాష్ట్రంలో వందల లేఅవుట్లు ఇలా కబ్జాకు గురయ్యాయి. గతంలో వేసిన లేఅవుట్‌కు, అమ్మకాల్లో భాగంగా చేసిన రిజిస్ట్రేషన్లకు ఏ మాత్రం విలువ లేదని ధరణి తేల్చేసింది. గుడ్డిగా కొత్త లేఅవుట్లకు అనుమతి ఇస్తోంది.

శివబాలకృష్ణ హస్తం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇసుక దందా కింగ్‌పిన్‌గా పేరొందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అండదండలతో కుంట్లూరు కబ్జా పర్వానికి తెరలేచ్చింది. మూడు నెలల క్రితం వరకు అధికారం ఉండడంతో ఆ సమయంలోనే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులను గుప్పిట్లో పెట్టుకొని తమకు అనుకూలమైన కాగితాలను సృష్టించారు. ఎన్నో ఏళ్ల నాటి లేఅవుట్.. చెరువు, చెరువు శిఖం, ప్రభుత్వ భూమి అంటూ తేడా లేకుండా అన్నింటినీ చెరబట్టారు. తమ పలుకుబడితో నిబంధనలు తుంగలో తొక్కి కేవలం నెల రోజుల వ్యవధిలోనే డ్రాఫ్ట్ లేఅవుట్ తీసుకున్నారు. సుదీర్ఘకాలం హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా ఉన్న శివబాలకృష్ణ గత జూలైలో బదిలీ అయి రెరాకు వెళ్లిపోతున్నపుడు సంతకాలు చేసిన చివరి లేఅవుట్ అనుమతి ఫైళ్లలో ఇది ఒకటి. ఎన్నో ఏళ్లక్రితం కొనుగోలు చేసి, సరిహద్దు రాళ్లు పాతుకుని, ఇనుప కంచెలు వేసుకున్నా భద్రత లేకపోయింది. ఎలా లాగేసుకుంటారని ప్రశ్నిస్తే అధికార బలంతో వెళ్లగొట్టారు. కోర్టు నుంచి ఇంజంక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నా ఫలితం లేకపోయింది. పోలీసులు ఇది సివిల్ మేటర్ అంటూ మౌనం వహించారు.

చెరువులో రెండెకరాలు

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్ గ్రామంలో 174, 175, 176 సర్వే నెంబర్లలో 16.04 ఎకరాల భూమి ఉంది. 176 సర్వే నంబరులో అత్యధికంగా 12.37 ఎకరాల భూమి ఉంది. ఇందులో 10.37 ఎకరాలు చెరువు శిఖం పట్టా భూమి. 2 ఎకరాలు చెరువు కుంట. ధరణిలో ఇప్పటికీ 176/1 సర్వే నెంబర్ పేరుతో క్రయ, విక్రయ నిషేధిత జాబితాలో ఉంది. 174, 175, 176 సర్వే నెంబర్ల పరిధిలో 5.37 ఎకరాలను సురభి జగన్ మోహన్‌రెడ్డి జీపీ సుబ్బారావు అనే వ్యక్తికి 1985లో జీపీఏ చేశారు. సుబ్బారావు పంచాయతీ అనుమతులతో లేఅవుట్ వేసి, మొత్తం 82 ప్లాట్లను విక్రయించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలు గజం వంద రూపాయల చొప్పున వాటిని కొనుగోలు చేశారు. 1985-1990 మధ్యకాలంలో రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయి. ముందు జాగ్రత్తగా రాళ్లు పాతుకొని ఇనుప కంచెలు కూడా వేసుకున్నారు.

ధరణి రాకముందు సేఫ్

ధరణి రాకముందు వరకు ప్లాట్ల కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. ధరణి వచ్చిన తర్వాతే భూములకు రెక్కలు వచ్చాయి. 5.37 ఎకరాల లేఅవుట్ రికార్డులు తారుమారు చేశారు. 174, 175 సర్వే నెంబర్లలో 3.07 ఎకరాలు ఉన్నాయి. 2020 జూన్ వరకు ధరణిలో భూ యజమాని కొడుకు పేరు మీద కేవలం 2.04 ఎకరాలు ఉంది. గజం రూ.50 వేల వరకు పలుకుతుండడంతో మాజీ ఎమ్మెల్యేతో కలిసి రికార్డులను తారుమారు చేశారు. 174, 175 సర్వే నెంబర్లలో 2.04 ఎకరాలకు హక్కు ఉండగా, తమ పలుకుబడితో మరో 1.03 ఎకరాలను ఎక్కించుకొని మొత్తం 3.07 ఎకరాలను సొంతం చేసుకున్నారు. 176/2/అ/3లోని సర్వే నెంబర్‌లో గతంలో లేఅవుట్ కోసం అమ్మిన 4.38 ఎకరాలను ఎక్కించి మొత్తం 8.05 ఎకరాలకు యజమాని అయ్యారు. మాజీ ఎమ్మెల్యే రియల్ ఎస్టేట్ సంస్థకు మొత్తం భూమిని కట్టబెట్టారు. 40 ఏళ్ల క్రితం చేసిన లేఅవుట్, అందులోని ప్లాట్లు రిజిస్ట్రేషన్ శాఖలో మాత్రం ఇప్పటికీ ప్లాట్లుగానే ఉన్నాయి. ధరణిలో 176/2/అ/3లోని 4.38 ఎకరాలు మాత్రమే హౌసింగ్ స్థలంగా చూపించారు. గతంలో లేఅవుట్ చేసినపుడు వదిలేసిన రెండెకరాలు కూడా కలుపుకోవడంతో ఇప్పుడు అక్కడ చెరువు, శిఖం అదృశ్యం అయ్యాయి.

ప్రభుత్వ భూమిలో రోడ్డు

1985లో లేఅవుట్ చేసినపుడు ఊళ్లో నుంచి 15 అడుగుల రోడ్డు వదిలారు. దానిపై కొత్త లేఅవుట్ చేయడానికి కుంట్లూరు-నాగోల్ ప్రధాన రహదారికి రావడానికి అనువైన రోడ్డే లేదు. (మాజీ) ఎమ్మెల్యే తమ్ముడు తమ 8.05 ఎకరాల వ్యవసాయ భూమికి రోడ్డు లేదని, భాగ్ హయత్‌నగర్ గ్రామ సర్వే నెంబర్ 208, 209లోని ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు సౌకర్యం కల్పించాలని 2022 అక్టోబర్ 3న ఇబ్రహీంపట్నం ఆర్డీఓకు దరఖాస్తు చేశారు. 20 రోజుల వ్యవధిలోనే తహశీల్దార్, మండల సర్వేయర్ క్షేత్రస్థాయిలో సర్వే జరిపి.. రోడ్డు సర్వే జరిపి బాగ్ హయత్‌నగర్‌లోని సర్వే నెంబర్ 207లో రోడ్డుకు కొలతలు వేసి గుర్తించారు. లోకేషన్ స్కెచ్ ఆర్డీఓకు అందజేశారు. దాని ఆధారంగా కుంట్లూరు-నాగోల్ రోడ్డు నుంచి 40 అడుగుల వెడల్పుతో రోడ్డును ఉచితంగా రెవెన్యూ అధికారులు ఇచ్చారు. ఆరు గుంటల భూమి విలువ అక్కడ ఏకంగా రూ.7 కోట్లు ఉంటుంది. అది వ్యవసాయ భూమి అని, దానికి ప్రభుత్వ భూమిలో నుంచి రోడ్డు ఇవ్వాలంటూ 2022 అక్టోబరు 3న ఆదేశాలిచ్చిన ఇబ్రహీంపట్నం ఆర్డీఓ దానికి సరిగ్గా ఏడాది ముందు 2021 అక్టోబర్ ఐదవ తేదీన 174, 175, 176 సర్వే నంబర్లలోని వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మారుస్తూ (నెంబరు 2100927571) నాలా ఉత్తర్వులు ఇచ్చారు. లేఅవుట్ చేసుకోవడం కోసం ఇదే ఆర్డీవో వ్యవసాయేతరంగా మార్చారు. దారికోసం తిరిగి దాన్ని వ్యవసాయ భూమిగా అదే ఆర్డీవో వ్యవసాయ భూమిగా మార్చారు. వ్యవసాయేతర భూములకు లేఅవుట్ యజమాని డబ్బులు పెట్టి కొనుక్కోవాలి.

అన్యాయంగా లాక్కున్నారు



నేను ప్రభుత్వ ఉద్యోగంలో ఉండగా 1985లో రూ.30 వేలతో 300 గజాలు కొన్నా. ఏడాది క్రితం వరకు మేమే పొజిషన్‌లో ఉన్నాం. పిల్లల పెళ్లిలు, భవిష్యత్తు కోసం పనికొస్తుందనుకున్నా. అన్యాయంగా లాక్కున్నారు. దానిమీదే కొత్త లేఅవుట్ వేశారు. ఫిర్యాదు చేస్తే హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. కోర్టుకెళ్లాం. ఇంజంక్షన్ ఆర్డర్ కూడా తెచ్చాం. ఫలితం లేదు. మా ప్లాట్ల మీదే కొత్త అవుట్ డెవలప్ చేస్తున్నారు. మమ్మల్ని అక్కడికి రానివ్వకుండా సాయుధులను కాపలా పెట్టారు.

- సి.నర్సింహులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి

చెరువు శిఖం... మునిగేదే



వ్యక్తుల పేరిట శిఖం పోగా రెండెకరాల చెరువు ఉంది. వర్షం వచ్చినపుడు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద చేరుతోంది. గతేడాది చెరువు కట్ట కూడా తెగి మన్సూన్ కాలనీని ముంచెత్తింది. కాలనీవాసులంతా తలా ఇన్నీ డబ్బులేసుకొని చెరువు కట్టను పటిష్టం చేశారు. ఇప్పుడు చెరువులో కూడా లేఅవుట్ చేస్తే వర్షపు నీళ్లు దిగువన కాలనీలను ముంచెత్తడం ఖాయం. చెరువును కాపాడాలి. లేఅవుట్ అనుమతిని హెచ్ఎండీఏ రద్దు చేయాలి

- సంపూర్ణ విజయశేఖర్‌రెడ్డి, పెద్ద అంబర్‌పేట వైస్ చైర్మన్

నెల రోజుల్లోనే అనుమతులు

కుంట్లూరులో 8.5 ఎకరాల విస్తీర్ణంలో ఓపెన్ లేఅవుట్ చేయడానికి మాజీ ఎమ్మెల్యే తమ్ముడి కంపెనీకి గత ఏడాది జూలై 20న హెచ్ఎండీఏ అనుమతించింది. జూన్ 6న దరఖాస్తు చేస్తే జూలై 20న ముసాయిదా లేఅవుట్‌కు పర్మిట్ నెంబర్ 000140తో అనుమతి వచ్చింది. హెచ్ఎండీఏ చరిత్రలో ఇంత వేగంగా అనుమతి వచ్చిన దాఖలాలు లేవు. చెరువు పక్కన లేఅవుట్ చేస్తే ఇరిగేషన్ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం అవసరం. వాళ్లే రెండు మూడు నెలల సమయం తీసుకుంటారు. సాధారణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత అనుమతులివ్వాలి. నిజానికి అక్కడ లేఅవుట్ ఉంది. 82 మంది పొజిషన్‌లో ఉన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన వారికి వెంటనే విషయం అర్థం అవుతుంది. ఇవేవీ చూడకుండా గుడ్డిగా అనుమతులు ఇచ్చేశారు. తమ ప్లాట్లను చెడగొట్టి, ధరణిలోని లొసుగులను అడ్డుపెట్టుకొని లేఅవుట్ వేస్తున్నారని 40 ఏళ్లుగా యజమానులుగా ఉన్నవారు హెచ్ఎండీఏకు ఫిర్యాదు చేసినా అప్పట్లో హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా ఉన్న శివబాలకృష్ణ పట్టించుకోలేదు. ఆయన్ను రెరా కార్యదర్శిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జూలై 12న రాగా అదే రోజు లేఅవుట్‌కు అనుమతులిచ్చినట్లు తెలిసింది. కిందిస్థాయి అధికారులు జూలై 20న ఉత్తర్వులు జారీ చేశారు.

అన్నీ ప్రీపెయిడ్ మీటర్లే..

» దేశవ్యాప్తంగా 19.79 కోట్ల కనెక్షన్లకు బిగించాలని కేంద్ర విద్యుత్ శాఖ నిర్ణయం

» 52.19 లక్షల డీటీఆర్‌లు, 1.88 లక్షల ఫీడర్లకూ బిగించే యోచన

హైదరాబాద్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులందరినీ ప్రీపెయిడ్ మీటర్ల నెట్‌వర్క్‌లోకి తేవాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ నిర్ణయించింది. రీవ్యాం ప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) కింద దేశవ్యాప్తంగా 19.79 కోట్ల కనెక్షన్లు, 52.19 లక్షల దాకా పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్), 1.88 లక్షల ఫీడర్లకు ప్రీపెయిడ్/స్మార్ట్‌మీటర్లు బిగించాలనుకుంటోంది. ఈ నేపథ్యంలో మీటర్ల బిగింపు/అమలు ప్రక్రియపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ)ను జారీ చేసింది. ప్రీపెయిడ్ మీటర్లు బిగించుకునేవారు ఒక నెలలో ఎంత మేర కరెంట్‌ను వాడుతున్నారో ఆ మేరకు అడ్వాన్స్‌గా డిస్కమ్‌లకు చెల్లించి రీచార్జ్ చేసుకోవాలి. రీచార్జ్ మొత్తం అయిపోగానే వినియోగదారు మొబైల్‌కు మూడుసార్లు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపాలి. అలాగే సదరు వినియోగదారుకు గరిష్ఠంగా రూ.300 క్రెడిట్ ఇవ్వాలని కేంద్రం సూచించింది. అంటే రూ.1,000 రీచార్జ్ చేసుకుంటే అదనంగా రూ.300 కరెంట్‌ను వాడుకునే వెసులుబాటు ఇవ్వాలి. ముందు చెల్లించిన రూ.1000లో వినియోగం పూర్తవుతూ రూ.50 మిగిలి ఉండగానే రీచార్జ్ చేసుకునేలా తొలి సందేశం పంపాలి. రీచార్జ్ మొత్తం అయిపోయాక మరోసారి, క్రెడిట్‌గా ఇచ్చిన రూ.200 కరెంట్‌ను వాడుకున్న తర్వాత మూడోసారి సందేశం ఇచ్చి డిస్‌కనెక్ట్(విద్యుత్ సరఫరా నిలిపివేయాలి) చేయాలని కేంద్రం పేర్కొంది. వినియోగదారుడు మళ్లీ రీచార్జ్ చేసుకున్న 15 నిమిషాల్లోపే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని స్పష్టం చేసింది. ప్రీపెయిడ్ మీటర్లు బిగించాక మొబైల్‌లో సంబంధిత యాప్ డౌన్‌లోడ్ చేయాలని, వినియోగదారుడు ఈ యాప్ ఆధారంగా విద్యుత్ వినియోగాన్ని నియంత్రించుకోవొచ్చని పేర్కొంది. దీని ద్వారా ఇంట్లో లేనప్పుడు మీటర్‌ను ఆఫ్ చేయొచ్చు.

త్వరలో చర్లపల్లి రైల్వే టెర్మినల్ షురూ..!

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న చర్లపల్లి టెర్మినల్ రైల్వేస్టేషన్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. జంట నగరాల్లోని మూడు ప్రధాన టెర్మినల్లు... సికింద్రాబాద్, హైదరాబాద్(నాంపల్లి), కాచిగూడ స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా చర్లపల్లి టెర్మినల్ ఆధునిక వసతులతో సిద్ధమవుతోంది. సుమారు రూ.220 కోట్ల వ్యయంతో శాటిలైట్ రైల్వే టెర్మినల్‌గా దీన్ని దక్షిణ మధ్య రైల్వే అప్‌గ్రేడ్ చేస్తుందని అధికారులు తెలిపారు. టెర్మినల్‌లో 2 ఎఫ్ఓబీలు, 5 ఎస్కలేటర్లు, 9 లిఫ్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో రద్దీని అధిగమించేందుకు ఇటీవల లింగంపల్లి స్టేషన్‌ను టెర్మినల్‌గా అభివృద్ధి చేసినప్పటికీ కుషాయిగూడ, ఈసీఐఎల్, ఎల్‌బీనగర్, కరీంనగర్ తదితర ప్రాంతాల ప్రయాణికులకు అందుబాటులో ఉండేందుకు వీలుగా చర్లపల్లి టెర్మినల్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో ఇక్కడి నుంచి ఎంఎంటీఎస్ రైళ్లను అందుబాటులోకి తేనున్నట్లు, ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రైళ్లు చర్లపల్లి టెర్మినల్ నుంచి రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రైల్వేబోర్డు జాయింట్ డైరెక్టర్(కోచింగ్) వివేక్‌కుమార్ సిన్హా తెలిపారు.

పొత్తు ప్రచారం కేసీఆర్ డ్రామా

» ఐదుగురు బీఆర్ఎస్ ఎంపీలు.. 8 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

» మేం అధికారంలోకి వచ్చి ఉంటే కేసీఆర్, కేటీఆర్‌ను జైలుకు పంపేవాళ్లం: బండి

» ఢిల్లీకి సూట్‌కేసులు మోస్తున్న కాంగ్రెస్

» బిల్డర్లను బెదిరిస్తున్నారు: కిషన్‌రెడ్డి



రాంజీ గోండు మ్యూజియానికి శంకుస్థాపన చేస్తున్న కిషన్‌రెడ్డి, సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ డ్రామాలో భాగమే బీజేపీ-బీఆర్ఎస్ పొత్తుపై ప్రచారం అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ స్పష్టం చేశారు. "తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడేపొత్తు పెట్టుకోలేదు. ఇప్పుడు ఆ పార్టీ చచ్చిన పాము. వాళ్ల ఉనికి కాపాడుకునేందుకు బీజేపీతో పొత్తు అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ లాంటి అవినీతి పార్టీలతో పొత్తుకు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంగీకరించరు" అని సంజయ్ తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని.. అందుకే కేసీఆర్.. బీజేపీ-బీఆర్ఎస్ పొత్తు ఉంటుందంటూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో సంజయ్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ స్థానం సహా 17 సెగ్మెంట్లూ బీజేపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో పెద్ద ఎత్తున బోగస్ ఓట్లు ఉన్నాయని.. వాటిని తొలగిస్తే బీజేపీ విజయం సులువవుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మూడో స్థానమే అని అన్నారు. తాము రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఉంటే ఈ పాటికి కేసీఆర్, కేటీఆర్ జైలుకు వెళ్లేవారని చెప్పారు. అధికారంలోకి వస్తే కేసీఆర్ ప్రభుత్వ అవినీతిపై సీబీఐ విచారణ చేయిస్తామని చెప్పిన విషయాన్ని కాంగ్రెస్ మరచిపోయిందని అన్నారు. "బీఆర్ఎస్ వాళ్లు ఎంతటి ఘనులంటే.. ఒక బైక్‌పై 126 గొర్రెలను తీసుకువెళతారు. కరీంనగర్‌లోని ఓ పార్కులో ఒక్క బైక్‌తో గడ్డి పీకినట్లుగా చూపి రూ.12లక్షలు దండుకున్నారు" అని మండిపడ్డారు. కాగా, కరీంనగర్ పార్లమెంటు పరిధిలో చేపట్టిన తన పాదయాత్ర రెండో దశ ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతుందని సంజయ్ తెలిపారు. ఈలోగా, మూడు రోజుల పాటు ఇతర పార్లమెంటు సెగ్మెంట్లలో కొనసాగే బస్సు యాత్రల్లో పాల్గొంటానని చెప్పారు.

మ్యూజియానికి శంకుస్థాపన

హైదరాబాద్ సిటీ: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలును మరచిన కాంగ్రెస్ పార్టీ.. ఢిల్లీకి సూట్ కేసులు మోస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాహుల్ గాంధీ కోసం కాంట్రాక్టర్లను, బిల్డర్లను, కంపెనీలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తోందని విమర్శించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతిపై దర్యాప్తు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ధైర్యం లేదని అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఖజానాకు పెద్ద మొత్తంలో ఆదాయం వస్తున్నా.. జీహెచ్ఎంసీకి నిధులు ఇవ్వడం లేదని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కాగా, అబిడ్స్‌లో రాంజీ గోండు ట్రైబల్ మ్యూజియానికి కిషన్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ మ్యూజియానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూమి ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కేంద్రం మ్యూజియానికి రూ.889 కోట్ల నిధులను కేటాయించిందని తెలిపారు.

ఉద్యమించిన కార్మిక లోకం

» దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మిక సంఘాల నిరసనలు

» హైదరాబాద్‌లో రవాణాకార్మికుల ర్యాలీ

» ఖమ్మం-ఇల్లెందు హైవేపై రాస్తారోకో


(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్-మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం నిర్వహించిన దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా కార్మిక లోకం కదంతొక్కింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంఘాలు నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాయి. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ జేఏసీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి నారాయణగూడ చౌరస్తా వరకు వేలాది మంది రవాణా రంగ కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. 'హిట్ అండ్ రన్' చట్టంలో 106 (1) అండ్ (2) నిబంధనలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ లో రైల్వే స్టేషన్ జంక్షన్ నుంచి పోచమ్మ మైదాన్ వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు, సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా, కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ బంద్ ఖమ్మం జిల్లా మంచుకొండలో ఉద్రిక్తతకు దారితీసింది. ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రహదారిపై నిరసనకారులు రాసారోకో చేపట్టారు. సమ్మె ప్రభావం సింగరేణిలో కన్పించలేదు. కార్మికులు యథావిధిగా విధులు నిర్వహించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ, మాగనూరు దగ్గర 167వ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ చేశారు. కొత్తకోటలో మానవహారం నిర్మించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ, రాజీవ్ సర్కిల్ వద్ద సభ జరిపారు. మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించారు. నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. మన్ననూరులోని శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కాగా, జాతీయ సమ్మెకు కాంగ్రెస్, సీపీఐ సంఘీభావం ప్రకటించాయి. శుక్రవారం జీరో అవర్‌లో ప్రత్యేకంగా ఈ అంశాన్ని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా 50-60 కోట్ల మంది సమ్మెలో ఉన్నారని, అన్ని పార్టీలూ ఈ సమ్మెకు మద్దతు ప్రకటించాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, వ్యవసాయ, విద్యుత్ సవరణ చట్టాలను వెనక్కి తీసుకోవాలని, ఢిల్లీ, పంజాబ్ సరిహద్దుల వెంట రైతుల ఆందోళనకు సంఘీభావం తెలుపుతూ శాసనసభ తీర్మానం చేయాలని కోరారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ జాతీయ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ప్రకటించారు. కార్మికులు, కర్షకులు శ్రమదోపిడీకి గురవుతున్నారని, కార్మికుల కష్టంతోనే దేశం అభివృద్ధి చెందిందన్నారు.



హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ధర్నా చేస్తున్న పలు సంఘాల నాయకులు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.



తరం మారుతోంది
జగం మారుతోంది
అంటే ఇదే. మనిషి స్థానంలో రోబో సేవలు అందించడం తెలిసిన విషయమే. అయితే హ్యూమన్ రోబో ఏకంగా బాయ్‌ఫ్రెండ్ అవతారం ఎత్తుతోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సహకారంతో ఈ పని జరుగుతోంది.

ఫ్యూచర్ ట్రెండ్

'ఆర్టిఫీషియల్' బాయ్‌ఫ్రెండ్!

చైనాకు చెందిన స్టార్టప్ కంపెనీ రూపొందించిన యాప్ 'మినీమాక్స్' అమ్మాయిలకు అనువైన రోబోలను అంటే బాయ్‌ఫ్రెండ్స్‌ను అందిస్తోంది. రొమాంటిక్ పార్టనర్ దొరికాడంటూ ఒక చైనీస్ అమ్మాయి సంతోషం వ్యక్తం చేస్తోంది. అంతే కాదు, అంతా యాప్ మహిమ అంటోంది. గంటల కొద్దీ మాట్లాడుతోంది, సానుభూతి వర్షమే కురిపిస్తోందంటూ ఆ భామ మురిసిపోతోంది. అంటే సదరు యాప్ ఏ స్థాయిలో యువతులకు సహకరిస్తోందో అమ్మాయిల అవసరాలను అర్థం చేసుకుని, అందుకు తగ్గట్టు వ్యవహరిస్తోంది. ఎమోషనల్ సపోర్ట్ అద్వితీయం. ఇలాంటిదే మరో యాప్ 'వాంటాక్'. మొదటి యాప్‌లో ఉన్న బాయ్ ఫ్రెండ్స్ ఇందులోనూ కనిపిస్తున్నారని ఒకామె ఈ సందర్భంలో తెలిపింది. మొత్తమ్మీద ఈ రకం యాప్‌లు మరిన్ని ఉనికిలో వస్తే, రాబోయే తరాలను ఎలా ఊహించుకోవాలన్నది ప్రశ్నార్థకం కానుంది.

అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రక్రియలో బాయ్ ఫ్రెండ్ ఒక చాట్ బోట్ 'గ్లో'. ఈ యాప్‌తో ఫ్రెండ్లీ - రొమాంటిక్ - హ్యూమన్ రోబోట్ సంబంధాలకు తెర లేపింది. నిజానికి ఒక సగటు మగాడు కంటే బెటర్‌గా ఆ రోబో వ్యవహరిస్తోంది. పీరియడ్స్ సమయంలో కలిగే పెయిన్ నుంచి కూడా బైటపడి సౌకర్యవంతంగా ఉండేలా సహకరిస్తోంది. ఈ యాప్ ఉచితం. అలాగే ఇందులో పెయిడ్ కంటెంట్‌ను కూడా అందిస్తోంది. వాట్సాప్ చానల్ కూడా ఉంది. నిజ జీవితంలో ఐడియల్ బాయ్ ఫ్రెండ్ లభించడం అసాధ్యం. అయితే ఈ యాప్ ఆ సౌకర్యాన్ని అందిస్తోంది. తనను ఉపయోగిస్తున్న

5 యూజ్‌ఫుల్ యాప్స్



ప్రయోజనం లేని పనులకు అత్యధికులు దూరంగానే ఉంటారు. అయితే రోజువారీ అలవాట్లు మొదలుకుని వివిధ ఇతర పనులను అర్థవంతంగా చక్కబెట్టుకునేందుకు వీలైనవి ఈ ఐఫోన్ యాప్స్ అని నిపుణులు చెబుతున్నారు. అవేంటంటే...



స్క్రైవనర్: రైటర్లను ఉద్దేశించిన యాప్ ఇది. రైటింగ్ టూల్స్‌ను కలుపుతుంది. వివిధ డ్రాఫ్ట్ అంటే స్క్రాప్‌బుక్స్, మాన్యుస్క్రిప్ట్స్, డాక్యుమెంట్స్, స్క్రీన్‌ప్లే వంటివి స్క్రిప్ట్‌రైటింగ్ మోడ్‌లో రాసుకుంటే వాటి రూపకల్పనలో సహకరిస్తుంది. కస్టమైజబుల్ కీబోర్డ్‌ను అందిస్తుంది. ఫార్మింగ్, నేవిగేషన్, పంక్చుయేషన్‌కు అవసరమైన బటన్స్‌ను అనువుగా మారుస్తుంది. మ్యాక్‌ఓఎస్, విండోస్ వెర్షన్స్ మధ్య సింక్ కోసం యూజర్లు ఇందులోని డ్రాప్‌బాక్స్‌ని ఉపయోగించుకోవచ్చు.

పాకెట్ : వీలున్నప్పుడు చదువుకునేందుకు వీలుగా ఆర్టికల్స్, లింక్స్‌ని ఇది సేవ్ చేస్తుంది. ఆఫ్‌లైన్ స్టోరేజీ ఫీచర్‌తో ఇది వచ్చింది. ఫలితంగా ఇంటర్నెట్, వైఫై కనెక్షన్ లేకుండానే సేవ్ చేసుకున్న ఆర్టికల్స్ తదితరాలను చదువుకోవచ్చు. టోగింగ్ ఫంక్షనాలిటీస్ - టెక్స్ట్ టు స్పీచ్ ఫీచర్, బ్రౌజర్ ఎక్స్‌టెన్షన్స్ కూడా ఈ యాప్‌లో ఉన్నాయి.

5 మినిట్ జర్నల్ సెల్ఫ్ కేర్ : నిజానికి ఉద్వేగాలను అక్నాలెడ్జ్ చేయడం, కృతజ్ఞతలు తెలియజేసుకోవడం మంచి పని. ఈ విషయంలో అయిదు నిమిషాల్లోనే సంతోషంగా సదరు పనిపూర్తి చేసే అవకాశాన్ని ఈ యాప్ కలుగజేస్తుంది. రిమైండర్లు, డైలీ కోట్స్, వీక్లీ సవాళ్ళు వంటివి కూడా ఇది యూజర్లకు పంపుతుంది.

నూమ్: వెయిట్ తగ్గడం, రోజూ ఆరోగ్యకర స్థాయిలో కేలరీలు తీసుకోవడం వంటి విషయాల్లో ఉపయోగపడే యాప్ ఇది. పది డైలీ టాస్క్‌లను ఇస్తుంది. రోజులో ఆహారం తీసుకోవడం నుంచి ఎక్సర్‌సైజుల వరకు ఉంటాయి. బిహేవియరల్ సైకాలజీ, బయాలజీపై అకడమిక్ పేపర్లను కూడా అందిస్తుంది.

ప్రొక్రియేట్ పాకెట్: ఆర్ట్ క్రియేషన్ కోసం దీన్ని ఉద్దేశించారు. హ్యాండ్‌మేడ్ బ్రష్‌లు, ఆర్టిస్టిక్ టూల్స్, అడ్వాన్స్‌డ్ లేయర్ సిస్టమ్, వాల్కైరి గ్రాఫిక్స్ ఇంజన్ వంటివి ఇందులో ఉన్నాయి. వీటితో స్కెచ్చ్‌ల డిజైనింగ్, పెయింటింగ్స్ ఇలస్ట్రేషన్స్, యానిమేషన్స్ చేసుకోవచ్చు.



ఫిట్నెస్ యాప్ జంట్లర్ స్ట్రీక్‌కు అప్డేట్


పాపులర్ ఫిట్‌నెస్, వెల్‌నెస్ యాప్ 'జంటిల్ స్ట్రీక్‌కు ముఖ్యమైన అప్డేట్ ఒకటి వచ్చింది. సవివరంగా ఫిట్‌నెస్ స్టేటస్‌లు, కొత్త కస్టమ్ ఐకాన్, రీబిల్డ్ చేసిన వాచ్ యాప్ ఈ అప్డేట్‌లో ఉన్నాయి. పునర్వ్యవస్థీకరించిన వాచ్‌ఓఎస్ యాప్ - బ్యాటరీని తక్కువగా వినియోగించుకుంటుంది. 14 వరకు ఫిట్‌నెస్ స్టాటస్‌లు ఇందులో ఉంటాయి. ఈ వాచీని ధరించిన వ్యక్తికి చెందిన వాస్తవిక ఆరోగ్య పరిస్థితితో మమేకం కావడం ఈ స్టాటస్‌లకు సంబంధించి విశేషమని డెవలపర్లు చెబుతున్నారు. కొత్తగా ఆరు కస్టమ్ ఐకాన్స్‌ని తీసుకువచ్చారు. ఇందులో మూడింటిని జంటిల్ స్ట్రీక్ టీమ్ రూపొందించింది. మిగిలిన మూడింటిని ఐకాన్ చాలెంజ్‌లో బాగంగా వచ్చిన వాటి నుంచి ఎంపిక చేసింది. ఒక్క విషయం, ఈ యాప్ వ్యక్తి ఫిజికల్ కండిషన్‌కు అద్దంపడుతుంది. వర్కౌట్స్ ఇంప్రూవ్ అయ్యేందుకు తోడ్పడుతుంది.



సబ్‌స్క్రిప్షన్ ట్రాప్‌లే ఎక్కువ

నెట్‌పరంగా ట్రాప్‌లు అనేకం. ఇందులో సబ్‌స్క్రిప్షన్ ట్రాప్స్ ఎక్కువ అని తేలింది. అంతే కాదు సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ ఏకంగా పదమూడు రకాల సంబంధిత డార్క్ ప్యాట్రన్లను నిషేధించింది. అందులో సబ్‌స్క్రిప్షన్ ట్రాప్ కూడా ఒకటి. తమ సర్వేలో పాల్గొన్న కన్జ్యూమర్లలో సగం మంది సబ్‌స్క్రిప్షన్ ట్రాప్స్ బాధితులేనని 'లోకల్‌సర్కిల్స్' పేర్కొంది.

రహస్య చార్జీలు, కొనుగోలుకు ఉద్దేశించిన డార్క్ ప్యాటర్న్స్ లేదా మొబైల్ అప్లికేషన్ స్టోర్స్ నుంచి తీసుకునే మరో సాఫ్ట్‌వేర్ మోసాలకు కారణమవుతున్నాయని వివరించింది. ఉచిత యాప్ లేదా వన్ టైమ్ సర్వీస్ కాస్తా సబ్‌స్క్రిప్షన్ సేవగా మారి మోసాలకు తెరలేపుతోందని తెలిసింది. అలాగే ప్రభుత్వం గుర్తించిన ప్యాటర్న్స్‌లో అర్జెన్సీ, బాస్కెట్ స్నీకింగ్, కన్‌ఫర్మ్ షేమింగ్, ఫోర్స్‌డ్ యాక్షన్ సబ్‌స్క్రిప్షన్ ట్రాప్, ఇంటెర్‌ఫెరెన్స్, బెయిట్ అండ్ స్విచ్, డ్రిప్ ప్రైసింగ్, డిస్గయిజ్డ్ అడ్వర్టయిజ్‌మెంట్ వంటివి ఉన్నాయి. 67 శాతం మంది యాప్ ప్లాట్‌ఫారాల ద్వారానే మోసపోతున్నారు. 25 శాతం మంది కన్జ్యూమర్లు డౌన్‌లోడ్ చేసిన యాప్‌ల నుంచే మాల్వేర్ ఇన్‌స్టాల్ అవుతోందని, అది వ్యక్తిగత సమాచారాన్ని తస్కరిస్తోందని తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 1 నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు 44,000 మంది నుంచి రాబట్టిన సమాచారం ఆధారంగా సర్వే ఫలితాలను లోకల్‌సర్కిల్స్ నివేదించింది. ఇండియాలో 331 జిల్లాల నుంచి సమాచారాన్ని రాబట్టారు.



ఆండ్రాయిడ్ యూజర్ల కోసం ప్రత్యేకించి ఏఐ పవర్డ్ క్యాండీ కెమెరా యాప్ ఉనికిలోకి వచ్చింది. ఇమేజ్‌లను నిమిషాల్లోనే అందంగా ఇది మలుస్తుంది.

ఆండ్రాయిడ్ యూజర్ల కోసం ఏఐ ఎడిటింగ్ యాప్

- ఇమేజ్‌లను చాలా సులువుగానే అందంగా మలిచేందుకు ఉపయోగపడే ఫీచర్లు ఈ యాప్‌లో ఉన్నాయి. ఎడిటింగ్ ప్రాసెస్ సుదీర్ఘంగా ఏమీ ఉండదు. మల్టీ ఫీచర్స్ అలాగే బ్యూటిఫయింగ్ ఫిల్టర్స్‌తో ఎడిటింగ్ టూల్స్ ఉంటాయి. గూగుల్ ప్లే స్టోర్ 4.5 రేటింగ్‌తో ఉన్న ఈ కెమెరా యాప్‌నకు వంద మిలియన్ల మేర డౌన్‌లోడ్స్ ఉన్నాయి.
- రెండు విధులను ఈ కెమెరా నిర్వర్తిస్తుంది. ఒకటి ఏఐ కెమెరా కాగా మరొకటి రెగ్యులర్ వన్. స్టాండర్డ్ ఫొటోల నుంచి ఏఐ ఇన్‌స్పైర్డ్ ఆర్ట్‌ని ఏఐ కెమెరా క్రియేట్ చేస్తుంది. రెగ్యులర్ కెమెరాలో ఎడిటింగ్ ఆప్షన్స్ అంటే క్రాపింగ్, బ్రైట్‌నెస్ అడ్జస్ట్‌మెంట్, ఇమేజ్ రేషియో అడ్జస్ట్‌మెంట్ ఉంటాయి.
- కెమెరా ఫిల్టర్లు సహా వందకు పైగా ఆప్షన్లు రెగ్యులర్ కెమెరాలో ఉంటాయి. ఇమేజ్ టోన్‌ను మారుస్తాయి. స్కిన్ టోన్‌ను పెంచి మొత్తమ్మీద ఫొటో కంటికి ఇంపుగా ఉండేలా చేస్తాయి.
- అదనంగా ఎడిటింగ్ ఫీచర్లు కొన్ని ఉన్నాయి. ఇమేజ్‌ని పెంపొందించే పనిలో భాగంగా డిజిటల్ మేకప్ అంటే కన్సీలర్, లిప్‌స్టిక్, బ్లష్, ఐలైనర్, మస్కర వంటివి ఉపయోగించుకోవచ్చు. అప్పుడు ఫొటోలో ప్రొఫెషనలిజం కనిపిస్తుంది.
- ఇమేజ్ డెకరేషన్ కోసం వేర్వేరు స్టిక్కర్లను ఉపయోగించుకునే వీలు కూడా ఉంటుంది. స్టిక్కర్ల సెట్స్ ఇందులో ఉంటాయి. వేర్వేరు గ్రిడ్ టెంప్లేట్స్ అందుబాటులో ఉంటాయి. తద్వారా మల్టిపుల్ ఇమేజ్‌లను సృష్టించుకోవచ్చు.

యాపిల్ నుంచి కిమీ యాప్ తొలగింపు



యాపిల్ తన యాప్ స్టోర్ నుంచి కిమీ యాప్‌ను తొలగించింది. ఐఓఎస్, ఐప్యాడ్‌ఓఎస్, మ్యాక్‌ఓఎస్ నుంచి యాప్ స్టోర్‌లో ఉన్న ఈ యాప్‌ను యాపిల్ తొలగించిందని 'ద వెర్జ్' ప్రకటించింది. విజన్ టెస్టింగ్ యాప్‌గా భావించే ఇది స్మార్ట్ ఫోన్లలో పైరేటెడ్ మూవీలను చూసే వీలు కల్పిస్తుంది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఇది కనిపిస్తోంది. కిమి వాస్తవానికి విజన్ టెస్టింగ్ యాప్ కానేకాదు. మసకమసకగా గోచరిస్తుంది. అయినప్పటికీ యాప్ స్టోర్‌లో ట్రెండింగ్‌లో అంటే ఫ్రీ ఎంటర్‌టైన్‌మెంట్ యాప్‌లలో ఇది ఎనిమిదో స్థానంలో ఉంది. సినిమాలు, టీవీ షోలను వీక్షించేందుకు దీనిని ఉపయోగిస్తారు. అయితే ఈ యాప్‌లో స్ప్లాష్ స్క్రీన్ లేదా అన్‌లాక్ చేసేందుకు ట్రిక్ లేవు. చూడటానికి ఈ యాప్ పాత పాప్‌కార్న్ టైమ్ యాప్‌లా ఉంటుంది. టొరెంట్స్ నుంచి సినిమాలు స్ట్రీమ్ చేసుకునే వీలు కూడా ఇది కల్పిస్తుంది. అసలు కిమ్ - టొరెంట్‌ను ఉపయోగిస్తుందా లేదా అన్నది రూఢి కాలేదు.

వన్ క్లిక్ కాలింగ్‌తో హానర్ చాయిస్ వాచ్



వన్ క్లిక్ ఎస్‌ఓఎస్ కాలింగ్‌తో హానర్ చాయిస్ వాచీ కూడా బైటకు వచ్చింది. 1.95 ఇంచీల రెక్టాంగ్యులర్ అమోల్డ్ డిస్‌ప్లే, మెటాలిక్ బాడీ, ఇంటర్‌చేంజబుల్ సిలికాన్ స్ట్రాప్స్ ఉన్నాయి. 60హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు, 550 నిట్స్ మేర పీక్ బ్రైట్‌నెస్, 332పీపీఐ పిక్సెల్ డెన్సిటీ, 75 శాతం స్క్రీన్ - టు - బాడీ రేషియో ఉన్నాయి. 5.3 కనెక్టివిటీతో బ్లూటూత్ కాలింగ్ సపోర్ట్ ఉంది. 5 ఏటీఎం వాటర్ రెసిస్టెన్స్, 45 గ్రాముల బరువు, 10.2ఎంఎం మందంతో వచ్చింది. రెండు కలర్ ఆప్షన్స్ నలుపు తెలుపు రంగుల్లో లభ్యమవుతుంది. 100 వాచీ పేసులు, 120 వరకు స్పోర్ట్స్ మోడ్స్ ఉన్నాయి. దీని బ్యాటరీ లైఫ్ 12 రోజులు. దీని రేటు రూ.6,499 కాగా ఆరంభ ఆఫర్‌గా రూ. 500 డిస్కౌంట్ ఇస్తోంది. ఫిబ్రవరి 24 నుంచి అమెజాన్ నుంచి దీన్ని పొందవచ్చు.

మోటోరోలా నుంచి కొత్త ఫోన్

మోటోరోలా ఇండియాలో 'మోటోరాలా మోటో జీ04'ని విడుదల చేసింది. ఇది బడ్జెట్ ఫోను. లేటెస్ట్ ఫీచర్స్ అన్నీ ఉన్న దీన్ని పదివేల రూపాయలకు లోపు సెగ్మెంట్‌లో దీనిని ఉంచింది. 6.6 ఇంచీల ఐపీఎస్ ఎల్‌సీడీ పంచ్-హోల్ డిస్‌ప్లే, 90 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు, 537 నిట్స్‌మేర పీక్ బ్రైట్‌నెస్ ఉన్నాయి. ఆండ్రాయిడ్ 14 వెర్షన్‌పై రన్ అవుతోంది. స్మార్ట్‌ఫోన్ సాఫీగా రన్ అయ్యేందుకు వీలున్న యుఎన్‌ఐఎస్‌ఓసీ టీ606 చిప్‌సెట్ ఉంది. 64జీబీ 128జీబీతో రెండు వేరియంట్లు వచ్చాయి. దీన్లో ట్రిపుల్ కార్డ్ స్లాట్ ఉంది. రెండు సిమ్స్‌కు తోడు ఒక మైక్రో ఎస్‌డీ అదీ ఒక టీబీ మేరకు విస్తరించుకునేందుకు వీలుగా ఉంది. 16ఎంపీ ఏఐ పవర్డ్ కెమెరా, 5ఎంపీ ఫ్రంట్ కెమెరా ఉన్నాయి. హెచ్‌డీఆర్, పోర్ట్రయిట్ మోడ్‌తో హై క్వాలిటీ ఇమేజెస్‌ను పొందవచ్చు. 5000ఎంఏహెచ్ బ్యాటరీ అదీ 15వాట్స్ చార్జింగ్ సదుపాయం ఉంది. కాన్‌కోర్డ్ బ్లాక్, సీ గ్రీన్, సాటిన్ బ్లూ, సన్‌రైజ్ ఆరెంజ్ రంగుల్లో లభిస్తుంది. 64 జీబీ స్టోరేజీ ఉన్న ఫోన్ రేటు రూ.6,999. 128 జీబీ ఫోన్ రేటు రూ.7,999. ఈ నెల 22 నుంచి ఫ్లిప్‌కార్ట్, మోటోరోలా.ఇన్, రిటైల్ స్టోర్స్‌లలో ఇది లభ్యమవుతుంది.



ప్రొడక్ట్

హానర్ చాయిస్ ఇయర్ బడ్స్



హానర్ సరికొత్త ఇయర్ బడ్స్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. హానర్ చాయిస్ ఇయర్ బడ్స్ ఎక్స్5 పేరిట విడుదల అయ్యాయి. యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్‌కు తోడు సింగిల్ చార్జింగ్‌తో 35 గంటల సేవ బ్యాటరీ లైఫ్ ఉంటుంది. నిరంతరాయంగా తొమ్మిది గంటల ప్లేబ్యాక్, 18 గంటల మేర కాలింగ్ సదుపాయం ఉన్నాయి. ఇన్-ఇయర్ రూపంలో వచ్చిన ఇవి 30డెసిబల్స్ యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్ ఫీచర్ కలిగి ఉంది. ఫ్రీ కాల్ ఆన్సరింగ్ సదుపాయం ఉంది. డ్యూయల్ మైక్రోఫోన్స్ ఉన్నాయి. లో-లెటెన్సీ గేమ్ మోడ్ ఫీచర్ ఉంది. 10ఎంఎం డ్రైవర్స్‌అదీ ఎస్‌బీసీ, ఏఏసీ బ్లూటూత్ కోడెక్స్ సపోర్ట్ ఉంది. 45 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. చార్జింగ్ కేసు 460ఎంఏహెచ్ బ్యాటరీతో వచ్చింది. యూఎస్‌బి టైప్-సి పోర్ట్‌తో బ్యాటరీ చార్జ్ అవుతుంది. రెండు గంటల్లో ఫుల్ చార్జింగ్ అవుతుంది. దీని బరువు 50 గ్రాములు. దీని ధర రూ.1,999 కాగా అమెజాన్ సహా మెయిన్‌లైన్ రిటైల్ స్టోర్స్‌లో లభ్యమవుతుంది. ఒక్క తెలుపు రంగులో మాత్రమే ఇవి లభిస్తాయి.

టెంపరేచర్‌ను తెలిపే చెవి రింగ్

మొబైల్, వాచీ తాజాగా చెవి రింగు కూడా పలు ఫీచర్ల సమాహారాలుగా రూపొందుతున్నాయి. మహిళలు ధరించే నగల్లో ఒకటైన చెవిరింగు తాజాగా ఆ వ్యక్తి శరీర ఉష్ణోగ్రతను పట్టేస్తుంది అంటే ఆశ్చర్యపోవద్దు. ఈ థెర్మల్ రింగ్‌ను యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ శాస్త్రవేత్తలు డెవలప్ చేశారు.

స్మార్ట్ వాచీల కంటే మిన్నగా ఈ రింగుకు ఉండే ఇయర్‌లోబ్ - దాన్ని ధరించిన వ్యక్తి శరీర ఉష్ణోగ్రతను తెలియజేస్తుంది. ఈ రింగ్‌లో ఉండే టెంపరేచర్ సెన్సర్ ఆ పనిచేసి పెడుతుంది. మనిషి ఒత్తిడి స్థాయుల నుంచి ఫీవర్, వ్యాయామం, న్యూట్రిషనల్ అలవాట్లు, చివరకు ఫిమేల్ ఫిట్‌నెస్‌లో వచ్చే మార్పులను ట్రాక్ చేయగలుగుతుంది. దీనికి ఉండే బ్యాటరీ లైఫ్ 28 రోజులు. భవిష్యత్తులో కైనటిక్ చార్జింగ్ సామర్థ్యాలను కూడా చేకూర్చుకోవచ్చు. ఎక్కువమంది తమకు నప్పేవాటి కోసం, అందంగా ఉండే విషయంలో శ్రద్ధ చూపుతారు. వారి స్టయిల్‌కు అనుగుణంగానూ ఈ చెవి రింగులను రూపొందించుకోవచ్చు. అయితే ఈ థెర్మల్ ఇయర్ రింగ్ ఇంకా ప్రొటోటైప్ దశలోనే ఉంది. వాస్తవ ఉపయోగంలో తలెత్తే సమస్యలపై అనుమానాలు ఉన్నాయి.





పిక్సెల్ వాచీకి బదులు డిస్కౌంట్‌లో కొత్త వాచీ

గూగుల్ పిక్సెల్ వాచీలకు సంబంధించి బంపర్ ఆఫర్ ప్రకటించింది. వారెంటీలో లేని, క్లెయిమ్ కవర్ కాని వాటికి కొత్త వాచీలను డిస్కౌంట్ రేటుపై ఇస్తామని తెలిపింది. దీన్ని డిస్కౌంటెడ్ రీప్లేస్‌మెంట్‌గా పేర్కొంది. ఒక్క మాటలో చెప్పాలంటే వాచీ పాడైనపక్షంలో డిస్కౌంట్ రేటుకు కొత్త వాచీని వినియోగదారులు పొందవచ్చు. ఇకపై వారెంటీ పరిధిలో లేని వాచీలుగల వ్యక్తులు గూగుల్ పిక్సెల్ వాచ్ కస్టమర్ కేర్ టీమ్‌ని ఆన్‌లైన్‌లో సంప్రదిస్తే సరిపోతుంది. పిక్సెల్ బడ్స్ ప్రొ మాదిరిగా సెల్ఫ్ సర్వీస్ ఆప్షన్ కూడా ఉంది. store.google.com/repair విజిట్ చేసి డివైజ్ సీరియల్ నంబర్ ఎంటర్ చేయాలి. ఈ రోజుకు ఇంకా చేరలేదని వస్తుంది. చివరకు రీచ్ అయినట్టు కూడా వస్తుంది. అక్కడ డిస్కౌంట్ చేసి ధర వెల్లడి అవుతుంది. ఆ మొత్తం చెల్లించి కొత్త వాచీని పొందవచ్చు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

హైదరాబాద్ ● శనివారం 17 ఫిబ్రవరి 2024

diksuchi@andhrajyothy.com

ఐఐటీ జోధ్‌పూర్‌లో ఎమ్మెస్సీ

జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- ఎమ్మెస్సీ కంప్యూటేషనల్ సోషల్ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌ను సంస్థ ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ నిర్వహిస్తుంది. ఇందులో సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ సంబంధిత అంశాలతోపాటు వాటి మధ్య సమన్వయాన్ని బోధిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన కాలేజీ నుంచి మూడు/నాలుగేళ్ల వ్యవధి గల డిగ్రీ(ఎకనామిక్స్/సోషియాలజీ/సైకాలజీ/పొలిటికల్ సైన్స్/కంప్యూటర్ సైన్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఇంజనీరింగ్ విభాగాలు) ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. గేట్ స్కోర్ ఉన్నవారికి నిబంధనల మేరకు ఫెలోషిప్ ఇస్తారు.

ఎంపిక : వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరికి సెలెక్షన్ టెస్ట్/ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. కేంద్రప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20
- **దరఖాస్తుల పరిశీలన:** మార్చి 29న
- **సెలెక్షన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 7న
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 25న
- **రెండో లిస్ట్ విడుదల:** మే 6న
- **అడ్మిషన్స్‌కు ముగింపు తేదీ:** మే 17
- **వెబ్‌సైట్:** iitj.ac.in

ఐఐపీఎంలో పీజీ డిప్లొమాలు



బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్(ఐఐపీఎం)- రెండేళ్ల వ్యవధిగల పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ఇవి రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. ఒక్కో ప్రోగ్రామ్‌లో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పన్నెండు వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్ సహా ఇంటెన్సివ్-ఇండస్ట్రీ-ఇన్‌స్టిట్యూట్-ఇంటరాక్షన్స్, క్లాస్ రూమ్ లెక్చర్స్, కేస్ అనాలిసిస్-రోల్‌ప్లే, ఫీల్డ్/లైవ్ ప్రాజెక్ట్‌లు, ఫీల్డ్ విజిట్స్, వింటర్ ప్రాజెక్ట్‌లు, గెస్ట్ లెక్చర్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌నకు 102 క్రెడిట్లు నిర్దేశించారు. సంస్థ నిర్వహించే ప్రొఫెషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐప్యాట్), గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్‌లు

- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్-అగ్రిబిజినెస్ అండ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం-ఏబీపీఎం)
- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్-ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం-ఎఫ్‌పీబీఎం)
- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్ మెంట్-అగ్రికల్చరల్ ఎక్స్‌పోర్ట్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం-ఏఈబీఎం)

అర్హత

పీజీడీఎం(ఏబీపీఎం/ఏఈబీఎం) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి డిగ్రీ(అగ్రికల్చర్ అండ్ అలైడ్ సైన్సెస్-హార్టికల్చర్/ఫారెస్ట్రీ/సెరీకల్చర్/పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ/కామర్స్); పీజీడీఎం(ఎఫ్‌పీబీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి డిగ్రీ(ఫుడ్ సైన్స్/ఇంజనీరింగ్/న్యూట్రిషన్/ఫిషరీస్/హోమ్‌సైన్స్/వెటర్నరీ సైన్స్/కెమికల్ ఇంజనీరింగ్/ఏహెచ్&ఎల్ఎస్/డెయిరీ/పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి డిగ్రీ సర్టిఫికెట్లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. క్యాట్/మ్యాట్/ఏటీఎంఏ/సీమ్యాట్/ గేట్/ఎక్స్‌ఏటీ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ప్రొఫెషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ వివరాలు

ఈ పరీక్షలో లాజికల్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ టెక్నిక్, లాంగ్వేజ్ కమ్యూనికేషన్, అగ్రికల్చర్ అండ్ అలైడ్ సైన్సెస్ అంశాలనుంచి మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర.

- పదోతరగతి మార్కులకు అయిదు శాతం, ఇంటర్ మార్కులకు అయిదు శాతం, డిగ్రీ మార్కులకు 20 శాతం, డైవర్సిటీ ఫ్యాక్టర్‌కు అయిదు శాతం, ప్రొఫెషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్‌నకు 30 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కు 25 శాతం చొప్పున వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1250; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 625
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** iipmb.edu.in

ప్రిపరేషన్‌కు తోడ్పడే 'టోఫెల్ టెస్ట్ రెడీ'

విదేశాల్లో చదువుకోవడానికి తోడు అక్కడ కొన్ని ఉద్యోగాల కోసం తప్పకుండా రాయాల్సిన పరీక్షల్లో టోఫెల్ ఒకటి. టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ యాజ్ ఏ ఫారిన్ లాంగ్వేజ్ దీని పూర్తి రూపం. ఈ పరీక్షను నిర్వహించే సంస్థ ఈటీఎస్(ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్). కాగా అదే సంస్థ టోఫెల్ రాసే వ్యక్తులకు టెస్ట్ ప్రిపరేషన్‌లో సహకరించేందుకు 'టోఫెల్ టెస్ట్ రెడీ'ని ప్రకటించింది. ఇదో ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ప్లాట్‌ఫారం. ఈ వేదిక ఔత్సాహికులకు నేరుగా పర్సనలైజ్డ్ స్టడీ ప్లాన్స్, ప్రాక్టీస్ టెస్ట్, ఇంగ్లీష్ ప్రొఫిసియెన్సీకి సంబంధించి ఫీడ్‌బ్యాక్ అందిస్తుంది. దీన్లో ఫ్రీ, పెయిడ్ సర్వీసులు రెండూ ఉన్నాయి. ఇంగ్లీష్‌లో నైపుణ్యాలు అంటే రీడింగ్, లిజనింగ్, స్పీకింగ్, రైటింగ్ కాంపోనెంట్స్ నాలుగూ ఉంటాయి. టోఫెల్ ప్రిపరేషన్ విషయంలో సర్వసమగ్రంగా ఉండేలా దీన్ని తీర్చిదిద్దారు. వినూత్న ఫీచర్లు, ప్రిపరేషన్ రిసోర్సులతో ఉంది. అందుకోసం ప్రస్తుతం ఉన్న టోఫెల్ ఐబీటీతో కలిపేశారు. ఇందులో ప్రధానంగా పర్సనలైజ్డ్ ప్రిపరేషన్ ప్లాన్స్ ఉంటాయి. వ్యక్తుల అవసరాలను అనుసరించి టైలర్డ్ స్టడీ షెడ్యూల్స్ ఉంటాయి. వీడియోలు, కోర్సులు, బుక్స్, టిప్స్, ప్రోగ్రెస్ ట్రాకింగ్ టూల్స్‌కు యాక్సెస్ కూడా కల్పిస్తారు.

పెయిడ్ సర్వీస్‌లో ప్రధానంగా సెక్షన్ టెస్ట్స్ ఉంటాయి. టెస్ట్ సెక్షన్లన్నీ పూర్తి చేసిన తరవాత స్కోర్స్‌కు తోడు గుర్తించిన లోపాలు, సరిదిద్దుకోవాల్సిన తప్పులతో సమగ్రంగా ఇన్‌సైట్స్ కూడా అందిస్తారు. సెక్షన్ ప్రాక్టీస్ కింద క్వశ్చన్/ ఒక సెక్షన్ పరిధిలో టాస్క్ లెవెల్‌పై ఫీడ్‌బ్యాక్, ఇన్‌సైట్స్ అందిస్తుంది. శాంపుల్ రెస్పాన్సెస్ కూడా ఉంటాయి. ఫోకస్డ్ ప్రాక్టీస్ కింద టార్గెటెడ్ ఇంప్రూవ్‌మెంట్‌కు ఆస్కారం కల్పిస్తుంది. ఇది కూడా సెక్షన్ ప్రాక్టీస్ మాదిరిగానే ఉంటుంది. అయితే లక్ష్య కేంద్రీకృతంగా ఉంటుంది. ఏఐని ఉపయోగించడం ద్వారా వ్యక్తిగతంగా సూచనలు, సలహాలు అందించే వీలు ఉంటోంది. తద్వారా ప్రొఫెసియెన్సీ విషయంలో గరిష్ఠీకరణకు తోడ్పడుతుంది.

ఉచిత వెర్షన్‌లో డైలీ స్కోరింగ్ యాక్టివిటీ, పర్సనలైజ్డ్ ప్రిపరేషన్స్, పూర్తి స్థాయిలో స్టడీ మెటీరియల్ అంటే వీడియోలు, కోర్సులు, పుస్తకాలు, ప్రోగ్రెస్ ట్రాకింగ్ ఉంటాయి. మొత్తమ్మీద ఇదో కాంప్రహెన్సివ్ టెస్ట్ ప్రిపరేషన్ ప్లాట్‌ఫారం అని ఈటీఎస్ అధికారిక ప్రకటనలో తెలిపింది.

కేంద్రీయ హిందీ సంస్థాన్ కోర్సులు



ఆగ్రాలోని కేంద్రీయ హిందీ సంస్థాన్- డీఈఎల్ఈడీ, బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఒక్కో దానిలో 44 సీట్లు ఉన్నాయి. వీటిని హిందీ భాషేతర రాష్ట్రాల అభ్యర్థులకు ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. పూర్తి సమాచారం కోసం ఫిబ్రవరి 17 నాటి ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ చూడవచ్చు.

హిందీ శిక్షణ్ ప్రవీణ్(డీఈఎల్ఈడీ)

గుర్తింపు పొందిన బోర్డు నుంచి హిందీ ఒక సబ్జెక్ట్‌గా ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. పదోతరగతి స్థాయిలో హిందీ సబ్జెక్ట్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు హిందీలో ఇంటర్ లెవెల్ సర్టిఫికెట్ కోర్సు లైన కోవిద్, భూషణ్ పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. హిస్టరీ(ఇండియన్ హిస్టరీ), జాగ్రఫీ, సివిక్స్(ఇండియన్ పాలిటీ, పొలిటికల్ సైన్స్), సోషియాలజీ(ఇండియన్ సొసైటీ అండ్ కల్చర్), ఎకనామిక్స్(ఇండియన్ ఎకానమీ, బిజినెస్ ఎకనామిక్స్) సబ్జెక్టుల్లో ఒకదాన్ని ఇంటర్ స్థాయిలో చదివి ఉండాలి.

హిందీ శిక్షణ్ పారంగత్(బీఈడీ)

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి హిందీ ప్రధాన సబ్జెక్ట్‌గా కనీసం 50 శాతం మార్కులతో బీఏ/ఎంఏ పూర్తి చేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. హిందీ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై హిందీలో బీఏ లెవెల్ డిప్లొమాలైన విద్వాన్, రత్న, శాస్త్రి పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. హిస్టరీ(ఇండియన్ హిస్టరీ), జాగ్రఫీ, సివిక్స్ (ఇండియన్ పాలిటీ, పొలిటికల్ సైన్స్), సోషియాలజీ (ఇండియన్ సొసైటీ అండ్ కల్చర్), ఎకనామిక్స్ (ఇండియన్ ఎకానమీ, బిజినెస్ ఎకనామిక్స్) సబ్జెక్టుల్లో ఒకదాన్ని డిగ్రీ స్థాయిలో చదివి ఉండాలి.

హిందీ శిక్షణ్ నిష్ణాత్(ఎంఈడీ)

హిందీ మెథడ్ స్పెషలైజేషన్‌తో బీఈడీ కోర్సు ఉత్తీర్ణులైనవారు; హిందీ శిక్షణ్ పారంగత్ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మార్చి 31
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** మే 26
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, గువహటి, మైసూర్, నాగ్‌పూర్, భువనేశ్వర్, బరోడా, కోల్‌కతా
- **చిరునామా:** రిజిస్ట్రార్, కేంద్రీయ హిందీ సంస్థాన్, హిందీ సంస్థాన్ మార్గ్, ఆగ్రా-282005
- **వెబ్‌సైట్:** www.hindisansthan.in

జాబ్ కార్నర్

బామర్‌లో జూనియర్ ఆఫీసర్లు

ప్రభుత్వ సంస్థ బామర్ అండ్ కంపెనీ లిమిటెడ్‌లో రెగ్యులర్/ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టులు: 16

1. మేనేజర్(సేల్స్): 1 పోస్టు
2. అసిస్టెంట్ మేనేజర్: 2 పోస్టులు
3. ఆఫీసర్/జూనియర్ ఆఫీసర్(ట్రావెల్స్): 11 పోస్టులు
4. జూనియర్ ఆఫీసర్(కమర్షియల్): 1 పోస్టు
5. జూనియర్ ఆఫీసర్(ఫారెక్స్): 1 పోస్టు

అర్హత: బ్యాచిలర్ డిగ్రీ/ఎంబీఏ/గ్రాడ్యుయేట్ ఇంజనీర్
దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 1
వెబ్‌సైట్: www.balmerlawrie.com

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

రామగుండంలోని ఎన్ఎఫ్ఎల్, ఈఐఎల్, ఎఫ్‌సీఐఎల్ జాయింట్ వెంచర్ అయిన రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్(ఆర్ఎఫ్‌సీఎల్)... కింద పేర్కొన్న నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 35

1. జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ప్రొడక్షన్): 11 పోస్టులు
2. ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ప్రొడక్షన్): 6 పోస్టులు
3. జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(మెకానికల్): 3 పోస్టులు
4. ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ఎలక్ట్రికల్): 1 పోస్టు
5. జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ఇన్‌స్ట్రుమెంటేషన్): 4 పోస్టులు
6. ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ఇన్‌స్ట్రుమెంటేషన్): 2 పోస్టులు
7. జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(కెమికల్ ల్యాబ్): 2 పోస్టులు
8. ఆఫీస్ అసిస్టెంట్ గ్రేడ్-3: 6 పోస్టులు

అర్హతలు: పోస్టులను అనుసరించి నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా ఉండాలి. పూర్తి సమాచారం నోటిఫికేషనల్‌లో చూడవచ్చు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 10
వెబ్‌సైట్: http://wwe.rfcl.co.in/



డీఆర్‌డీవోలో జేఆర్‌ఎఫ్

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, అహ్మద్‌నగర్...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 13
పోస్టులు: జూనియర్ రీసెర్చ్ ఫెలో
అర్హతలు: బీఈ/బీటెక్, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ(ఎంఈ/ఎంటెక్/ఎంఎస్), నెట్, గేట్‌లో ఉత్తీర్ణత సాధించాలి.
విభాగాలు: మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఆటో మొబైల్ ఇంజనీరింగ్.
వేతనం: నెలకు రూ.37,000 **వయోపరిమితి:** 28 సంవత్సరాలు
ఇంటర్వ్యూ తేదీలు: మార్చి 4 నుంచి మార్చి 7 వరకు
ప్రదేశం: విఆర్‌డీఈ, పీఓ: వహన్ననగర్, అహ్మద్‌నగర్-414006(మహారాష్ట్ర)
వెబ్‌సైట్: https://www.drdo.gov.in/drdo/

ఏపీలో అసిస్టెంట్ డైరెక్టర్లు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ)....ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సర్వీసులో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 7
అర్హత: బీఆర్క్ లేదా బీఈ, బీటెక్(సివిల్) లేదా బీప్లానింగ్/బీటెక్(ప్లానింగ్) లేదా ఎంఏ(జాగ్రఫీ), పీజీ లేదా టౌన్ ప్లానింగ్‌లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: 2024 జులై 1 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
పే స్కేల్: నెలకు రూ.61,960 - రూ.1,51,370
ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
దరఖాస్తు రుసుము: రూ.370. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మన్ అభ్యర్థులకు రూ.250.
ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: మార్చి 21 నుంచి ఏప్రిల్ 10 వరకు
వెబ్‌సైట్: psc.ap.gov.in/

రైట్స్‌లో ఇంజనీర్లు


గురుగావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్ లిమిటెడ్)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 19

1. డిజైన్ ఇంజనీర్: 1 పోస్టు
2. సెక్షన్ ఇంజనీర్: 2 పోస్టులు
3. ఎగ్జిక్యూటివ్: 1 పోస్టు
4. డ్రాయింగ్ అండ్ డిజైన్ ఎక్స్‌పర్ట్: 1 పోస్టు
5. అసిస్టెంట్ సేఫ్టీ అండ్ హెల్త్ ఎక్స్‌పర్ట్: 2 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
విభాగాలు: సివిల్, అకౌంట్స్, ఎస్అండ్‌టీ, ఎలక్ట్రికల్ తదితరాలు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 22
ఇంటర్వ్యూ తేదీలు: 2024 ఫిబ్రవరి 21 నుంచి 23 వరకు
ప్రదేశం: శిఖర్, ప్లాంట్ నెం.1, లైజర్ వాలే, రైట్స్ భవన్, సెక్టార్ 29, గురుగ్రాం, హరియాణా **వెబ్‌సైట్:** www.rites.com/Career

లిటిల్స్




మీకు తెలుసా?

- కోతి జాతికి చెందిన ఈ జంతువును 'బ్రౌన్ థ్రోటెడ్ స్లాత్' అని పిలుస్తారు. 42 సెం.మీ. నుంచి 82 సెం.మీ. వరకు పెరుగుతాయి.
- బరువు మాత్రం రెండున్నర కేజీలనుంచి ఆరున్నర కేజీల వరకు ఉంటాయి.
- ఇవి రాత్రి, పగలు తేడా లేకుండా రోజుకు పద్దెనిమిది గంటలు నిద్రపోతాయి. ఎక్కువగా చెట్లమీదనే జీవిస్తాయి. ఒక్కోసారి వారం పాటు నేలమీదకు దిగవు. ఇవి స్విమ్ చేయటంలో ముందుంటాయి.
- ఇవి నిదానంగా ఉంటాయి. సోమరులు అనమాట. అయితే చిటారు కొమ్మల్లో ఉండటానికి ఇష్టపడతాయి.
- రెయిన్ ఫారెస్టుల్లోని రబ్బరు చెట్ల ఆకులను తింటాయివి. మెల్లగా అరుగుతాయివి. ఆవు మాదిరి దీని కడుపులో మూడు గదులు ఉండటం వల్ల అరగని ఆకులు ఒక గదిలో నిలబడతాయి. తర్వాత తింటుంది.



- ఈ జంతువులు మధ్య దక్షిణ అమెరికాల్లో కనిపిస్తాయి. అంటే బ్రెజిల్, కొలంబియా, ఈక్విడార్, పనామా, పెరు, వెనిజులా.. లాంటి దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయి.
- వీటి గర్భధారణ సమయం 5 నుంచి 8 నెలలు. పిల్లను కనీసం పది నెలల వరకూ పెంచుతాయి. ఆ తర్వాత వదిలేస్తాయి.
- బ్రౌన్ కలర్‌తో పాటు లైట్ గ్రీన్ ఉండేట్లు కూడా కొన్ని ఉంటాయి.
- ఇవి చూడటానికి అవేక్- అలెర్ట్‌గా ఉంటాయి. అంటే నిద్రపోవటానికి రెడీగా ఉన్నట్లు వీటి ముఖాలుంటాయి. జస్ట్ చిన్న చప్పుడు వస్తేనే నిద్రలేచేంత చురుగ్గా ఉంటాయి.
- మగవాటికంటే ఆడ జంతువులు గట్టిగా అరుస్తాయి.
- స్లాత్ గోళ్లు పొడవుగా ఉంటాయి. వేగంగా చెట్లు ఎక్కగలవు. వీటి శరీరం పెద్దగా ఉన్నట్లు కనపడుతుంది. అందుకు జుట్టే కారణం.
- ఈ జంతువులు 65 మిలియన్ల సంవత్సరాల నుంచి ఉన్నాయని పరిశోధనల్లో తేలింది.
- వీటి జీవనకాలం 40 ఏళ్లకంటే ఎక్కువ ఉండదు.

దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 232

	6	1				4		
4	7		6	3				
					2		5	
	4							7
		3	7	9	8	1		
7							9	
	8		9					
				4	1		7	5
		7				6	4	

సుడోకు - 231 సమాధానం

2	3	9	8	7	1	5	4	6
7	8	4	6	5	2	1	9	3
6	1	5	4	3	9	7	8	2
3	2	1	9	8	5	4	6	7
5	4	7	3	2	6	9	1	8
8	9	6	7	1	4	2	3	5
9	5	3	2	4	8	6	7	1
4	7	2	1	6	3	8	5	9
1	6	8	5	9	7	3	2	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.